www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 264 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా. 12.00 తదుపరి త్రయోదశి; నక్షత్రం: అనూరాధ రా. 10.04 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: తె.3.27-5.00; దుర్ముహూర్తం: మ.12.44-1.28, మ.2.56-3.40; అమృతఘడియలు: ఉ.11.42-1.17; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.53 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఫిక్స్‌డ్ వడ్డీ రేటా.. ఫ్లోటింగ్ వడ్డీ రేటా..!

ఏది ఎంచుకుంటారో మీ ఇష్టం

గృహ రుణ గ్రహీతలకు బ్యాంకులు, హెచ్‌ఎఫ్‌సీల సందేశాలు

గృహ రుణ గ్రహీతలకు పెద్ద ఊరట లభించనుంది. స్థిర (ఫిక్స్‌డ్) వడ్డీ రేటులో కొనసాగాలా? లేదా చర (ఫ్లోటింగ్) వడ్డీ రేటులో కొనసాగాలా? అనే విషయాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రుణ గ్రహీతలకే వదిలేసింది. ఈ నిర్ణయం ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో బ్యాంకులు, గృహ ఫైనాన్స్ కంపెనీలు (హెచ్‌ఎఫ్‌సీ), నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ).. హోమ్ బ్రాంచ్‌కు వచ్చి మీ చాయిస్ చెప్పాలంటూ.. తమ నుంచి గృహ రుణాలు తీసుకున్న ఖాతాదారులకు మెసేజ్‌లు పంపిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు అయితే ఈ నెల 15వ తేదీ కల్లా దీనిపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేయగా హెచ్‌ఎఫ్‌సీలు మాత్రం.. ఖాతాదారులు స్వయంగా సంబంధిత శాఖకు రావాలని సూచిస్తున్నాయి.



ఏది బెస్ట్?

ఈ సందేశాలతో చాలా మంది రుణ గ్రహీతలు ఏ ఆప్షన్ ఎంచుకోవాలి? అనే సందిగ్ధంలో పడ్డారు. ప్రస్తుతం మంచి క్రెడిట్ స్కోరు ఉన్న ఖాతాదారుల గృహ రుణాలపైనా బ్యాంకులు, హెచ్‌ఎఫ్‌సీ, ఎన్‌బీఎఫ్‌సీలు ఫ్లోటింగ్ రేటు కింద 10.1 శాతం నుంచి 10.5 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. రెపో రేటు తగ్గితే.. ఈ వడ్డీ రేటూ తగ్గుతుంది. కొవిడ్‌కు ముందు స్థిర వడ్డీ రేటుపై తీసుకున్న గృహ రుణాలపైనా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు 10 నుంచి 12 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి.

తగ్గనున్న వడ్డీ రేట్లు!

ఈ ఏడాది మార్చి లేదా జూన్ నుంచి వడ్డీ రేట్లు తగ్గిస్తామని అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. అదే జరిగితే ఆర్‌బీఐ కూడా రెపో రేటు తగ్గించే అవకాశం ఉంది. జూన్ కల్లా రెపో రేటు అర శాతం మేర తగ్గే అవకాశం ఉందని ఇప్పటికే అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫిక్స్‌డ్ వడ్డీ రేటుపై గృహ రుణాలు తీసుకున్న వ్యక్తులు కొద్దిపాటి స్విచ్చింగ్ చార్జీలు ఉన్నా.. ఫ్లోటింగ్ రేటుకు మారడం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

మరింత స్వేచ్ఛ

వడ్డీ రేటు విధానంతో పాటు గృహ రుణాల కాల పరిమితిని కూడా మార్చుకునే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించింది. కాకపోతే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఇందుకు కొంత స్విచ్ ఓవర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలు కూడా పారదర్శకంగా ఉండాలని ఆర్‌బీఐ ఆదేశించింది. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులు కాలపరిమితి పొడిగించుకుని ఈఎంఐల భారం తగ్గించుకోవచ్చు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న వ్యక్తులు తమ గృహ రుణాలను పాక్షికంగా లేదా పూర్తిగా ముందుగానే చెల్లించే వెసులుబాటునీ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కల్పిస్తున్నాయి. ఒకవేళ పాక్షికంగా లేదా పెద్ద మొత్తంలో చెల్లిస్తే ఈఎంఐల భారం తగ్గించుకోవచ్చు.

ఆటోమొబైల్‌లో 98% ఫిక్స్‌డ్ రుణాలే

రిటైల్ హోమ్ లోన్లలో ఎక్కువ భాగం ఫ్లోటింగ్ రేటుపై ఉంటాయి. దాంతో ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించినప్పుడల్లా బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిస్తాయి. రిటైల్ ఆటో లోన్ల పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. దాదాపు 98 శాతం రిటైల్ ఆటో లోన్లు ఫిక్స్‌డ్ వడ్డీ రేట్లపై ఉంటాయి. దీంతో ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించినా ఈ రుణాలపై వడ్డీ రేటు తగ్గించే అవకాశం ఉండదు. అలాగే రెపో రేటు పెంచినప్పుడు మాత్రం ఈ రుణాలపై వడ్డీ రేటు నిర్ణీత కాలపరిమితి ముగిసే వరకు పెరగదు. ఈ సంవత్సరం ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీనివల్ల గృహ రుణాలు తీసుకున్న వారు లాభపడినా.. రిటైల్ ఆటో లోన్లు తీసుకున్న వారికి మాత్రం పెద్దగా ప్రయోజనం ఉండదు.

హైదరాబాద్‌లో ఐసీఎస్ఐ ఏడీఆర్ సెంటర్

హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ (ఐసీఎస్ఐ) హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఏడీఆర్ (ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజొల్యూషన్) సెంటర్ ఏర్పాటు చేస్తోంది. దేశంలోని ఈ తొలి ఏడీఆర్ కేంద్రం మార్చి 31 నాటికి ఇది ప్రారంభం కావచ్చని ఐసీఎస్ఐ ప్రకటించింది. మంచి మౌలిక వసతులున్న ఇతర నగరాల్లో కూడా ఇలాంటి కేంద్రాలను ప్రారంభించే ఆస్కారం ఉన్నట్టు ఐసీఎస్ఐ ప్రెసిడెంట్ మనీష్ గుప్తా విలేకరులకు తెలిపారు. జాతీయ న్యాయ వ్యవస్థకు మద్దతుగా ఉండడం, తద్వారా నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ సెంటర్ల ఏర్పాటు లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలో 1,05,000 మంది కంపెనీ సెక్రటరీలుండగా ఒక్క భారత్‌లోనే 71,000 మంది ఉన్నారు. వారిలో 2,600 మంది తెలంగాణలోను, 4,000 మంది దక్షిణాసియాలోను ఉన్నారు. ఐసీఎస్ఐ నల్సార్ యూనివర్సిటీ సహాయంతో హైదరాబాద్‌లో కార్పొరేట్ గవర్నెన్స్‌పై తొలి జాతీయ పరిశోధన సదస్సు నిర్వహించింది.

22,000 పైన బుల్లిష్

(జనవరి 8-12 తేదీల మధ్య వారాని



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో ట్రెండ్

గత వారం నిఫ్టీ: 21,710 (-21)

నిఫ్టీ గత వారం 21,834-21,500 పాయింట్ల మధ్యన కదలాడి 21 పాయింట్ల నష్టంతో 21,710 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 20,981, 20,334, 19,717, 19,238 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,100 బ్రేక్‌డౌన్ స్థాయి: 21,300

నిరోధ స్థాయిలు: 21,900, 22,000, 22,100 (21,800 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 21,500, 21,400, 21,300 (21,600 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ		విజయవాడ	565
హైదరాబాద్	560	విశాఖపట్నం	625
8 జనవరి			
చిత్తూరు	583	వరంగల్	562
గోదావరి	565	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	గోదావరి	84
వరంగల్	70		
కరీంనగర్	70	విజయవాడ	84
మహబూబ్‌నగర్	70	గుంటూరు	82
కర్నూలు	70	ఒంగోలు	82
విశాఖపట్నం	79	చిత్తూరు	80

కరెక్షన్‌కు అవకాశం..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమ ధోరణిలో కదలాడే అవకాశాలున్నాయి. నిఫ్టీకి 21,500 పాయింట్ల వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉండటంతో సూచీలు దిద్దుబాటుకు గురి కావొచ్చు. ఒకవేళ ఈ స్థాయిలో బ్రేకౌట్ అయితే తర్వాత 21,100 పాయింట్ల వద్ద మద్దతు స్థాయిలుంటాయి. ఇందుకు ఒకటి రెండు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. మొత్తంగా మార్కెట్లో బేరిష్ ట్రెండ్ నెలకొని ఉంది. అయితే వీయర్ ఇండెక్స్‌గా భావించే ఇండియా విక్స్ తగ్గటం సానుకూల అంశం.

స్టాక్ రికమండేషన్స్

ఐసీఐసీఐ సెక్యూరిటీస్: కంపెనీ షేర్ల డీలిస్టింగ్‌కు ఎక్స్ఛేంజీల నుంచి అనుమతి లభించింది. పైగా ఈ కౌంటర్‌లో సుదీర్ఘకాలం నుంచి మంచి కన్సాలిడేషన్ జరగటంతో మూమెంటమ్ పెరిగింది. డెలివరీ వాల్యూమ్ పుంజుకుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.757 వద్ద క్లోజైంది. ట్రేడర్లు రూ.750 స్థాయిల్లో ఈ కౌంటర్‌లోకి ప్రవేశించి రూ.785/810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.736 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సీఈఎస్‌సీ: కొన్నేళ్ల సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత ఈ కౌంటర్‌లో బుల్లిష్‌నెస్ వచ్చింది. నవంబరు నుంచి అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ అసాధారణంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.138.40 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.133/130 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.185/190 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.129 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందుస్థాన్ కాపర్: గత రెండు నెలలుగా ఈ షేరు దూసుకుపోతోంది. డెలివరీ వాల్యూమ్ అనూహ్యంగా పెరిగింది. కంపెనీ.. బ్యాంక్ రుణాలకు ఏఏ+ రేటింగ్ రావటమే ఇందుకు కారణంగా ఉంది. గత శుక్రవారం ఈ షేరు రూ.283.30 వద్ద ముగిసింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.270 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.295/315 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.255 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫినోలెక్స్ ఇండస్ట్రీస్: ఈ కౌంటర్ టెక్నికల్ చార్ట్ ఆసక్తికరంగా ఉంది. సెప్టెంబరులో డివిడెండ్ చెల్లించిన తర్వాత ఒక్కసారిగా పడిపోయిన ఈ షేరు.. త్రైమాసిక ఫలితాల అనంతరం పుంజుకున్నాయి. సమీప క్రాస్‌లైన్ నిరోధాన్ని బ్రేక్ చేశాయి. చివరి మూడు సెషన్లలో ఈ షేరు ఏకంగా 16 శాతం మేర లాభపడింది. గత శుక్రవారం రూ.237.35 వద్ద క్లోజైన ఈ షేరులో ట్రేడర్లు రూ.230/233 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.268/285 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.225 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బిర్లా సాఫ్ట్: గత ఏడాది ఆగస్టు నుంచి ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. లాభాల స్వీకరణతో చివరి రెండు వారాలుగా ఈ కౌంటర్ కరెక్షన్‌కు లోనైంది. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా రాణిస్తుండటంతో కొనుగోలుకు అవకాశం ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు రూ.716 వద్ద క్లోజైంది. ట్రేడర్లు, మూమెంటమ్ బయ్యర్స్ రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.755/790 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.658 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్ట్ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

21,850 వద్ద నిలదొక్కుకుంటేనే..



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 21,800 వద్ద రియాక్షన్‌లో పడినా మానసిక అవధి 21,500 వద్ద కోలుకుని చివరికి 20 పాయింట్ల స్వల్ప నష్టంతో 21,700 వద్ద వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యలో ముగిసింది. మైనర్ కరెక్షన్‌లో కూడా ఎలాంటి బలహీనతకు లోను కాకుండా 21,500 కన్నా పైనే ఉంది. టెక్నికల్‌గా ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. గత రెండు వారాల్లో మైనర్ రియాక్షన్లలో సైతం పునరుజ్జీవం సాధించి ర్యాలీని కొనసాగిస్తోంది. అయితే అప్రమత్త ధోరణి కనిపిస్తోంది. మరోసారి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 21,830 వద్ద పరీక్ష ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతోంది.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ 21,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధులు 22,000, 22,100. ఇక్కడ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 21,650 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతలో ప్రవేశిస్తుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయిలు 21,500, 21,450. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ 48,400-47,400 మధ్యన సైడ్‌వేస్, ఆటుపోట్ల ధోరణిలో కదలాడుతోంది. గత వారం 48,160 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్‌లో కొత్త శిఖరాల దిశగా పురోగమించాలంటే నిరోధ స్థాయి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 48,650 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శించి 48,000 స్థాయిలో నిలదొక్కుకోలేకపోతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్: నిఫ్టీకి 21,800 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాలి. 21,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే అప్రమత్తతను సూచిస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	21,810, 21,850
మద్దతు	21,650, 21,580

www.sundartrends.in

స్పోర్ట్స్

ఏడాది తర్వాత టీ20ల్లోకి..

అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్‌కు రోహిత్, కోహ్లీ



న్యూఢిల్లీ: ఏడాదికిపైగా అంతర్జాతీయ టీ20లకు దూరంగా ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చారు. ఈ నెల 11 నుంచి అఫ్ఘానిస్థాన్‌తో జరగబోయే మూడు టీ20ల సిరీస్ కోసం రోహిత్ కెప్టెన్సీలో టీమిండియాను సెలెక్టర్లు ఆదివారం ప్రకటించారు. కాగా, గాయం కారణంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్‌లు ఈ సిరీస్‌కు దూరమయ్యారు. తిలక్ వర్మ, యశస్వి జైస్వాల్, రింకూ సింగ్ సహా సౌతాఫ్రికా టూర్‌లో రాణించిన యువ జట్టులోని ఎక్కువ మంది టీమ్‌లో చోటు నిలబెట్టుకొన్నారు. శ్రేయాస్ అయ్యర్‌కు విశ్రాంతినివ్వగా.. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని కేఎల్ రాహుల్, బుమ్రా, షమిలను ఎంపిక చేయలేదని తెలుస్తోంది. బ్రేక్ కోరుకొన్న ఇషాన్ కిషన్‌ను పక్కనబెట్టిన సెలెక్టర్లు.. వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, జితేష్‌లకు అవకాశం కల్పించారు. పాండ్యా స్థానంలో ఆల్‌రౌండర్ దూబేకు చోటు దక్కింది. 2022, నవంబరులో పొట్టి ప్రపంచకప్ సెమీస్‌లో జట్టు ఓటమి తర్వాత రోహిత్, కోహ్లీ టీ20లు ఆడలేదు. అయితే, ఈ ఏడాది అమెరికాలో జరిగే టీ20 ప్రపంచకప్‌నకు ముందు టీమిండియా ఆడే చివరి ద్వైపాక్షిక సిరీస్‌లో వీరిద్దరూ జట్టులోకి రావడం విశేషం. ఈ నేపథ్యంలో ఆ మెగా టోర్నీలో రోహిత్, కోహ్లీ కచ్చితంగా ఆడే అవకాశముంది. కాగా, వన్డే ప్రపంచకప్‌లో హార్దిక్ పాండ్యా, దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో సూర్యకుమార్ గాయపడిన సంగతి తెలిసిందే. అయితే ఐపీఎల్‌కల్లా వీరిద్దరూ కోలుకొంటారని అంచనా వేస్తున్నారు.

భారత టీ20 జట్టు

రోహిత్ (కెప్టెన్), గిల్, జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, **జితేష్ శర్మ, సంజూ శాంసన్** (వికెట్ కీపర్లు), శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్, అవేశ్ ఖాన్, ముకేష్ కుమార్.

రెండు నెలలుగా పింఛన్లు లేవు!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) మాజీ ఉద్యోగులకు రెండు నెలలుగా పింఛన్లు అందడంలేదు. దీంతో దాదాపు 160 మంది మాజీ ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో శాట్స్ ఉద్యోగులకు ప్రతీ నెల 20వ తేదీ తర్వాత కానీ, జీతాలు వచ్చేవి కావు. పింఛన్లు అయితే, 2-3 నెలలకు ఒకసారి వచ్చేవి. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరే శాట్స్ సిబ్బందికి కూడా ఈనెల 4వ తేదీనే జీతాలు అందాయి కానీ, పెన్షనర్ల రాత మాత్రం ఇంకా మారలేదు. ఇతర ప్రభుత్వ విభాగాల్లోని మాజీ ఉద్యోగులకు సకాలంలో పెన్షన్లు ఇస్తున్నట్టే తమకూ చెల్లించాలని శాట్స్ పెన్షనర్లు కోరుతున్నారు.

శివకు కాంస్యం

జాతీయ 'లిఫ్టింగ్'



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సూర్యాపేట లిఫ్టర్ శివ లింగేశ్వరసాయి కాంస్య పతకం సాధించాడు. గత నెల 29న అరుణాచల్‌ప్రదేశ్ ఈటానగర్‌లో మొదలైన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. శివ సీనియర్ కేటగిరీ 73 కిలోల విభాగంలో పతకం సాధించాడు. స్నాచ్‌లో 121, క్లీన్ అండ్ జెర్క్‌లో 160, మొత్తంగా 281 కిలోల బరువెత్తి తృతీయ స్థానంలో నిలిచాడు. ఇదే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్లు 15 పతకాలు సాధించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌నకు సంబంధించి ఏపీ బాలికలు... యూత్ విభాగంలో విన్నర్‌గా, జూనియర్ కేటగిరీలో రన్నరప్‌గా నిలిచారు.

తెలుగు యోధాస్ ఓటమి

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకొని జోరు మీదున్న తెలుగు యోధాస్ జట్టుకు అనూహ్య పరాజయం ఎదురైంది. ఆదివారం జరిగిన తమ నామమాత్రపు లీగ్ మ్యాచ్‌లో యోధాస్ 27-35లో డిఫెండింగ్ చాంపియన్ ఒడిశా జగర్‌నాట్స్ జట్టు చేతిలో ఓటమి చవిచూసింది. ఈ విజయంతో ఒడిశా జట్టు ఓవరాల్‌గా 20 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. మరో మ్యాచ్‌లో ముంబై ఖిలాడీస్ 29-27తో రాజస్థాన్ వారియర్స్‌పై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్..ఫైనల్ టర్న్‌లో డిఫెన్స్ విభాగం సత్తా చాటడంతో ముంబై విజయాన్నందుకుంది. కాగా, యోధాస్‌తో పాటు ఒడిశా, చెన్నై క్విక్‌గన్స్, గుజరాత్ జెయింట్స్ జట్లు సెమీఫైనల్లో ప్రవేశించాయి.



1 అంతర్జాతీయ క్రికెట్‌లో 300 మ్యాచ్‌లాడిన తొలి ఆసీస్ మహిళా క్రికెటర్‌గా ఎలిస్ పెర్రీ. ఓవరాల్‌గా మిథాలీ, షార్లెట్ ఎడ్వర్డ్స్, సుజీ బేట్స్ ఈ ఫీట్ సాధించారు.

ఎలిస్ పెర్రీ (34 నాటౌట్)

ఆసీస్ ఆల్‌రౌండ్ షో

సిరీస్ ఆశలు సజీవం

రెండో టీ20లో భారత్ ఓటమి

ముంబై: తొలి టీ20లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత మహిళల జట్టు ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో మాత్రం నిరాశపరిచింది. అటు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించిన ఆస్ట్రేలియా జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌లో సజీవంగా నిలిచింది. దీంతో ఇక్కడే సిరీస్ పట్టేద్దామనుకున్న భారత ఆశలకు బ్రేక్ పడినట్టయింది. ఇరు జట్ల మధ్య నిర్ణాయక మ్యాచ్ మంగళవారం జరుగనుంది. కెరీర్‌లో 300వ మ్యాచ్ ఆడిన ఎలిస్ పెర్రీ (34 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 130 పరుగులు చేసింది. దీప్తి శర్మ (30), రిచా ఘోష్ (23), స్మృతి మంధాన (23) మాత్రమే ఓ మాదిరిగా ఆడారు. వేర్‌హమ్, సదర్లాండ్, గార్త్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఆసీస్ 19 ఓవర్లలో 4 వికెట్లకు 133 పరుగులు చేసి నెగ్గింది. హీలీ (26), మూనీ (20) ఆకట్టుకున్నారు. దీప్తికి రెండు వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా కిమ్ గార్త్ నిలిచింది.

పెర్రీ జోరు: ఆసీస్ ఓపెనర్లు హీలీ, మూనీ 51 పరుగులు జోడించి గెలుపు బాటలు వేశారు. ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో దీప్తి శర్మ అవుట్ చేసినా ఆసీస్ ఇబ్బందిపడలేదు. ఎలిస్ పెర్రీ చివరికంటా నిలిచి ఎడాపెడా బౌండరీలతో జోరు ప్రదర్శించింది.

ఆరంభం నుంచే వికెట్ల పతనం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో ఏ ఒక్క బ్యాటర్ నుంచి కూడా అద్భుత ప్రదర్శన కనిపించలేదు. మిడిలార్డర్‌లో రిచా శర్మ, దీప్తి శర్మ మాత్రం కాస్త ఆదుకునే ప్రయత్నం చేశారు.

రికీ అజేయ శతకం

● ఆంధ్ర 339/6 ● బెంగాల్‌తో రంజీ



విశాఖ: రికీ భుయ్ (107 బ్యాటింగ్) శతకంతో.. గ్రూప్-బిలో బెంగాల్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు దీటుగా బదులిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 119/3తో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర మూడో రోజు ఆఖరుకు 6 వికెట్లకు 339 పరుగులు చేసింది. రికీతోపాటు షోయబ్ (31) క్రీజులో ఉన్నాడు. కెప్టెన్ హనుమ విహారి (51) హాఫ్ సెంచరీ సాధించాడు. ఆకాష్ దీప్, మహ్మద్ కైఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. బెంగాల్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 409కు ఆంధ్ర ఇంకా 70 పరుగులు వెనుకంజలో ఉంది. మరో రోజు ఆట మాత్రమే మిగిలున్న నేపథ్యంలో ఈ మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

పుజార డబుల్

సౌరాష్ట్ర 578/4 డిక్లేర్డ్ ● జార్ఖండ్‌తో రంజీ



రాజ్‌కోట్: చటేశ్వర్ పుజార (243 నాటౌట్) ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 17వ డబుల్ సెంచరీతో మెరవడంతో.. గ్రూప్-ఎలో జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో సౌరాష్ట్ర పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 406/4తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌరాష్ట్ర 578/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ప్రేరక్ మన్కడ్ (104 నాటౌట్) శతకం సాధించాడు. అనంతరం జార్ఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 140/2 స్కోరు చేసింది. కుమార్ దియోబ్రత్ (74), సురాజ్ (19) క్రీజులో ఉన్నారు. సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 296 పరుగులు వెనుకబడింది. మొదటి ఇన్నింగ్స్‌లో జార్ఖండ్ 142 పరుగులకు ఆలౌటైంది.

ఖవాజా అప్పీల్ తిరస్కరణ

దుబాయ్: పాక్‌తో జరిగిన తొలి టెస్టులో చేతికి నల్లబ్యాండు ధరించి ఆడినందుకు ఆసీస్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజాను ఐసీసీ గత నెలలో మందలించింది. క్రికెటర్ తాజాగా దీనిపై చేసుకున్న అప్పీల్‌ను సైతం తిరస్కరించింది. ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధంలో చిన్నారుల మృతికి నివాళిగా నల్ల బ్యాండు ధరించినట్టు ఖవాజా తెలిపాడు. కానీ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో రాజకీయ, మతపరమైన, జాతి వివక్ష సంబంధిత కూడిన సందేశాలను ప్రదర్శించడానికి ఐసీసీ అనుమతించదు. ఖవాజా క్రికెట్ ఆస్ట్రేలియాతో పాటు తమకు కూడా సమాచారం ఇవ్వకుండానే నల్ల రిబ్బన్ ధరించాడని ఐసీసీ పేర్కొంది.

ముంబై కెప్టెన్లుగా పొలార్డ్, పూరన్

కేప్‌టౌన్: ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ మరోసారి కెప్టెన్లను మార్చింది. ఐపీఎల్‌లో హార్దిక్ పాండ్యా తరహాలోనే.. సౌతాఫ్రికా 20 లీగ్‌లో తమ జట్టు ఎంఐ కేప్‌టౌన్‌కు రషీద్ స్థానంలో కీరన్ పొలార్డ్‌ను సారథిగా నియమించింది. రషీద్ వెన్నుముక శస్త్రచికిత్సనుంచి కోలుకుంటున్నాడు. ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 10 వరకు ఎస్ఏ 20 లీగ్ జరుగుతుంది. ఇక దుబాయ్‌లో ఈనెల 19 నుంచి జరిగే ఇంటర్నేషనల్ లీగ్ (ఐఎల్) టీ20లో ఎంఐ ఎమిరేట్స్‌కు నికోలస్ పూరన్ సారథిగా వ్యవహరించనున్నాడు. ఈ జట్టు రెగ్యులర్ కెప్టెన్ పొలార్డ్ కాగా, అతను ఎస్ఏ 20లో ఆడనుండడంతో ఈ మార్పు జరిగింది.


పుణె దూకుడు

కబడ్డీ లీగ్‌లో వరుసగా ఏడో గెలుపు



ముంబై: ప్రొ.కబడ్డీ లీగ్ తాజా సీజన్ టేబుల్ టాపర్ పుణెరి పల్టన్ వరుసగా ఏడో విజయం సాధించింది. ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో పుణె 29-26తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. పుణె జట్టులో ఆల్‌రౌండర్ మహ్మద్ రెజా (8) చెలరేగగా, గౌరవ్ ఖత్రి (6), అస్లామ్ (5) రాణించారు. తలైవాస్ కెప్టెన్ సాగర్ ఏడు ట్యాకిల్ పాయింట్లతో అదరగొట్టగా, నరేందర్ (4) పర్లేదనిపించాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-35తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు నడాల్ దూరం



మెల్‌బోర్న్: ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి రఫెల్ నడాల్ వైదొలిగాడు. తుంటి గాయం తిరగబెట్టడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఆదివారం వెల్లడించాడు. గత సంవత్సరం ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్ సందర్భంగా నడాల్ తుంటికి గాయం అయింది. ఆ గాయానికి శస్త్రచికిత్స చేయించుకున్న అతడు ఆ ఏడాదంతా ఆటకు దూరంగా ఉన్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సన్నాహకంగా భావించే బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టోర్నీలో పాల్గొన్న నడాల్ క్వార్టర్స్‌దాకా వచ్చాడు. అయితే క్వార్టర్‌ఫైనల్ మూడో రౌండ్‌లో గాయం తిరగబెట్టింది. ఆ మ్యాచ్ ఓటమి అనంతరం ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి వైదొలుగుతున్నట్టు అతడు వెల్లడించాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 264

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైదరాబాద్ సిటీ *

బీజేపీపై ఉమ్మడి అభ్యర్థి



- ప్రతీచోటా ఒక్కరినే నిలిపే వ్యూహంలో ఇండియా
- సీట్లపై కసరత్తు షురూ.. నెలాఖరులోపు ముగింపు?
- ఆప్, ఆర్జేడీ, జేడీయూ, కాంగ్రెస్ మధ్య చర్చలు
- ఢిల్లీలో కాంగ్రెస్‌కు 4 సీట్లు ఇస్తామంటున్న ఆప్
- బిహార్‌లో 17:17:4:2 ఫార్ములాపై కసరత్తు

10

- పంజాబ్‌లో విడిగా పోటీకి ఆప్, కాంగ్రెస్ పట్టు



మనోళ్లే చంపేస్తున్నారా?

విదేశాల్లో వరుసగా భారత శత్రువులు హతం.. భారత గడ్డపై ఉగ్ర చర్యలకు పాల్పడ్డవారు ఖతం

పాక్, కెనడా, యూకే, నేపాల్‌లో ఇలాంటి హత్యలు.. నిజ్జర్ మృతి వెనుక భారత్ ప్రమేయంపై కెనడా ఆరోపణలు

ఈ తరహా హత్యలకు పెట్టింది పేరు మొస్సాద్.. మన 'రా' కూడా అదేబాటలో నడుస్తోందన్న అనుమానాలు

ఎవరు చంపుతున్నారో తెలియదు! ఎందుకు చంపుతున్నారో తెలియదు!! కానీ.. చస్తోంది మాత్రం భారత శత్రువులు! మతం, వేర్పాటువాదం.. ఇలా రకరకాల కారణాలతో ఇండియాలో కల్లోలం సృష్టించిన, సృష్టించాలనుకుంటున్న వారు వరుసగా మర్డరయిపోతున్నారు!! ఈ తరహా హత్యలకు పెట్టింది పేరైన ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్ తరహాలో.. వాళ్లని వెంటాడి, వేటాడి చంపుతున్నది మన 'రా' (రిసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్) ఏజెంట్లా? లేక మరెవరన్నానా? మరెవరో అయితే అది ఎవరు? అనేవి ఇప్పటిదాకా సమాధానం తెలియని ప్రశ్నలు. ఎవరైతేనేం? వీరిని చంపుతోంది మన గూఢచారులు కాకుండా మరెవరన్నా అయితే మాత్రం.. కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు లెక్క!!

10

పాక్‌లో మతగురువు అల్లామా మసూద్ దారుణ హత్య

ఇస్లామాబాద్‌లో పట్టపగలే ఘటన

తుపాకీతో కాల్చి చంపిన దుండగులు

భారత వ్యతిరేకిగా మసూద్‌పై ముద్ర

10



సాహితీ ఇన్‌ఫ్రా మోసం 1,800 కోట్లు

సీసీఎస్ ప్రత్యేక బృందంతో దర్యాప్తు జరుపుతాం

'సాహితీ' సంస్థ ఆస్తులను అటాచ్ చేస్తాం

బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తాం

హైదరాబాద్ క్రైమ్స్ జాయింట్ సీపీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచ్ ప్రాజెక్టుల పేరుతో వేల మంది వినియోగదారుల పుట్టిముంచిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మోసం విలువ రూ.1,800 కోట్లుగా ఉంటుందని హైదరాబాద్ సీసీఎస్, క్రైమ్స్ జాయింట్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. 2019లో ఈ ప్రాజెక్టును ప్రారంభించిన సాహితీ ఎండీ బూదాటి లక్ష్మీనారాయణ.. 2022కల్లా ఫ్లాట్ల నిర్మాణాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అయితే.. నిర్మాణాల్లో అడుగు ముందుకు పడకపోవడంతో 2022 జనవరి 8న యశ్వంత్ కుమార్ అనే వినియోగదారుడు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత బాధితులు సీసీఎస్‌కు వరుసకట్టారు. సుమారు 300 మంది బాధితులు తమకు న్యాయం చేయాలంటూ సీసీఎస్ ఎదుట ధర్నా చేశారు. పోలీసులు కేసు నమోదు చేసినా.. దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. ఇటీవల ఐపీఎస్ బదిలీల్లో భాగంగా సీసీఎస్-క్రైమ్స్ జాయింట్ సీపీగా బాధ్యతలు చేపట్టిన ఏవీ రంగనాథ్ పెండింగ్ కేసులపై దృష్టి సారించారు. ఈ క్రమంలో

మిగతా 12వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్ల నమూనాలు రెడీ

మూడు డిజైన్లు రూపొందించిన గృహనిర్మాణ శాఖ అధికారులు



సర్కారు పరిశీలనలో నమూనాలు

వీటి ప్రకారం నిర్మిస్తేనే రూ.5 లక్షలు!

ప్రజా పాలనలో 25 లక్షల దరఖాస్తులు

అర్హులను తేల్చాక పథకం అమలు

ప్రజాపాలనపై నేడు

సీఎం సమీక్ష

తదుపరి చర్యలపై మంత్రులు, సీఎస్, ప్రత్యేక అధికారులతో చర్చ

ప్రజాపాలన వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్న రేవంత్

1.25 కోట్ల అర్జీల రాక

మూడో గ్యారెంటీ అమలుకు సన్నాహాలు!

11

నెల రోజుల పాలనలో తృప్తి

సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణానికి 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం కింద ఆర్థికసాయం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ ఇళ్లను ఏ నమూనాలో నిర్మించాలో కూడా చెప్పనుంది. ఇందుకోసం గృహనిర్మాణ శాఖ అధికారులు మూడు రకాల ఇళ్ల నమూనాలను రూపొందించి ప్రభుత్వానికి అందజేశారు. వేర్వేరు కొలతలతో రూపొందించిన ఈ మూడు డిజైన్లు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. అయితే ఈ మూడింటిలో ప్రభుత్వం ఏదో ఒక దానిని ఎంపిక చేస్తుందా? లేక మూడు డిజైన్లనూ ఎంపిక చేస్తుందా? అన్నది తెలియాల్సి ఉంది. సొంత జాగా ఉన్న వారికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థికసాయం అందిస్తామని కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం ఎంపిక చేసిన నమూనా ప్రకారం ఇంటి నిర్మాణం చేపడితేనే ఈ సాయం అందిస్తారా.. అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అధికారులు రూపొందించిన



మూడు ఇళ్ల నమూనాల్లో.. సింగిల్ బెడ్‌రూం విధానంలో ఒకటి ఉండగా, మరో రెండు నమూనాలు డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించినవిగా ఉన్నాయి. ఇంట్లోకి ప్రవేశించే ద్వారం మొదలుకుని వాష్ ఏరియా దాకా ప్రతిదీ ఎంత వెడల్పు, పొడవు, ఎత్తు ఉండాలనే వివరాలను ఈ డిజైన్లలో అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. తొలి నమూనాను డబుల్ బెడ్‌రూం ఇల్లుగా రూపొందించారు. ఇందులో.. బేస్‌మెంట్, పునాదులు (ప్లింత్ ఏరియా) 506 చదరపు అడుగుల్లో ఉండేలా, స్లాబ్ వేసిన తరువాత ఇంటి గోడలను (కార్పెట్ ఏరియా) 430 చదరపు అడుగుల్లో నిర్మించేలా ఈ నమూనాను తయారు చేశారు. రెండు బెడ్‌రూంలతో పాటు కిచెన్, హాల్, బాత్‌రూం ఉండేలా, ఇంటిపైకి మెట్లు నిర్మించేలా ప్రతిపాదించారు. ప్రభుత్వానికి అందిన మూడు డిజైన్లలో ఇదే పెద్ద నిర్మాణంగా ఉంది. మరొకటి కూడా డబుల్ బెడ్‌రూం

మిగతా 11వ పేజీలో...



మరియం, మాల్షా షరీఫ్, మజూమ్ మాజిద్

మాల్దీవుల మంత్రులపై వేటు

ప్రధాని మోదీపై అక్కసు వెళ్లగక్కిన ఫలితం

లక్షద్వీప్ పర్యాటకం పోస్టుపై వ్యంగ్యాస్త్రాలు

మోదీని తోలుబొమ్మ, విదూషకుడన్న మరియం

భారత్‌లో దుర్వాసన.. ఎంపీ జాహిద్ కామెంట్

భగ్గుమన్న పలువురు క్రికెటర్లు, బాలీవుడ్ తారలు

ట్రెండింగ్‌గా 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్ టాగ్

నష్ట నివారణకు దిగిన మాల్దీవుల ప్రభుత్వం

ముగ్గురు మంత్రులు, ఒక ఎంపీపై చర్యలు

మాలె/న్యూఢిల్లీ, జనవరి 7: భారత్, ప్రధాని నరేంద్ర మోదీపై అక్కసు వెళ్లగక్కి ముగ్గురు మాల్దీవుల మంత్రులు భారీ మూల్యాన్ని చెల్లించుకున్నారు. తమ పదవులను కోల్పోవడంతోపాటు.. భారతీయ పర్యాటకులు మాల్దీవుల ప్రయాణాన్ని రద్దుచేసుకునేలా 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయ్యేందుకు కారకులయ్యారు. అంతే కాదు.. క్రికెటర్లు, బాలీవుడ్ తారలు, ప్రముఖులు కూడా మాల్దీవులకు వెళ్లొద్దంటూ పోస్టులు పెట్టడానికి వారి వ్యాఖ్యలు కారణమయ్యాయి. ఈనెల 2, 3 తేదీల్లో ప్రధాని లక్షద్వీపాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. అక్కడ సముద్ర తీరాన కాసేపు

మిగతా 10వ పేజీలో...

ఆధార్.. అవస్థ!

సవరణలకు రోజుల తరబడి పాట్లు

గతంలో రాష్ట్రంలో 1800 సెంటర్లు

ప్రస్తుతం 350 కన్నా తక్కువే

వాటిలో రోజుకు 50-60 టోకెన్లే

అర్ధరాత్రి నుంచే ప్రజల బారులు

ఇదివరకు మీ సేవల్లో మార్పులు

మూడేళ్ల క్రితం నిలిపివేసిన కేంద్రం

ప్రభుత్వ ఆఫీసుల్లోనే అవకాశం

సెంటర్లు పెంచాలన్నా.. విముఖత

తీవ్ర ఇబ్బందులు పడుతున్న జనం

'అభయహస్తం'తో సమస్య జటిలం



హైదరాబాద్ నానల్‌నగర్ ఆధార్ కేంద్రం వద్ద రాత్రి నిద్రించి.. ఉదయం ఆరు గంటల నుంచే ఆధార్ అప్‌డేట్ కోసం భారీగా నిరీక్షిస్తున్న ప్రజలు

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులో చిరునామా మార్చాలి.. పేరులో దొర్లిన చిన్న తప్పును సవరించాలి.. ఇతర డాక్యుమెంట్లలో ఉన్న విధంగా పుట్టిన తేదీ సరి చేయాలి.. సాధారణంగానైతే ఇందుకు పెద్దగా సమయం పట్టదు. అధీకృత ఆధార్ కేంద్రానికి వెళ్తే ఒక గంటలోనే పూర్తవుద్ది. ఆన్‌లైన్‌లో అయితే అంతకంటే తక్కువ సమయమే పడుతుంది. కానీ, ఆన్‌లైన్‌పై ఎక్కువ మందికి అవగాహన లేకపోవడం, ఆధార్ కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండడం వెరసి.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం ఆధార్ కేంద్రం తెరిచేటప్పటికే వందలాది మంది గుమిగూడుతున్నారు. ఎముకలు కొరికే చలిలోనూ అర్ధరాత్రి ఆ కేంద్రాల బయటే నిద్రిస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం పథకాలకు ఆధార్ కార్డును తప్పని సరి చేయడంతో కొన్ని రోజులుగా ఆధార్ కేంద్రాల వద్ద రద్దీ విపరీతంగా పెరిగింది. కాగా, విద్యాసంస్థల్లో ప్రవేశం పొందాలన్నా, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేయాలన్నా.. ఆధార్ లేనిదే పని జరగడం లేదు. ఒకసారి ఆధార్ పొందిన వారు అందులో వివరాలను మార్చుకునే అవకాశం ఉంది. గతంలో అన్ని మీసేవ కేంద్రాలు, అధీకృత ఆధార్ కేంద్రాల్లో కొత్త ఆధార్ కార్డుల జారీ, సవరణలకు అవకాశం ఉండేది. రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల

AADHAAR

మిగతా 12వ పేజీలో...



హైదరాబాద్‌లో గ్యాంగ్ రేప్!

యువతిపై గోదాము నిర్వాహకుల అత్యాచారం

సోదరుడిపై కోపంతో సూర్యాపేట నుంచి రాజధాని నగరానికి వచ్చిన బాధితురాలు

12

నమ్మించి బైక్ ఎక్కించుకున్న నిందితులు

బండ్లగూడలోని గోదాముకు తీసుకెళ్లి అకృత్యం

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు!



11

కొత్త జిల్లాలను రద్దు చేస్తే.. ప్రజలు

ఊరుకుంటారా?

రోడ్డు పైకి వచ్చి ఆందోళనలు చేస్తారు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మొదలైన నిరసనలు

నెల రోజుల్లోనే రాష్ట్ర సర్కారుకు అప్రతిష్ఠ

బీఆర్ఎస్ సిటింగ్‌లను మార్చితే బాగుండేది

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావు

మా కార్యకర్తలపై కాంగ్రెస్ కక్ష సాధింపు

లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటుతాం: హరీశ్

రోడ్డుకు మోకాలడ్డు

రూ.10వేల కోట్ల జాతీయ రహదారిపై బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం

భారత్ మాలలో మంచిర్యాల-విజయవాడ హైవే మంజూరు

300 కిలోమీటర్ల మార్గాన్ని సొంతంగా నిర్మించనున్న కేంద్రం

2017-18లోనే ఓకే చేసినా భూ సేకరణ విషయంలో ఉదాసీనత

ఆలస్యానికి కారణాలనూ చెప్పలేదు.. రాజకీయ విభేదాలే కారణం!

రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి కింది ఉద్యోగుల వరకు ఇదే తీరు

ప్రాజెక్టుకు టెండర్లు పూర్తయినప్పటికీ పట్టించుకోని గత ప్రభుత్వం

కాంగ్రెస్ ఆధ్వర్యంలోని కొత్త సర్కారు దృష్టిసారిస్తే అభివృద్ధికి బాట



హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రహదారులు ప్రగతి చిహ్నాలు.. అందుకే ప్రభుత్వాలు ఏవైనా రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తుంటాయి. కానీ, బీఆర్ఎస్ సర్కారు హయాంలో పదివేల కోట్ల విలువైన భారీ జాతీయ రహదారి విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపారు.. పైసా ఖర్చు చేయాల్సిన పని లేకున్నా ఐదేళ్ల పాటు సాగదీశారు.. అవసరమైన భూమిని పూర్తిగా అందించలేకపోయారు. ఈ విషయంలో రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఓ దశలో కేంద్ర ప్రభుత్వమే జోక్యం చేసుకున్నా.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కదలిక లేకపోవడం గమనార్హం. చక్కటి రోడ్లతో రాష్ట్రాల మధ్య అనుసంధానం జరిగితే వాణిజ్య, వ్యాపార లావాదేవీలు వృద్ధి చెంది, రియల్ ఎస్టేట్ రంగానికి

మిగతా 9వ పేజీలో...

పాలమూరు, చేవెళ్లకు రేవంత్

- లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సమన్వయకర్తల నియామకం
- హైదరాబాద్, సికింద్రాబాద్ బాధ్యతలు డిప్యూటీ సీఎంకు
- పొంగులేటికి 2, మిగతా మంత్రులందరికీ ఒక్కో స్థానం
- నిజామాబాద్‌కు జీవన్‌రెడ్డి, జహీరాబాద్‌కు సుదర్శన్‌రెడ్డి

11

వివిధ

కళింగాంధ్రలో నేటికీ వినపడే నన్నయ మాటలు

"మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్..." అంటూ రామరాజ భూషణుడు వసుచరిత్రలో నన్నయభట్టును శ్లేషాలంకారంతో నుతిస్తాడు. ఈ బిరుదు పదాన్నే నన్నయ్య తన భారతంలో 'తన కులబ్రాహ్మణు..' అనే పద్యంలో 'విపుల శబ్దశాసనుడు'గా రాసుకున్నాడు. అంతేకాదు ఉభయకావ్య రచనాభిశోభితుడనని, బ్రహ్మాండాది పురాణవిజ్ఞాన నిరతుడనని, ఈ విధంగా తనను రాజరాజనరేంద్రుడే ప్రశంసించినట్లు చెప్పుకున్నాడు. నాటి సాహిత్యం మీద సత్సభాంతర సరసీ వనాలలో చర్చలు జరిగేవి. తన భారతానువాదాన్ని కూడ నన్నయ ఆయా సభల్లో చర్చకు పెట్టే ఉంటాడు.

ఇలాంటి నేపథ్యంతో నన్నయ రచనను పరిశీలిస్తే మూడొంతులు సంస్కృత సమాసాలు, ఒకొంతు మాత్రమే తెలుగు పదాలతో భారతానువాదం సాగించడానికి కారణం తెలుస్తూనే ఉంది. ఐతే మానవుడు తన వేషభాషల్తో ఎంత ఉన్నతీకరించుకున్నా సహజలక్షణాలు అంతర్లీనంగా ద్యోతకమౌతూనే ఉంటాయి. సంస్కృతభాషా ప్రభావమెంతున్నా అక్కడక్కడా నాటి జనపదాల్లో వాడుతున్న తెలుగు జాతీయాలు, సామెతలు, క్రియాపదాలు ఆంధ్రభారత విహాయసంలో మిలమిలలాడుతూనే ఉంటాయి. వాటిలో నన్నయవాడిన కొన్ని తెలుగు పదాలు నేటికీ కళింగాంధ్రలో ఎలా సజీవంగా ఉన్నాయో వివరించే ప్రయత్నంచేస్తాను.

ములుకోల: " 'దీనిం జిత్తగింపుము; బలంబు గల బలీవర్దంబులతో బలహీనంబులయిన వానిం బూన్చిన నవి దుర్వహ భారవహన మహాలాంగలా కర్షణంబులయం దసమర్థంబులైన నడిచియుం బొడిచియు ములుకోలలం గుట్టియు దుర్బల బలీవర్దంబుల జనులు బాధింపం జూచి యేను దానికి దుఃఖించెద' ననిన సురభికి సురపతి యిట్లనియె" (అరణ్య-1-84)

అంటే- "ఓ ఇంద్రా! విను. బలమైన ఎద్దులతో బలంలేని ఎద్దులను పూని బరువులను లాగిస్తున్నప్పుడు, పొలాల్ని దున్నుతున్నప్పుడు బలంలేని ఎద్దులు వెనుకబడతాయి. వానిని కొట్టి, పొడిచి ములుకోలతో గుచ్చి ప్రజలు బాధించడం చూసిన నేను దుఃఖపడుతున్నాను" అని సురభి దేవేంద్రునితో పలికింది. ఈ సందర్భంలో ఈ క్రింది శ్లోకాన్ని సాక్షాత్తు వ్యాసుడే ధృతరాష్ట్రునితో అంటాడు వ్యాసభారతంలో:

"పశ్యైనం కర్షకం క్షుద్రం దుర్బలం మమ పుత్రకమ్!
ప్రతోదేనాభినిఘ్నంతం లాంగలేనచ పీడితమ్!!" (వ్యాసభారతం-వన-9-10)

"క్షుద్రుడైన కర్షకుడు నాగలితో దున్నే సమయంలో బలహీనమైన ఎద్దును బాధిస్తున్నాడు" అని ఈ శ్లోకభావం. వ్యాసుని కాలానికే ఎద్దులచేత దున్నించి వ్యవసాయంచేసే వారని, బరువులను లాగించేవారని ఈ శ్లోకాల వలన తెలుస్తోంది.

ఇక్కడ వ్యాసుడు ఐదు అనుష్టుప్ శ్లోకాలలో రాసిన సురభి పరితాపాన్ని ఒక పొడవైన వాక్యంలో సరిపెట్టాడు నన్నయ. సంస్కృత ఏకవచన బలీవర్దాన్ని నన్నయ బహువచనంలోకి మార్చి రైతుదౌష్ట్యాన్ని విస్తారం చేశాడు. నడవలేని ఎద్దులను ములుకోలతో పొడిచి నడిపిస్తారని రాశాడు. ఇక్కడ ముల్లుకోల = ములుకోల. కళింగాంధ్రలో అదే మునకాల, మునకాల కర్రగా నేటికీ వాడుతున్నారు. ఎక్కి తోలేటపుడు కొరడాను, వెనుక నడుస్తూ అదిలించడానికి ములుకోలను సాధారణంగా వాడుతుంటారు. అదే వచనంలో నన్నయ 'దుర్బల బలీవర్దంబుల జనులు బాధింపం జూచి' అని రాశాడు! ఇక్కడ జనులంటే రైతులే! ఆనాడు కొద్దిమంది తప్ప ప్రజలందరూ వ్యవసాయం చేసేవారు. ఇప్పటికీ రైతుకులాలే కాకుండా ఇతరత్రా వృత్తులు చేస్తున్నవారు కూడ వ్యవసాయం చేస్తుండడం పల్లెల్లో చూస్తుంటాం. నన్నయ నాడు రైతులే జనులు. జనులే రైతులు.

ఈ కోలను నన్నయ్యభట్టు మరోచోట కూడ వాడాడు. ఏకచక్రపురంలో బకాసురుడు వంతులవారీగా మనుషుల్ని తినేస్తుంటాడు. ఒక రోజు ఓ బ్రాహ్మణ బాలుడి వంతు వస్తుంది. ఆ సందర్భంలో ఆ బాలుడి చేష్టలను నన్నయ ఇలా వర్ణించాడు.

"బాలకుండొక కొండుక కోలచేతఁ
బట్టికొని యేన రక్కసుఁ గిట్టి చంపి
చులుక వత్తు మీరేడ్వగా వలవ దనుచుఁ" (ఆంధ్ర భారతం-ఆది-6-263)

- బాలుడు 'ఒక కర్రను పట్టుకొని ఆ రాక్షసుడ్ని చంపి సులువుగా వస్తాను. మీరు ఏడవ వద్దు.' అని అంటాడు. ఈ పద్యంలోని కోల, చులక రెండు పదాలు నేటికీ వాడుకలో ఉన్నాయి. కోల అంటే కర్ర అని చెప్పుకున్నాం కదా! చేనేత వృత్తిలో కూడ 'కోల' వాడుక ఎక్కువ. కోలను ఆయుధంగా కూడ వాడేవారు. 'చులక'ను చులాగ్గా అని, సులాగ్గా అని నిత్యం ఉపయోగిస్తూనే ఉంటారు కళింగాంధ్రలో.

అవురుగంట వేళ్లు: "ఏమాతని పితృపితామహులము. మా పట్టిన యవురు గంట వేళ్ళల్లం గాలుండు మూషిక వ్యాజంబునం దరతరంబ కొఱికిన నొక్కవేర తక్కియున్నయది." (ఆది-2-144)

ఇది జరత్కారుని కథలోనిది. జరత్కారుడు పెళ్ళిచేసుకోకపోవటం వల్ల కొడుకులు లేక జరత్కారుని వంశానికి చెందిన పితృపితామహులు ఊర్ధ్వలోకాలు పొందలేక అవురుదుబ్బుల వేళ్ళకు వేలాడుతూ ఉండిపోతారు. ఒక్కటి మినహా అన్ని వేళ్ళనూ ఎలుక రూపంలో యముడు కొరికేశాడు. ఈ విషయాన్ని జరత్కారునికే అతని పితృపితామహులు పై వాక్యంలో చెబుతారు.

ఐతే నన్నయ్య ముందరి వచనంలోనే "వీరణతృణ స్థంభంబు నవలంబించి.." (ఆది-2-141) అని వ్యాసభారతంలో ఉన్న 'వీరణ' పదాన్ని వాడుకున్నాడు. ఇక్కడ దానిని మళ్ళీ రాయవలసివచ్చి 'అవురుగంటలు' అనే స్థానిక వాడుకపదబంధాన్ని వాడాడు. అవురు గంటలు నేటికీ పొలాల్లో పెరుగుతుంటాయి, రైతులు వాటిని తొలగిస్తుంటారు. రాయలువారు కూడ తన ఆముక్తమాల్యదలో "గంటలు దున్నక మంటి.." (ఆము-4-124) అని రాశారు. గంటలు అంటే దుబ్బులు. 'అవురుదుబ్బులు' కళింగాంధ్రవాడుక.

గొడిగ రాళ్లు:

"అరుణ సరోరుహ రమ్య మృదులంబులైన యీ తన్వి
చరణతలంబులు గొడిగరాలపైఁ జనుచున్కిఁ జేసి
పరుసంబులై కడు నెఱ్ఱ నైనవి..." (అరణ్య-3-299)

పాండవులు గంధమాదన పర్వతానికి వెళుతున్నప్పుడు ద్రౌపది నడవలేక మూర్ఛిల్లింది. ఆ సమయంలో ధర్మరాజు ఆమెను చూచి "ఎర్రతామర పూలవలె సుకుమారమైన ద్రౌపది పాదాలు గొడిరాళ్ళ మీద నడవడం వలన మరింత ఎర్రబడ్డాయి" అంటూ విలపించాడు. ఐతే సంస్కృత భారతంలో వ్యాసుడు ఇలా రాయలేదు.

"సుకుమారౌ కథం పాదౌ ముఖం చ కమలప్రభ!
మత్కృతే ద్య వరార్హాయాః శ్యామతాం సముపాగతమ్!!"
(వన-144-11)

"సుకుమారమైన ఈమె పాదాలూ, పద్మకాంతి కల ఈ ముఖమూ నాకోసం నల్లబడి పోయాయి" అని భావం. నన్నయ ఇక్కడ ఆమె ముఖాన్ని వదలి, పాదాలు ఎర్రని గొడిగరాళ్ళపై నడవడం వలన మరింత ఎరుపెక్కాయని చెప్పడం సందర్భోచితంగా ఉంది. తెలుగుతనం ప్రతిబింబిస్తోంది. తరువాతి పద్యంలో 'పరుసంపు ఱాలపైఁబడి తీవ్రవేదనఁ బొందినయది' అంటూ 'ఈ రాజపుత్రిఁ దోడ్కొని దారుణ పాషాణ దుష్పథంబులఁ జనఁగా నేర; మిది నడువ నోపదు..' (అరణ్య-3-302) అని ధర్మరాజు భీమునితో అనడం కూడా ఈ గొడిగ రాళ్ళ ప్రాధాన్యత తెలియజేస్తుంది.

గొడిగరాళ్ళు = గుండ్రని చిన్న రాళ్ళు. గొడిరాళ్ళు కళింగాంధ్ర జనులవాడుక. వీటిని వడిసెలలో పెట్టి విసిరి కొడతారు. ఆంగ్లంలో గ్రావెల్. నేడు ఈ ఆంగ్ల పదమే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. పర్యాయపదం గులకరాళ్ళు అని పండితాభిప్రాయం.

గొప్పు: గ్రొప్పు = గ్రొచ్చు + గొచ్చు = గొప్పు....

"మిన్న మిడుఁగుఱు లట్టులై మెఱసి రెండు మెఱుఁగు లొక పుట్టలో నున్న నెఱుఁగ కేను బుట్ట గ్రొప్పించి" (అరణ్య -3-179)

"పుట్ట కన్నాల్లో రెండు మెఱుపులు కనిపిస్తే అవేంటో తెలియకుండానే పుట్టని తవ్వించాడు." నేటికీ కళింగాంధ్రలో గొప్పుతవ్వడం రైతులు చేస్తుంటారు. మెరక పొలాల్లో వేరుసెనగ వంటి మొక్కల మధ్య బొరిగలతో గొప్పు తవ్వుతారు. నేలను నీరు కోతపెడితే గొచ్చింది అని అంటారు. శబ్దరత్నాకరంలో గ్రొచ్చు పదానికి 'గుద్దలి లోనగు వాటిచే పల్లముచేయు' అని అర్థం ఇచ్చి "వ్రాత యందిది పరుషాదిగా గానబడుచున్నది" అని అన్నారే గాని గ్రొప్పు పదాన్ని స్పృశించలేదు. నన్నయ ప్రయోగాన్ని వారు చూడలేదనిపిస్తోంది.

మొదవు: "మృదు రోమములును, శంకునిభ కర్ణముల్, మెత్తని వలుఁద పొదుఁగును....మొదవిది నిధి సేరినట్లు సేరె నిమ్మునికి." (ఆది-7-99)


మొదవు = పాడియావు. ఈ నాటికీ రైతులు పాడియావును మొదవు అనే పిలుస్తారు. మొదవు లాగున్నాడు అంటూ కళింగాంధ్రలో ఎగతాళిగా తిడతారు.

పొలుసు: "మీన్పొల వచ్చు జాలరిదాన" (ఆది-3-40) "చేపల కంపు వస్తున్న జాలరి దానను" అని అర్థం. 'పొల'ను కంపు అనే అర్థంలో గ్రంథాలలో వాడినా నేడు చేపలపై నున్న పొట్టు అనే అర్థంలో పొలుసు అనే పదాన్నే విస్తారంగా వాడుతున్నారు. పొల నుండి వచ్చిందే పొలసు, పొలుసు. అప్పటి జాలరులు నేడూ ఉన్నారు. భారతంలోని సత్యవతి కుటుంబం ఎలాగైతే పడవ నడిపి జీవించేదో నేటికీ జాలరులు అలాగే పడవ నడుపుతూ, చేపలు పట్టి, అమ్ముకుంటూ జీవిస్తున్నారు. జాలము అనగా వల. జాలములు కలిగినవారు జాలరులు. జాలారులు.

ఎఱుకు: "ఏయ రెఱచి యాహారముగ మను నెఱుకు లయిన" (ఆది-5-53). ఆంధ్రభాషలో తొలి గ్రంథంలోనే స్థిరపడిన 'ఎఱుకుల'వారు నేటికీ ఆంధ్రదేశంలో విస్తారంగా ఉన్నారు. వరి వంటి ధాన్యాలను దాచుకోడానికి వెదురుతో గాదెలు, పొడకలు, బుట్టిలు వంటి పెద్ద వస్తువులను తయారు చేస్తారు. పక్షులను వేటాడి అమ్ముకొని, తిని జీవిస్తుంటారు. ఎఱుకులసాని వీరి ఇంట పుట్టినదే కదా!


కోమటి: "పచరింతు రంగడులఁ గోమటు లప్పురి నిద్ధ రత్నముల్" (ఆది-8-73) వైదిక సంప్రదాయంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర అని చెప్తూవస్తున్న నన్నయభట్టు ఇక్కడ కోమటి అనే వ్యవహారవాచకాన్ని వాడాడు. ఇంద్రప్రస్థపురం లోని కోమటులు అక్కడి అంగడులలో జాతిరత్నాలను ప్రదర్శిస్తున్నారట. నన్నయ ప్రారంభించిన ఈ నగరవర్ణన, నగరిలోని కులాలను వర్ణించడం తరువాతి కవులకు ఆదర్శం అయింది. జైనమతంలోని పశుసంపద కలిగిన గోమఠులే కోమటులయ్యారని, వర్తకం చేస్తూ సంపన్నులుగా స్థిరపడ్డారని చరిత్ర. ఈ పద్యంలోని అంగడి సరుకు నేడూ వాడుకలో ఉంది.

ఈ విధంగా నన్నయ భారతానువాదాన్ని తరచిచూస్తే పైన ఉదాహరించినవే కాకుండా చెఱువులు, నూతులు వంటి నామవాచకాలు, ముండ్ల గండ్ల, ముచ్చుగొఱక వంటి పదబంధాలు, తూనీగల గొఱ్ఱు పెట్టు వంటి నానుడులు, ఎన్నో క్రియాపదాలు ఈనాటికీ కళింగాంధ్రలో వాడుతుండడం గమనించవచ్చు. నన్నయభట్టు కళింగానికి పడమటి సరిహద్దు రాజమహేంద్రవరంలో నివసించడం, మధ్యాంధ్రలో జరిగినంత సాంస్కృతిక పరిణామం ఈ ప్రాంతంలో జరగకపోవడం వలన కూడ ఆయా పదాలు వెయ్యేళ్ళు అయినా కళింగాంధ్రలో ఇంకా నిల్చి ఉన్నాయని చెప్పవచ్చు.



> నన్నయభట్టు కళింగానికి పడమటి సరిహద్దు రాజమహేంద్రవరంలో నివసించడం, మధ్యాంధ్రలో జరిగినంత సాంస్కృతిక పరిణామం ఈ ప్రాంతంలో జరగక పోవడం వలన కూడ ఆయా పదాలు వెయ్యేళ్ళు అయినా కళింగాంధ్రలో ఇంకా నిల్చి ఉన్నాయని చెప్పవచ్చు.

గార రంగనాథం
98857 58123



మందుపాతర

యెన్నిసార్లు చెప్పినా
కప్పలా అదే ప్రపంచంలో
జీవిస్తావు కానీ
చెవిమీద పేను వారదు
యెన్ని కన్నీళ్ళు కార్చినా
బొమ్మలా చూస్తూ ఉండిపోతావు కానీ
నీ మనసు అస్సలు మారదు

ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే
ఇక కనుమూయటమనే
చిన్న ఆటొక్కటే మిగిలున్నదన్న
విషయమన్నా తెలుసా

తిరనాళ్ళలో తప్పిపోయినట్టు
ఎక్కడో కాటుగలిసిపోయిన
ఏ చోటో ఉండి ఉంటాడులే అని
మనసుకు సర్ది చెప్పుకుందుము

కళ్ళ ముందే తూట్లు పడుతున్న
నీ శరీరాన్ని చూస్తూ
ఊరికే ఉండగలమా?
పస్తులుంటూ
పచ్చడిమెతుకులకే పరిమితమయి
గుడ్డిగుడిసెకు
జీవితాన్ని కట్టేసుకున్నవాళ్ళు
ఎంతమంది ఎదురుపడటంలేదు

నువ్వు నమ్ముతున్న మందుసుక్కలు
ఇంటిగోడల మధ్య
చిచ్చుపెట్టే మందుపాతరలు
నీ తలను తుంచిపడేసే వేటకత్తులు
నిండు దీపాన్ని
ఆర్పేసుకోవటానికి నువ్వెవరు
గొంతులోంచి బయటికొచ్చే
శబ్దాన్ని ఉరితీసుకోవటానికి
నీవెవరు

పావలా సంపాదించకున్న
నిన్ను కన్నబిడ్డలా సాదే
ఆమెదే నీ దేహం
తాగొచ్చి పక్కలో
ఉచ్చపోసిన్నాడే
నీ శరీరంతో నీకు సంబంధం తెగిపోయింది
పుచ్చిపోయిన నీ కాలేయం
మరణశయ్య మీదికెక్కకముందే
మనిషిగా మారు

పలుపలు ఆలోచనల దారాలు కట్టుకొని
తెలియని ఆకాశానికి ఎగిరిపోకు
ఈ కొద్దిరోజులు
నీ అవయవాలకు పట్టిన
బూజును కాస్తా దులుపుకుంటే
ఇల్లు కుదుటపడుతుంది

తండ హరీష్ గౌడ్
89784 39551



పగుళ్ళు

నా నిక్కచ్చితనం నా ధనం
ఏ దుఃఖం నను తాకదు.
తెరపై తోలుబొమ్మలాట చూడు
యుద్ధం, నాట్యం రెండూ ఒకలాగే ఉంటాయి.
నాలోనూ అంతే!

ఎందుకంటే విషాదం
నన్నెపుడో ద్రవీకరించింది.
ఇక ఇక్కడ పగిలేందుకేం లేదు.
ప్రవహించడమే ఉంది.

విశాలమైన గదుల్లో
ఒంటరి మనసులు
ఫ్లడ్ లైట్ల వెలుతురు కింద చీకటి
నీడలై బిక్కు బిక్కుమంటున్నా,
గెలుపుకోసం ఆటగాడు వేలంపాటలో నిలుచున్నా,
పదవి పందేరంలో
చట్టం అంతరించిపోతున్నా,
గొడ్డళ్ళు, వేటకొడవళ్ళు
ప్రతి కథలో హింస కక్కుతున్నా,
ఏం చేయాలో పాలుపోక

పొత్తిళ్ళలో పసిపాప
నిద్రకు కావలి కాస్తూ
ఒక తెమ్మెరనై మిగిలిపోతాను.
మాటలు నేర్చుకునే బాల్యానికి
తేటదనం మప్పుతాను.
విభేదించే వారికి
ఓ చిరునవ్వు కానుకనిస్తాను.

కాళ్ళకూరి శైలజ
98854 01882

రెండు కవితా సంపుటాల ఆవిష్కరణ

అమ్మంగి వేణుగోపాల్ 'ముఖచిత్రం', అమ్మంగి కవితా స్వామి 'ముందడుగు' కవితా సంపుటాల ఆవిష్కరణ సభ జనవరి 13 మధ్యాహ్నం 1.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో జి. చెన్నకేశవరెడ్డి, నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, టి.వి. నరసింహస్వామి, పి.లక్ష్మీనారాయణ, తిరునగరి దేవకీదేవి, తదితరులు పాల్గొంటారు.

జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక

'వేదిక' సాహిత్య చర్చ

'వేదిక' ఆధ్వర్యంలో శైలజ చందు కథ 'అమృతం'పై చర్చ, నోర ఎఫ్రాన్ ఆంగ్ల కథకు స్వప్న పేరి పరిచయం జనవరి 13 సాయంత్రం 7 గంటలకి జరుగుతాయి. వివరాలకు: 81426 42638.

అనిల్ అట్లూరి

అలిశెట్టి రాష్ట్ర స్థాయి పురస్కార ప్రధాన సభ

అలిశెట్టి ప్రభాకర్ పురస్కార సభ కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో జనవరి 12న సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది. స్వీకర్త కవయిత్రి తోట నిర్మలారాణి.

తెలంగాణ రచయితల వేదిక

యుద్ధం ఉవాచ

నా పొలికేక ముందు-
సకల కళలూ..
రాతిబొమ్మకు అమ్మ చనుబాలు!
సమస్త విజ్ఞానాలూ..
కార్చిచ్చులో జల్లిన విత్తనాలు!
యావత్తు తత్వాలూ..
అడుగుజాడకే నోచని బాటలు!


నా క్షిపణి వేగం ముందు -
మానవ ప్రస్థానం..
కొయ్యగుర్రంపై వేల ఏళ్ళ స్వారీ!
చరిత్ర..
బావురుమనిపించే
ఛలోక్తుల సంపుటి!

వి-రాగి
99593 65373



"టూరిస్టు వేరు, ట్రావెలర్ వేరు"

నిమ్మగడ్డ శేషగిరి ఇంగ్లీషులో రాసిన మొరాకో యాత్రా కథనాన్ని 'ఊహలకందని మొరాకో' అంటూ తెనిగించిన దాసరి అమరేంద్రతో ముఖాముఖి:



మీరు స్వయంగా రచయిత, యాత్రా కథనాలు కూడా వెలువరించారు. ఈ అనువాదం చేపట్టడానికి కారణం ఏమిటి?

నేను 1990 నుంచి రాస్తున్నాను. నా మొదటి రచన 'మూడు నగరాలు' అన్న యూరప్ యాత్రా గాథ. నా అనుభవాలూ అనుభూతులూ పాఠకులతో పంచుకోదగ్గవి అనిపించినపుడల్లా రాసాను. యాత్రా కథనాలతో పాటు కథలు, వ్యాసాలు రాసాను.

రాయడం కన్నా చదవడం నాకు ఇష్టమైన ప్రక్రియ. ఇంగ్లీషులో కొన్ని కథలు, నవలలు చదివినపుడు వీటిని తెలుగు పాఠకులకు చేర్చాలి అన్న తపన కలుగుతూ ఉండేది. అలా 1990ల నుంచి అనువాదం చేసాను. చేస్తున్నాను.

కొన్ని ఇంగ్లీషు ట్రావెలాగ్స్ చదివినపుడు వాటిని అనువదించాలి అన్న కోరిక కలిగేది. కాపీ రైట్స్ లాంటి కారణాల వల్ల అది తీరని కోరికగానే ఉండిపోయింది. ఆ నేపథ్యంలో శేషగిరి గారు 2021లో ఫేస్‌బుక్‌లో పెడుతోన్న 'మొరాకో' పోస్టులు చూసాను. బాగా నచ్చాయి. వెంటనే ఆయన అనుమతి తీసుకుని అనువదించాను. ఒక వెబ్ పత్రికలో పన్నెండు భాగాలుగా సీరియలైజ్ అయిన తర్వాత ఈ 'ఊహలకందని మొరాకో' పుస్తకాన్ని వెలువరించాం.

ఒక యాత్రికుడిగా ఈ అనువాదాన్ని చేయడంలో కలసి వచ్చిన విషయాలు, ఎదురైనా ఇబ్బందులు చెబుతారా?

మూల రచయిత శేషగిరికీ నాకూ ప్రయాణాల విషయంలో అనూహ్యమైన భావ సారూప్యం ఉంది. ప్రదేశాలూ ప్రకృతీ మనుషులూ స్వీయాన్వేషణ, ఆ క్రమమే మా ఇద్దరి యాత్రలకూ ప్రేరణ. అలాగే మేమిద్దరం ప్రయాణాలు చేసే పద్ధతులూ బాగా కలుస్తాయి. కుటుంబంతో కలిసి వెళ్లడం, స్నేహితులతో వెళ్లడం, సోలో ప్రయాణాలు, ట్రెక్కింగు వీటన్నిటినీ మేము ఇష్టపడతాము. ఈ సారూప్యాల వల్ల మొరాకో యాత్ర విషయంలో శేషగిరిగారి అనుభవాలతో నేను అవలీలగా భావైక్యం పొందగలిగాను. అంచేత అనువాదం ఎంతో సులభమైంది.

శేషగిరి తన అనుభవాలను ఇంగ్లీష్‌లో రాసినా ఆయనదీ నాదీ ఒకే మాతృభాష అవడం నాకు బాగా ఉపకరించింది. ఇద్దరి మూలాలూ ఒకే భాషా సంస్కృతికి చెందడం వల్ల నేను అనువాదంలో తెలుగు నుడికారాలూ జాతీయాలూ సామెతలు విరివిగా వాడగలిగేను. ఇలాంటి మార్పులు చేసే విషయంలో శేషగిరి నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చేరు.

ఇహ ఇబ్బందులూ సవాళ్ల దగ్గరికి వస్తే, మొరాకో నాకు బొత్తిగా తెలియని ప్రదేశం. ఒక యాత్రా గాథను అనువదించాలంటే, ఆ మాటకొస్తే ఏ రచనైనా అనువదించాలంటే ఆ ప్రాంతపు భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ వివరాల ప్రాథమిక అవగాహనైనా అవసరం. అక్కడి భాషలు, జాతులు, ఆచార వ్యవహారాలు కొంతైనా తెలియడం అవసరం. మొరాకో పూర్తిగా అపరిచితం కాబట్టి పై విషయాలు తెలుసుకోవడానికి ఎంతో అధ్యయనం చెయ్యవలసి వచ్చింది.


> కొత్త ప్రదేశాలకు వెళ్లి, క్షణాల్లో అక్కడ ఇమిడిపోవడం, వారివారి భాషా సంస్కృతులను తాత్కాలికంగానైనా తనవిగా చేసుకోవడం, అక్కడివారిలో ప్రతిబింబాలు వెతుక్కోవడం, ఆ ప్రక్రియలో తనలోకి తాను ప్రయాణించడం, ఇవి యాత్రికుని మౌలిక లక్షణాలు. ఈ బాణీ అనుభవాలూ అనుభూతులూ మనకు 'ఉహలకందని మొరాకో' లాంటి యాత్రాగాథల్లో కనిపిస్తాయి.

ఈ రచన చదువుతున్నపుడు ఒక సాటి యాత్రికునిగా మొరాకో విషయంలో మీరు గమనించిన ప్రత్యేక అంశాలు ఏమిటి?

ఈ పుస్తకాన్ని చదవడం, అనువదించడం పుణ్యమా అని మొరాకో నాకు అతి సన్నిహితమయింది. నేనే ఆయా ప్రదేశాలు తిరిగిన అనుభూతి కలిగింది. ఒక యాత్రికుడిగా ఆ అనుభూతిని వ్యక్త పరచాలంటే ముందుగా నా మనసుకు తట్టే విషయం ఆ దేశంలోని చారిత్రిక సాంస్కృతిక వైవిధ్యత. క్రీస్తుశకం 44వ సంవత్సరం నాటి రోమన్ల సామ్రాజ్య విస్తరణలో భాగంగా వాళ్ళు నిర్మించిన ఓబుబునిస్ నగరం, 1920లలో కొద్ది సంవత్సరాలు ఫ్రెంచ్ వారి పాలనలో ఉండి, మొరాకో దేశంలో ఇప్పటికీ అత్యంత యూరోపీసీయత సంతరించుకొని మనుతోన్న కాసాబ్లాంకా, రెండో ప్రపంచ యుద్ధం ముగిశాక ఆనాటి వ్యవస్థలను నిరసిస్తూ 1960లలో 'బీట్ జెనరేషన్' అంటూ గళమెత్తిన కవులూ కళాకారులకు కేంద్రబిందువుగా నిలచిన టాంజీర్ నగరం, స్పానిష్ ముద్రనిండిన టెటువాన్, పోర్చుగీసు అడుగుజాడలు కనబడే స్వీరా, అరబ్బుల సంస్కృతీ కేంద్రం మెకానెస్, ఇలా ఒక చిన్న దేశం భిన్న సంస్కృతులకు నిలయమవడం నన్ను అబ్బురపరచింది.

అలాగే ఆధునికయుగంలో బానిసలు అనగానే ఆఫ్రికా వాసులే గుర్తుకు వచ్చే నాకు 17వ శతాబ్దంలో మౌలే ఇస్మాయిల్ అన్న సుల్తాన్ మెక్నెస్ నగరాన్ని రాజధానిగా చేసుకొని దేశాన్ని పాలించినపుడు ఆయన అధీనంలో ముప్పైవేల శ్వేతజాతి బానిసలు ఉన్నారన్న సంగతి ఊహకు అందని విషయం. మరింతగా శోధిస్తే అదంతా నిజమేననీ, 16-19 శతాబ్దాలలో పదీ పన్నెండు లక్షల మంది తెల్ల బానిసలు ఉత్తర ఆఫ్రికా సుల్తానుల ఆధీనంలో ఉండేవారని తెలిసింది.

మొరాకో దేశపు సాంస్కృతిక రాజధాని ఫెజ్ నగరంలో ఉన్న ఖైరవాన్ విశ్వవిద్యాలయం ప్రపంచమంతటిలోను అవిచ్ఛిన్నంగా కార్యకలాపాలు కొనసాగిస్తోన్న అతి పురాతన విశ్వవిద్యాలయం అని విన్నపుడు మూల రచయిత శేషగిరి నమ్మలేదు. నేనూ నమ్మలేదు. కానీ యునెస్కో వాళ్ళు, గిన్నీస్ వాళ్ళు ఆ విషయం నిర్ధారించారని తెలిసాక ఔరా! అనిపించింది.



మొరాకోలో శేషగిరికి తటస్థపడిన మహిళలు, వాళ్ళు సాధించిన - సాధిస్తోన్న సాధికారత మరో విశేషమైన అంశం. అంతా మహిళలే నడిపే భోజనశాలలు, చైనా వెళ్లి పీజీ చెయ్యబోతోన్న మహిళ, చీకట్లు విడవకముందే రైలు ప్రయాణం ఆరంభించి బిజినెస్ పనిమీద వన్ డే ట్రిప్ వేస్తోన్న కార్పొరేట్ మహిళ, వీళ్లందరినీ చూస్తే ముస్లిం దేశం అనగానే అక్కడి మహిళల స్థాయి గురించి నాలో స్థిరపడి ఉన్న భావనలు బద్దలయ్యాయి.

ఇతర సాహితీ ప్రక్రియల అనువాదానికి, యాత్రా కథనాల అనువాదానికి మధ్య భేదం ఏమైనా ఉందా? ఉంటే అది ఎటువంటిది?

ఏ ప్రక్రియలోనైనా అనువాదకుడు తానూ కూడా రచయిత అయి ఉండటం అత్యవసరం కాదుగాని ఎంతో వాంఛనీయం. ఒక సృజనాత్మక రచయితకు మరో భాషలోని రచయిత ఆత్మను పట్టుకోవడం సులభమవుతుంది.

ఈ నేపథ్యంలో ఒక కవి కవిత్వాన్నీ, ఒక కథకుడు కథలనూ అనువదించడం కాస్తంత సులభమవుతుంది. అలాగే ఒక యాత్రికుడు మరో యాత్రాగాథను అనువదించడం సులభమవుతుంది. ఉదాహరణకు ఉన్నత శిఖరాలు అధిరోహించే ట్రెక్కర్ ఆ శిఖరాలు చేరుకోడానికి పడే శ్రమ, మానసిక వత్తిడి మరో ట్రెక్కర్ మాత్రమే పరిపూర్ణంగా పట్టుకుని అనువదించగలడు. నా వరకు నేను కథలూ నవలలూ వ్యాసాలూ అనువదించడం కన్నా ఈ యాత్రా గాథను అనువదించడానికి సమయం రీత్యా అనుభవాల అన్వయం రీత్యా, సముచితమైన భాషను వాడటం రీత్యా ఎక్కువ శ్రమించాల్సి వచ్చింది.

'అన్నీ గూగుల్ లోనే ఉన్నాయి' అన్న ఇప్పటి కాలంలో 'ఉహలకందని మొరాకో' లాంటి పుస్తకాల ప్రాసంగికత ఎంత?

ముందుగా ఒక విషయం మనం స్పష్టంగా చెప్పుకోవాలి. టూరిస్టు వేరు, ట్రావెలర్ వేరు. వింతలూ విశేషాల కోసం ప్రయాణాలు చేసే టూరిస్టుల విషయంలో గూగుల్ సమాచారం వారి లక్ష్యాలకు కొంత వరకైనా దోహదం చేస్తుంది. జిజ్ఞాస పిపాసలు మూల ప్రేరణగా, అనుభవాలూ అనుభూతుల కోసం ప్రపంచాన్ని కౌగిలించుకోవడానికి వెళ్లే యాత్రికుల విషయంలో గూగుల్ సమాచారాలు నిర్వహించే పాత్ర దాదాపు శూన్యం. కొత్త ప్రదేశాలకు వెళ్లి, క్షణాల్లో అక్కడ ఇమిడిపోవడం, వారివారి భాషా సంస్కృతులను తాత్కాలికంగానైనా తనవిగా చేసుకోవడం, అక్కడివారిలో ప్రతిబింబాలు వెతుక్కోవడం, ఆ ప్రక్రియలో తనలోకి తాను ప్రయాణించడం, ఇవి యాత్రికుని మౌలిక లక్షణాలు. ఈ బాణీ అనుభవాలూ అనుభూతులూ మనకు 'ఉహలకందని మొరాకో' లాంటి యాత్రాగాథల్లో కనిపిస్తాయి.

ఇంటర్వ్యూ: కె.ఎస్. మురళి శంకర్
94401 34256

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.4 కనిష్ఠం 18.5


కూకట్‌పల్లిలో జరిగిన పోటీలో ముగ్గు వేస్తున్న సినీ నటి సునీత


ఎల్బీనగర్‌లో ముగ్గును తీర్చిదిద్దుతున్న యువతి


సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో ముగ్గుల పోటీ


తార్నాక జోన్‌లో జరిగిన పోటీల్లో మహిళలు

ముగ్గు వేస్తున్న చిన్నారి


కూకట్‌పల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

హరిదాసు వేషధారణలో కళాకారుడు నాకరాజు




తార్నాక పరిధిలో జరిగిన పోటీలో ఆకట్టుకున్న ముగ్గులు

ముగ్గు మురిసింది..

ఆకట్టుకున్న రంగవల్లులు

- వైభవంగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న యువతులు, మహిళలు
- తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తూ తీరొక్క ముగ్గులు

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళామణులు వేసిన రంగులతో ముగ్గు మురిసింది. పుడమి పులకించింది. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) భాగ్యనగరంలో సంక్రాంతిని ముందే తీసుకొచ్చాయి. చిన్నారులు, యువతులు, మహిళలు, వయోధికులు చుక్కల ముగ్గులేసి ఆకట్టుకున్నారు. తెలుగు సంస్కృతిని, పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించారు. గ్రేటర్‌లోని 11 ప్రాంగణాల్లో ముత్యాల ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ప్రతీ కేంద్రంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 6,000, రూ.4,000, రూ.3,000 అందించారు.


అబిడ్స్‌లో ముగ్గు వేసేందుకు సామగ్రితో మహిళ




అమీర్‌పేట పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు



ముందస్తు మహోత్సవ్

నెక్లెస్‌రోడ్‌లో గుజరాతీలు సందడి చేశారు. త్వరలో జరగనున్న గుజరాతీ ఏక్తా మహోత్సవ్ - 24లో భాగంగా ఆదివారం పీవీ నర్సింహారావు మార్గంలోని పీపుల్స్‌ప్లాజా నుంచి 2కే ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక వేషధారణలు, వింటేజ్ కార్లు, బైక్, రథాలపై ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.
- ఖైరతాబాద్, (ఆంధ్రజ్యోతి)

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

- సివిల్ వివాదాల్లో తలదూర్చొద్దు
- సీపీ సుధీర్‌బాబు హెచ్చరిక


ఇన్‌స్పెక్టర్ సతీష్

హైదరాబాద్ సిటీ/పహాడీషరీఫ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ వ్యవహారంలో తలదూర్చిన పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌ను సస్పెండ్ చేస్తూ రాచకొండ సీపీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో విచారణ జరిపిన కమిషనర్ ఆరోపణలు నిజమని తేలడంతో సతీష్‌పై వేటు వేశారు. పోలీసు అధికారులు భూ వివాదాల్లో తలదూర్చవద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు. కొందరు పోలీస్

మిగతా 4వ పేజీలో..

థర్డ్‌డిగ్రీ కేసు.. ట్రాఫిక్‌కు ఎస్ఐ, కానిస్టేబుల్ 6


అభిమాని కుటుంబంతో కలిసి భోజనం చేస్తున్న కేటీఆర్

అభిమాని ఇంటికి కేటీఆర్

- ట్విట్టర్‌లో ఆహ్వానానికి స్పందన
- మూగ, చెవిటి చిన్నారుల వైద్యానికి సహకరిస్తానని హామీ

4

సంక్రాంతి స్పెషల్ బస్సులు ప్రారంభం



హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి స్పెషల్ బస్సులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని, ఆ మేరకు బస్సులు పెంచుతామని రంగారెడ్డి ఆర్ఎం శ్రీధర్ తెలిపారు. 4,484 ప్రత్యేక బస్సుల్లో 626 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు.

నేడు సర్కిల్, జోనల్ స్థాయిలో ప్రజావాణి

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సర్కిల్, జోనల్ స్థాయిలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తారు.

ఘనంగా మల్లన్న కల్యాణం


6

రోడ్డుపై మెట్రో సాధ్యమా?

- పనులపై ఎండీ సమీక్ష
- నిర్మాణ వ్యయం తగ్గించేలా ప్రణాళికలు

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అమీర్‌పేట స్టేషన్ మాదిరిగా చాంద్రాయణగుట్ట వద్ద భారీ స్టేషన్‌ను నిర్మించి ఇక్కడి నుంచే అటు ఎయిర్‌పోర్టుకు, ఇటు పాతబస్తీ, ఎల్బీనగర్, నాగోలుకు ప్రజారవాణా మెరుగు పరిచేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. కొత్త హైకోర్టు వద్ద ట్రూ లైన్, సర్ఫలైన్ (షార్ట్ లైన్) రూపొందించాలని, ప్రధానంగా మైలార్‌దేవ్‌పల్లి - ఎయిర్‌పోర్టు రోడ్డు కొంత భాగంలో ఎట్ గ్రేడ్ మెట్రో (రోడ్డుపై మెట్రో)ను నడిపించడం సాధ్యమా అనేదానిపై అధికారులు చర్చించారు. ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం రసూల్‌పురాలోని మెట్రో భవన్‌లో ఇంజనీరింగ్ నిపుణులు, సీనియర్ అధికారులతో మేధోమథనం నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం


సమీక్ష నిర్వహిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

సవరించిన మెట్రో ఫేజ్-2 ప్రతిపాదలనపై దాదాపు రెండున్నర గంటలపాటు సమీక్షించారు.

సాంకేతిక అంశాల పరిశీలన

రెండో దశలో నాగోలు - ఎల్బీనగర్ మధ్య ఉన్న 5 కిలోమీటర్ల మార్గాన్ని కలపడంతో పాటు ఎల్బీనగర్ నుంచి - మైలార్‌దేవ్‌పల్లి జంక్షన్-పీ7 రోడ్డు నుంచి ఎయిర్‌పోర్టు వరకు ఒకే మార్గాన్ని వేయాలని ప్రభుత్వం ఇటీవల ఖరారు చేసింది. ఎంజీబీఎస్ - ఫలక్‌నుమా మధ్య ఉన్న 5.5 కిలోమీటర్లకు అదనంగా మరో ఒకటిన్నర కిలోమీటరును పొడిగించి చాంద్రాయణగుట్ట వరకు తీసుకెళ్లడం, అక్కడ ఇంటర్‌ఛేంజ్ చేయడాన్ని ముఖ్యమైన అంశంగా పరిశీలిస్తున్నారు. చాంద్రాయణగుట్ట వద్ద ఇరుకైన రహదారి ఉండడంతోపాటు ఇప్పటికే అక్కడ ఫ్లై ఓవర్ ఉందని, వీటిని దృష్టిలో ఉంచుకుని రైలు వెనక్కి తిప్పడం, నడుస్తున్న లైన్లకు అదనపు లైన్ ఏర్పాటులో తలెత్తే సాంకేతిక అంశాలపై అధ్యయనం చేయాలని చర్చించారు.

ఎయిర్‌పోర్టు కనెక్టివిటీకి..

నాగోలు - ఎల్బీనగర్-ఓవైసీ ఆస్పత్రి - చాంద్రాయణగుట్ట - మైలార్‌దేవ్‌పల్లి - ఆరాంఘర్ - కొత్త హైకోర్టు వరకు 19 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కొత్త హైకోర్టు వద్ద ట్రూ లైన్, సర్ఫలైన్ (షార్ట్ లైన్) రూపొందించాలని సూచించారు. ప్రధానంగా మైలార్‌దేవ్‌పల్లి- ఎయిర్‌పోర్టు రోడ్డులో

మిగతా 4వ పేజీలో..

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల సాధనకు సంప్రదింపులు

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యతోపాటు రూ.10 లక్షల ఆరోగ్య భద్రత హెల్త్ కార్డులు సాధించేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. మేనిఫెస్టోలో పొందుపరిచిన జర్నలిస్టు సంక్షేమ అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి అర్హులైన జర్నలిస్టులందరికీ అందించేందుకు కృషి చేస్తామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ తెలిపారు. ఆదివారం ఉప్పల్ భగాయత్ యూనియన్ కార్యాలయ స్థలంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌తోపాటు వివిధ జిల్లాలలో కొన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో మాట్లాడాలని నిర్ణయించినట్లు అల్లం నారాయణ పేర్కొన్నారు. జర్నలిస్టులకు నగదు రహిత హెల్త్ కార్డులు చలామణి అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్, ఉపాధ్యక్షులు రమేష్ హజారే, బీఆర్ లెనిన్, అబ్దుల్లా, ఆదినారాయణ, తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, ఐజేయూ జాతీయ కార్యదర్శి రాజమౌళి చారి, కార్యవర్గ సభ్యులు అవ్వారీ భాస్కర్‌లతోపాటు అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్రంలోని 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా విష్ణువర్ధన్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారిగా పి.యోగానందం ఎన్నికయ్యారు.

పర్యాటక సంస్థ ఎండీగా రమేష్‌నాయుడు బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టీఎస్‌టీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.రమేష్‌నాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. హిమాయత్‌నగర్‌లోని టీఎస్‌టీడీసీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌నాయుడును మంత్రి జూపల్లి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిసిన రమేష్‌నాయుడు

అభిమాని ఇంటికి కేటీఆర్

హైదరాబాద్ / బోరబండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు.. తన ఇంటికి ఆతిథ్యానికి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావును బోరబండకు చెందిన ఇబ్రహీంఖాన్ ఈనెల 2న ట్విట్టర్ (ఎక్స్) ద్వారా ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను వెంటబెట్టుకొని ఆయన ఇంటికి వెళ్లి ఇబ్రహీంఖాన్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. గాజుల వ్యాపారం చేసే ఇబ్రహీంఖాన్ ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేస్తే.. దివ్యాంగులైన తన పిల్లలకు కేటీఆర్ ఆసరా పెన్షన్ మంజూరు చేయించిన విషయాన్ని ఆ కుటుంబం గుర్తు చేసింది. కేటీఆర్ ఇంటికి రావడంపై సంతోషం వ్యక్తం చేసింది. సాధారణ పౌరుడు తమ ప్రభుత్వ సేవలకు గుర్తింపుగా ఇంటికి ఆహ్వానించడం సంతోషాన్ని కలిగించిందని, వినికిడి లోపం ఉన్న ఇబ్రహీం ఖాన్ పిల్లల వైద్యం కోసం చేయూతనందిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ హామీ ఇచ్చారు.

పాతకక్షలతో వ్యక్తి హత్య


షేక్ అఫ్రోజ్(ఫైల్)

మదీన, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పాత గొడవల కారణంగా ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.దాలి నాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఫైలార్‌దేవ్‌పల్లి దానమ్మ జోపిడికి ప్రాంతానికి చెందిన షేక్ అఫ్రోజ్(45) శనివారం అర్ధరాత్రి బహదూర్‌పురా వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో తాడ్‌బన్‌లో ఇద్దరు వ్యక్తులు తారసపడ్డారు. షేక్ అఫ్రోజ్‌తో ఉన్న పాత కక్షల నేపథ్యంలో వారు అతనితో గొడవ పడ్డారు. మాటామాటా పెరగడంతో దగ్గరున్న కత్తితో అఫ్రోజ్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన షేక్ అఫ్రోజ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. కేసును ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుప రాడ్డు గుచ్చుకొని కార్మికుడి మృతి

కుషాయిగూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇనుప రాడ్డు గుచ్చుకొని ఓ కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ సూర్యానగర్‌లో నివసించే ఉపేందర్ రాం(33) ఇరవై రోజుల క్రితం చర్లపల్లి ఫేజ్-5లోని సిప్రా క్రేన్స్‌లో పనికి కుదిరాడు. శనివారం క్రేన్ కంపెనీలో పని చేస్తుండగా, ఇనుపరాడ్డు కడుపులో గుచ్చుకొని గాయాలపాలయ్యాడు. అతన్ని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ శేఖర్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన ఉపేందర్ రాం

ఎయిర్‌పోర్టు టోల్ వద్ద మత్తులో వీరంగం

● ముగ్గురిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలోని బారులో మద్యం ప్రియులు వీరంగం సృష్టించారు. శనివారం ఉదయం యూకే నుంచి వచ్చిన ఇద్దరు, వారిని రిసీవ్ చేసుకునేందుకు వచ్చిన మరికొందరు కలిసి ఎయిర్‌పోర్టులోని బార్‌లో మద్యం తాగారు. అనంతరం వారు ఇంటికి వెళ్లే క్రమంలో టోల్ వద్ద జీఎంఆర్ సిబ్బంది రెండు కార్లకు పార్కింగ్ చార్జీలు అడిగారు. దీంతో మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు చార్జీ ఎందుకివ్వాలంటూ టోల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగి దాడి చేశారు. అంతటితో ఆగక రెండు కార్లతో రాంగ్ రూట్‌లో వెళ్లి బారికేడ్లను ధ్వంసం చేసుకుంటూ పరారయ్యారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు. కారు నంబర్ల ఆధారంగా గొడవపడ్డ వారు సిద్దిపేట జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

కొత్త హైకోర్టు వద్ద త్రూలైన్

(3వ పేజీ తరువాయి)

కొంత భాగంలో ఎట్ గ్రేడ్ మెట్రో (రోడ్డుపై మెట్రో)ను నడిపించడం సాధ్యమవుతుందా.. లేదా.. అనేదానిపై మాట్లాడారు. సీఎం సూచన మేరకు ఫేజ్-2 నిర్మాణంలో వీలైనంత తక్కువ ఖర్చుతో పనులను పూర్తి చేయడంపై సమీక్షించారు.

ఫేజ్-1, ఫేజ్-2 కనెక్టివిటీలు కలపాలి..

ఫేజ్-1లోని కారిడార్ల నుంచి త్వరలో చేపట్టనున్న ఫేజ్-2 కొత్త కారిడార్లకు అతుకులు లేని ప్రయాణాన్ని అందించేలా డీపీఆర్‌లను సిద్ధం చేయాలని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వివిధ రాష్ట్రాలు, దేశాల్లో మెట్రో రైలు సంస్థలు అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని సీనియర్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లను ఆదేశించారు.

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

(3వ పేజీ తరువాయి)

శాఖకు చెడ్డపేరు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పహాడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ హిమాయత్‌నగర్‌లో రెండెకరాల భూ వివాదంలో ఒకరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు సీపీ ఆదేశించారు. విచారణ అధికారులు ఇన్‌స్పెక్టర్ సతీష్ ఈ వ్యవహారంలో తలదూర్చినట్లు తేల్చడంతో సతీష్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు.


స్వప్నకు మొదటి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళికాకిరణ్


యాద లక్ష్మికి రెండో బహుమతి అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రేఖా, కౌన్సిలర్ ఉషారాణి, ఆంధ్రజ్యోతి సిబ్బంది


నవ్యకు మూడో బహుమతి అందజేస్తున్న నార్సింగ్ కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళికా కిరణ్, కాంగ్రెస్ గండిపేట మండల అధ్యక్షుడు అశోక్‌యాదవ్

సప్తవర్ణ శోభితం

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన


మొదటి బహుమతి పొందిన ముగ్గు


రెండో బహుమతి పొందిన ముగ్గు


మూడో బహుమతి పొందిన ముగ్గు

(మెహిదీపట్నం జోన్ బృందం): మహిళలు వేసిన రంగు రంగుల ముగ్గులతో ఆ ప్రాంతమంతా సప్తవర్ణ శోభితమైంది. దాదాపు అన్ని రంగవల్లులు సంప్రదాయాలకు అద్దంపట్టాయి. సంక్రాంతిని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ : స్వర్గసీమ సుకేతన) పోటీలు ఆదివారం నార్సింగ్ మున్సిపాలిటీలోని నార్సింగ్ హైట్స్ కాలనీ అరుణోదయ పార్కు వద్ద జరిగాయి. మెహిదీపట్నం జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు, యవతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రెండు గంటలపాటు ఈ ముగ్గుల పోటీ కొనసాగింది. అనంతరం విజేతలకు బముమతులను ప్రదానం చేశారు. ఈ పోటీలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, ఆయనతో పాటు నార్సింగ్ మున్సిపల్ చైర్మన్ రేఖాయాదగిరి, కౌన్సిలర్లు లక్ష్మీ ప్రవళికా కిరణ్, ఉషారాణి, పత్తి ప్రవీణ్, వసంత్‌రావు, రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గండిపేట మండల అధ్యక్షుడు క్యాతమ్ అశోక్‌యాదవ్, ఉపాధ్యాక్షుడు కోటా వేణుగౌడ్, కాంగ్రెస్ నాయకులు కె.రాము, వినోద్, మహేందరగౌడ్, కొల్లూరు శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు రాజేష్‌యాదవ్, మణికొండ ఆల్ కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ్ల, బండ్లగూడ ఆల్ కాలనీ ఫెడరేషన్ కార్యదర్శి నరేందర్‌బాబు, పీ అండ్ టీ కాలనీ ఉపాధ్యక్షుడు నదీమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ ముత్యాల ముగ్గు కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి డీజీఎం ఆర్.ఆర్.నాయుడు, జోన్ ఇన్‌చార్జి విష్ణుజెట్టి, స్టాఫ్ రిపోర్టర్ కొమ్ము రాజు, సబ్‌ఎడిటర్ విఠల్ ఆంధ్రజ్యోతి బృందం జి.అరవింద్ యాదవ్, నర్సింహ, బి. గోవింద్‌రావు, భీమలింగారెడ్డి, నరేందర్, రాజు, బాలకృష్ణా తదితరులు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీల కార్యక్రమానికి స్పాన్సర్‌గా కార్పొరేటర్ కొల్లూరు లక్ష్మీ ప్రవళిక కిరణ్ వ్యవహరించారు.

విజేతలు వీరే..

ఈ పోటీలలో మొదటి బహుమతి స్వప్న గెలుచుకోగా ఈమెకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ముగ్గుల పోటి స్పాన్సర్ అయిన కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళికతో కలిసి బహుమతి అందజేశారు. రెండో బహుమతి యాద లక్ష్మీ గెలుపొందగా ఈమెకు నార్సింగ్ మున్సిపల్ చైర్మన్ రేఖాయాదగిరి, కౌన్సిలర్ ఉషారాణి బహుమతి ప్రదానం చేశారు. నవ్యకు మూడో బహుమతి పొందారు. నవ్యకు నార్సింగ్ కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళికా కిరణ్, కాంగ్రెస్ గండిపేట మండల అధ్యక్షుడు క్యాతమ్ అశోక్ యాదవ్‌తో కలసి బహుమతి అందజేశారు. వీరితో పాటు మిగతా పోటి దారులకు కన్సులెషన్ బహుమతులు అందజేశారు.

మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది: స్వప్న

మెహిదీపట్నం జోన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో నేను పాల్గొన్నాను. ఈ పోటీలో రాష్ట్ర స్థాయి విజేతగా నిలువాలని నా ఆశయం. నా ముగ్గును ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలో మొదటి బహుమతికి ఎంపిక చేయడం సంతోషంగా ఉంది.

ముగ్గుల పోటీ ఉత్సాహం నింపింది: యాద లక్ష్మి

పోటీపడి ముగ్గులు వేయడం నాకెంతో ఉత్సాహంగా ఉంది. నా కష్టానికి ఫలితం లభించింది. న్యాయ నిర్ణేతలు నా ముగ్గును ద్వితియ బహుమతికి ఎంపిక చేయడం సంతోషంగా ఉంది.

పోటీలో పాల్గొనడం సంతోషంగా ఉంది: నవ్య

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గు పోటీలో పాల్గొన్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. అంతేగాక పోటీలో తృతియ బహుమతికి నా ముగ్గు ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నాను.


ముగ్గులు వేస్తున్న మహిళలు

కనులపండువగా

ముగ్గుల పోటీలు


ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న జాతీయ క్రీడాకారుడు జానకీరామ్


చార్మినార్ జోన్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారితో అతిథులు, జడ్జిలు, ఆంధ్రజ్యోతి సిబ్బంది


కన్సోలేషన్ బహుమతులు అందజేస్తున్న శ్రీ శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు సాయిమల్లిక్

చార్మినార్ జోన్ బృందం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ : స్వర్గసీమ సుకేతన) పోటీ ఆదివారం చార్మినార్ జోన్ పరిధిలోని గౌలిపురా ఆలే నరేంద్ర స్పోర్ట్ కాంప్లెక్స్ (మిత్ర క్లబ్)లో కనులపండువగా జరిగింది. 85 మంది యువతులు, మహిళలు పాల్గొని రంగురంగుల ముగ్గులను వేశారు. ఈ పోటీలు ఉదయం 10:30 గంటల నుంచి 12:30 వరకు ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీలలో ప్రథమ బహుమతిని ఎర్రగడ్డకు చెందిన టి.విజయలక్ష్మి, ద్వితీయ బహుమతిని అఫ్జల్‌గంజ్‌కు చెందిన జి.దేవీ, తృతీయ బహుమతిని జియాగూడకు చెందిన రవళి గెల్చుకున్నారు. పోటీలో పాల్గొన్న 85 మందికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలకు స్పాన్సర్లుగా గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ బోజ్యా నాయక్, షర్ఫుద్దీన్ హామెద్, రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ శ్రీ శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు పెంద్యాల సాయిమల్లిక్ ఆర్థిక సాయం అందజేశారు. గౌలిపురాలోని సారస్వత అకాడమీ హైస్కూల్ టీచర్లు శ్యామల, మంజుల జడ్జిలుగా వ్యవహరించారు. పోటీలకు ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ఛత్రినాక ఎస్ఐ శోభ, జల్‌పల్లి మాజీ ఎంపీటీసీ షర్ఫుద్దీన్ హామెద్, బుద్వేల్ శ్రీ శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకులు పెంద్యాల సాయిమల్లిక్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి క్రైమ్ రిపోర్టర్ అబ్దుల్ ఖదీర్, సబ్ ఎడిటర్ ఉడుతల శ్రీనివాస్, చార్మినార్ జోన్ విలేకరులు ఎ.భీమయ్య, టి.సాయికిరణ్, మహ్మద్ జాఫర్, మహ్మద్ రఫీక్, కుమార్, ఫొటోగ్రాఫర్ అనిల్, జాతీయ స్థాయి మాజీ క్రీడాకారులు జానకిరామ్ పాల్గొన్నారు.


మొదటి బహుమతి పొందిన ముగ్గు


ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు


తృతీయ బహుమతి పొందిన ముగ్గు

ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం: కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

ముగ్గులను వేయడం నేటి యువతరం మర్చిపోతున్నది. అలాంటి సమయంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయం. ప్రతి సంవత్సరమూ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి కృతజ్ఞతలు.

సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తున్నారు: శోభ, ఎస్ఐ ఛత్రినాక

మన సంస్కృతి, సంప్రదాయాలను నేటి యువత మర్చిపోతున్నారు. ఇది బాధాకరం. ఇలాంటి తరుణంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముందుకు వచ్చి ఒక పండుగలా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం.

మహిళల నైపుణ్యానికి ముగ్గులు అద్దం పట్టాయి: షర్ఫుద్దీన్ హామెద్, మాజీ ఎంపీటీసీ, జల్‌పల్లి

ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో మహిళలను ప్రోత్సహించడానికి ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషకరం. మహిళలు వేసిన ముగ్గులు వారి నైపుణ్యానికి అద్దం పట్టాయి.

ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉంది: టి.విజయలక్ష్మి

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముగ్గుల పోటీలో నాకు ప్రథమ బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఇలాంటి ముగ్గుల పోటీల వల్ల మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది.

ముగ్గుల పోటీల్లో పాల్గొనడం రెండోసారి: జి.దేవి, అఫ్జల్‌గంజ్

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో గత ఏడాది కూడా పాల్గొన్నాను. ఈసారి రెండో బహుమతి రావడం సంతోషంగా ఉంది. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీ నాలో మరింత ఉత్సాహాన్ని నింపింది.

మొదటిసారే బహుమతి.. : రవళి

ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో మొదటిసారి పాల్గొని బహుమతి గెల్చున్నాను. ఇలాంటి పోటీల ద్వారా మహిళల్లో నూతనోత్తేజం పెరుగుతుంది.

ఆబిడ్స్‌లో విశేష స్పందన

ప్రధాన ఆకర్షణగా నిలిచిన గంగిరెద్దు విన్యాసాలు


వసంతకు రెండో బహుమతి అందజేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్


మొదటి బహుమతి పొందిన ముగ్గు


రెండో బహుమతి పొందిన ముగ్గు


మూడో బహుమతి పొందిన ముగ్గు


జోత్స్నకు మొదటి బహుమతి అందజేస్తున్న కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్, కిషన్ యాదవ్


ముగ్గుల పోటీల్లో విజేతలతో ఆంధ్రజ్యోతి సిబ్బంది

అఫ్జల్‌గంజ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ : స్వర్గసీమ సుకేతన) పోటీ ఆదివారం ఆబిడ్స్ జోన్ ఆధ్వర్యంలో గౌలిగూడలోని శ్రీ జంగల్ విఠోబా దేవాలయం అలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ పోటీలకు గౌలిగూడ, బేగంబజార్, నాంపల్లి, చాదర్‌ఘట్, గోషామహల్, పురానాపూల్ తదితర ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. ఈ పోటీలకు జాంబాగ్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్, జంగల్ విఠోబా దేవాలయం అధ్యక్షులు వి.కిషన్ యాదవ్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జి.అశీష్ కుమార్ యాదవ్, భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి జనరల్ సెక్రటరీ విజయ్ భాస్కర్, తెలంగాణ బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు, స్వామి వివేకనంద యువజన అధ్యక్షులు, గోషామహల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.సతీష్ గౌడ్, బేగంబజార్ కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్ తనయుడు గొంటి తరుణ్ యాదవ్, తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్, బీజేపీ బేగంబజార్ డివిజన్ సీనియర్ నాయకులు బోయిని వెంకటేశ్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కె.మురళీధర్ రెడ్డి, న్యాయ నిర్ణేతలు జయప్రద, సిటీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ పావనీ, మాజీ హెడ్ మాస్టర్ రమణి, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకురాలు అరుణ జ్యోతి, బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ మహిళా విభాగం ఇన్‌చార్జి శీలం సరస్వతీ ఆర్య, సేవా భారతి అధ్యక్షురాలు రేణుక, పార్వతీ, 'ఆంధ్రజ్యోతి' సిటీ ఎడిషన్ ఇన్‌చార్జి సలీం, సబ్ ఎడిటర్ కల్లూరి సుందర్, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ అశోక్, ఆబిడ్స్ జోన్ విలేకర్లు కాలే అమర్‌నాథ్, ఆకుల శ్యామ్ సుందర్, మహ్మద్ ఖాజా, అబిడ్స్ జోన్ ఏడీవీటీ ఇన్‌చార్జి అనిల్ కుమార్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేసి ఘనంగా సత్కరించారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్
https://ejyothy.com/Y0s0Pxx లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.com లో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఎఫ్‌ఎల్‌ఓ హైదరాబాద్ బిజినెస్ అవార్డుల ప్రదానం

అఫ్జల్‌గంజ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అవకాశం దొరికితే ఆకాశమే హద్దుగా రాణిస్తామని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం కోఠి మహిళా విశ్వవిద్యాలయంలోని దర్బార్ హాల్ వద్ద ఎఫ్ఐసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్, యంగ్ ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన మహిళలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మంత్రి సీతక్క, నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అవార్డు గ్రహతలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ఎడ్యూకేషన్ కమిషన్ దేవసేన, ఐపీఎస్ అభిశా, మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజ్జులత, ఎఫ్ఎల్‌ఓ నేషనల్ ప్రెసిడెంట్ పింకీ రెడ్డిలతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి


సీపీ కె.శ్రీనివాస్ రెడ్డి, హీరో సుమన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ బ్రదర్ షాజహాన్ ఆంటోని

అఫ్జల్‌గంజ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అబిడ్స్‌లోని ఓ స్కూల్‌లో ప్లాటినం జూబ్లీ వార్షిక వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సీపీ శ్రీనివాస్ రెడ్డి, సినీనటుడు సుమన్, గ్లోబల్ ఆస్పత్రి ప్రముఖ వైద్యులు డాక్టర్ రవి కుమార్, అజయ్ కుమార్ సింగ్, మహ్మద్ షాయాన్ ఫారూఖీలు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... పాఠశాల, కళాశాలలో ఎవరైన మత్తు పదార్థాలు విక్రయించినా.. కొనుగోలు చేసిన చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ... విద్యార్థులపై తల్లిదండ్రులు చదువులపై ఎంత శ్రద్ధ చూపుతారో అంతే స్థాయిలో వారిపై నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఫోక్ డ్యాన్స్, వెస్ట్రన్, వెల్‌కమ్ డ్యాన్స్‌లు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.

బీసీఏలో చేర్చే వరకు ఉద్యమిస్తాం: శేఖర్ సగర

నార్సింగ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా, రాజకీయంగా సమాజంలో అన్ని రంగాలలో వెనుకబాటుకు లోనైన సగర కులాన్ని బీసీఎలో చేర్చే వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సగర జాతి ఉద్యమిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. ఆదివారం మణికొండలో సగర సంఘం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం నాయకులు అశోక్, వెంకటేశ్, రోజ, సునీత, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనామహోత్సవాలు

కార్వాన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తాళ్లగడ్డ యువజన సంఘం ఆధ్వర్యంలో బొడ్రాయి నాభిశిలా ప్రతిష్ఠాపనామహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం బొడ్రాయి అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. తాళ్లగడ్డ కార్వాన్, విశ్వేశ్వరనగర్ తదితర ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. ఈ బోనాల ఉత్సవాల్లో నల్లకుంట కార్పొరేటర్ అమృత, జీయాగూడ కార్పొరేటర్ మునిందర్, కార్వాన్ బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి జీవన్‌సింగ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో తాళ్లగడ్డ యువజన సంఘం అధ్యక్షుడు రాజుగోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నారెడ్డి దుర్గాదాస్, తాళ్లగడ్డ యూత్ అసోసియేషన్ సభ్యులు రాముయాదవ్, అరుణ్ యాదవ్, దుర్గాదాస్ యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మదీన, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, అగర్వాల్ శిక్షా సమితి సంయుక్తాధ్వర్యంలో ఆదివారం పాతనగరంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 500 మందికి సాధారణ వైద్యపరీక్షలతోపాటు గుండెకు సంబంధించిన 2డీ ఏకో, ఈసీజీ, కేన్సర్‌కు సంబంధించిన ప్యాప్ స్మియర్, ఆర్‌బీఎస్, బీపీ, థర్మో మామోగ్రామ్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెనోవా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ నమ్రత శర్మ, డైరెక్టర్ అండ్ చీఫ్ డాక్టర్ పాలంకి సత్య దత్తాత్రేయ, సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ యుగంధర్ శర్మ, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఓఓ రవీంద్రనాథ్ గరగలను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులతోపాటు అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ కేడ్రా మోహన్ అగర్వాల్, డాక్టర్ మోహన్ గుప్తా, సీఏ నవీన్‌కుమార్ అగర్వాల్, శేష్‌కుమార్ గోయల్, రెనోవా హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి పేరుపై అర్చనలు, అభిషేకాలు

యాకుత్‌పుర, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలరోజులు పూర్తయిన సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి, శివాలయంలో ఆదివారం ఆ పార్టీ చార్మినార్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ పూజలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి పేరుపైన ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

ఉలెన్ స్వెటర్, స్టీల్ ప్లేట్లు, గ్లాసలు పంపిణీ

యాకుత్‌పుర, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మజ్లిస్ బచావో తహరిక్(ఎంబీటి) పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని వివిధ దేవాలయాల పూజారులకు ఉలెన్ స్వెటర్, స్టీల్ ప్లేట్, గ్లాస్‌లను అందజేశారు. గౌలిపుర పటేల్‌నగర్‌లో ఎంబీటీ సంయుక్త కార్యదర్శి బుంగ శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాకుత్‌పుర ఎంబీటీ అధికార ప్రతినిధి మహ్మద్ అంజాదుల్లాఖాన్ విచ్చేసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ మహరాజ్, బుంగ సాయికెమార్, బుంగ శ్రావణ్ కుమార్, బుంగసందీప్, బుంగలిఖిత్ కుమార్, రాపత్రి అనిల్‌కుమార్, బుంగ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు ఎమ్మెల్యేకు సన్మానం

అఫ్జల్‌గంజ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కురుమల కుల దైవమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్‌గా కురుమలను నియమించాలని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ వీప్ బీర్ల ఐలయ్య తెలిపారు. ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎంపికైన కురుమ కులానికి చెందిన బీర్ల ఐలయ్యకు ఆదివారం రాత్రి ముస్లింజంగ్ వంతెన వద్ద ఉన్న కురుమ సంఘం భవనంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేషం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, కొండల్ రాజు, హాస్టల్ ట్రస్టు బోర్డు చైర్మన్ కొలుపుల నర్సింహ, జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ కావ్య, కురుమ సంఘం రాష్ట్ర యూత్ నాయకులు తూంకుంట అరుణ్ కుమార్, కట్టా మల్లేషం, కృష్ణమూర్తి, ఎక్కాల కన్నా, కెంద్యాల శ్రీనివాస్, నర్స వినోద్ కుమార్, చీర శ్రీకాంత్, వసుపురి శంకర్, గొరిగే మల్లేష్, ఒగ్గు కుమార స్వామి, బెజిని శ్రీనివాస్, ఒగ్గు బీరప్ప, యాదయ్య, మీర్యాల విజయ, జె.శివ కుమార్, బాలయ్య కురుమ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

49 గంటల్లో కిడ్నాప్ కేసు ఛేదన

● సెటిల్ అయ్యేందుకే సోదరుడి కిడ్నాప్

రాయదుర్గం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకొని జీవితంలో సెటిల్ అయ్యేందుకు కజిన్ బ్రదర్‌ను కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేయాలనుకున్న ఓ సోదరి, ఆమె ప్రేమికుడు, ఇతరులు జైలుపాలయ్యారు. ఈనెల 4న జరిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కిడ్నాప్ కేసును రాయదుర్గం పోలీసులు 49 గంటల్లో ఛేదించారు. వివరాలను మాదాపూర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. గుంటూరు మాచెర్లకు చెందిన గుర్రం నిఖిత, కృష్ణా జిల్లాకు చెందిన బల్లిపార వెంకట కృష్ణ ప్రేమించుకున్నారు. ఇద్దరూ పెళ్లి అనంతరం ఆనందంగా జీవితం గడిపేందుకు ఎవరినైనా కిడ్నాప్ చేసి డబ్బు వసూలు చేయాలని ప్లాన్ వేశారు. ఈ విషయం పరిచయం ఉన్న పాత నేరస్థుడు సురేష్‌కు వెంకట కృష్ణ తెలిపాడు. ముగ్గురు కలిసి నిఖిత కజిన్ బ్రదర్ సురేందర్‌ను కిడ్నాప్ చేయాలని పథకం వేశారు. అందులో భాగంగా మరో నలుగురు మెహిదీపట్నం అంబేడ్కర్ నగర్‌కు చెందిన రామగళ్ల రాజు(20), భోజగుట్టకు చెందిన కూరగాయల వ్యాపారి షిండే రోహిత్(19), కర్మాల్‌కు చెందిన చందు, అత్తాపూర్, రాజేంద్రనగర్‌కు చెందిన వెంకట్‌లతో కలిసి సురేందర్‌ను కిడ్నాప్ చేయాలని భావించారు. గురువారం సాయంత్రం 6.30గంటల సమయంలో కూకట్‌పల్లిలో ఉండే సురేందర్‌కు నిఖిత ఫోన్ చేసి మాట్లాడాలని గచ్చిబౌలిలోని ఖాజాగూడ పెద్ద చెరువు పక్కన ఉన్న లింకు రోడ్డు వద్దకు రప్పించింది. నిఖితతో మాట్లాడుతుండగా సురేందర్‌ను కిడ్నాప్ చేశారు. ఈ సంఘటనను చూసిన చుట్టుపక్కల వారు డయల్ 100కు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అక్కడే ఉన్న నిఖితను ప్రశ్నించారు. మొదట అదేమీ లేదని చెప్పినప్పటికీ ఆ తర్వాత కిడ్నాప్ వ్యవహారాన్ని వెల్లడించింది. దీంతో పోలీసులు కిడ్నాపర్లు చెర నుంచి బాధితుడిని రక్షించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఏ1గా ఉన్న నిందితుడు సురేష్‌పై ఇది వరకే 21 క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఈ గ్యాంగ్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కిడ్నాప్ కేసులో నిందితులుగా ఉన్నారని తెలిపారు. అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం

ఘనంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణం





మల్లన్నకు దండం పెడుతున్న యువతి

దేవతామూర్తులకు తలంబ్రాలు పోస్తున్న వీరశైవార్చకులు

● తిలకించి పులకించిన భక్తజనం
● ప్రభుత్వం తరపున మంత్రి కొండా సురేఖ పట్టు వస్త్రాల సమర్పణ
● హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రముఖులు

చేర్యాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ముక్కోటి దేవతలు, పంచభూతాల సాక్షిగా, వీరశైవ పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కొమురవెల్లి మల్లికార్జున స్వామితో కేతలమ్మ, మేడలాదేవీల కల్యాణం కన్నులపండువగా జరిగింది. సనాతన వీరశైవాగమశాస్త్రం ప్రకారం మార్గశిర మాసం చివరి ఆదివారం రోజును పురస్కరించుకుని ఆలయప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఈ కల్యాణ క్రతువును నిర్వహించారు. వీరశైవ ఆగమపండితులు కన్యాదానం, మంగళ సూత్రధారణ జరిపారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, ఒడిబియ్యం పోశారు.

గర్భాలయంలోనూ..

గర్భాలయంలోనూ మల్లన్నకు శాస్త్రోక్తయుక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, బీసీ, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కల్యాణమండపానికి తీసుకువచ్చారు. మాంగళ్యధారణ అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మంత్రి కొండా సురేఖ కుటుంబసభ్యులతో కలిసి పట్నంవేసి మొక్కుతీర్చుకున్నారు.

లిఫ్ట్ ప్రారంభించిన దాత

స్వామి వారి దర్శనార్థం వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు ఇబ్బందులు కలగకుండా ఆలయంలో ఏర్పాటుచేయించిన లిఫ్ట్‌ను హైదరాబాద్‌కు చెందిన దాత బబ్బూరి బాల కృష్ణ ఆదివారం ప్రారంభించారు.

ఆలస్యంగా కల్యాణం

మల్లన్న కల్యాణం 10-45గంటలకు జరగాల్సి ఉండగా, 12-28గంటలకు మాంగళ్యధారణ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి హాజరైనా.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలస్యంగా రావడంతో కల్యాణ కైంకర్యం నిర్ణీత సమయానికన్నా గంటన్నరపాటు ఆలస్యమవడంతో భక్తులు విస్మయం వ్యక్తంచేశారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సిద్దిపేట జడ్పీచైర్మన్ వేలేటి రోజాశర్మ, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, తదితరులు హాజరయ్యారు.



కల్యాణ ఘట్టంలో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

థర్డ్‌డిగ్రీ కేసులో ఎస్సై, కానిస్టేబుల్ ట్రాన్స్‌ఫర్

హైదర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల వివాదంలో తలదూర్చి భర్త ప్రణీత్‌ను చితకబాదిన కేసులో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ ఎస్సై, కానిస్టేబుల్‌పై సైబరాబాద్ కమిషనర్ బదిలీ వేటు వేశారు. గతనెల 28నబ్యాంక్ మేనేజర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించిన కేసులో ఇప్పటికే ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇదే కేసులో ప్రణీత్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించిన ఎస్సై సందీప్, క్రైమ్ కానిస్టేబుల్ వెంకటేష్, దామోదర్‌ను లా అండ్ ఆర్డర్ నుంచి ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.

విద్యుత్ చౌర్యం కట్టడి

నష్టాలు తగ్గించేలా యాక్షన్ ప్లాన్ ● టీమ్‌ల వారీగా విస్తృత తనిఖీలు

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం కట్టడితోపాటు కమర్షియల్ నష్టాలు తగ్గించేందుకు విద్యుత్‌శాఖ యాక్షన్‌ప్లాన్ మొదలుపెట్టింది. టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో విద్యుత్‌నష్టాల నియంత్రణకు యాంటి పవర్‌థెఫ్ట్ స్క్వాడ్, డీఈఈ వింగ్ బృందాలు గ్రేటర్‌జోన్ పరిధిలోని 9 సర్కిళ్లలో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఏడీఈ, ఏఈల ఆధ్వర్యంలో సబ్ ఇంజనీర్, లైన్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి టీమ్‌గా ఏర్పాటు చేసి విద్యుత్‌చౌర్యం కట్టడిని సర్కిళ్లవారీగా సెక్షన్లలో తనిఖీలు చేపడుతున్నారు. ఒక్కో టీమ్ రోజూ 80-100 కనెక్షన్లు తనిఖీచేస్తూ ప్రత్యేక రిపోర్టులు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా అండర్ డిస్‌కనెక్షన్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఏ ఒక్క ప్రాంతంలో తప్పుడు పత్రాలపై విద్యుత్ కనెక్షన్లు జారీచేసినా బాధ్యులపై కఠిన చర్యలుంటాయని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

ఉన్నతాధికారుల పర్యటనలు

టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీజీఎంలతోపాటు ఎస్ఈలు, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్థానికంగా బిల్లింగ్ సమస్యలు, ఓల్టేజీ సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. అధికారుల దృష్టికి వస్తున్న సమస్యలను రికార్డుచేసుకోవడంతో పాటు వాటిపరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నారు. శివారు ప్రాంతాల్లో విద్యుత్‌చౌర్యం, అక్రమ నిర్మాణాలకు ఇస్తున్న విద్యుత్‌కనెక్షన్ల లెక్కల వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా శివారుప్రాంతాల్లో అనుమతులు లేకుండా వెలుస్తున్న ప్రైవేట్ వెంచర్లలో వేస్తున్న విద్యుత్‌లైన్లు, స్తంభాల ఏర్పాటుపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిపై ఒకటి, రెండు రోజుల్లో సీఎండీ ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.



సీఎండీ రాకతో ఇంజనీర్లు అలర్ట్

డిస్కం సీఎండీగా ముషారఫ్ ఫరూఖీ రాకతో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో 20 సర్కిళ్లలో ఇంజనీర్లు అలర్ట్ అయ్యారు. గతంలో కార్పొరేట్ ఆఫీస్‌తోపాటు స్థానికంగా కొంతమంది అధికారులపై పెద్దసంఖ్యలో అవినీతి ఆరోపణలు వచ్చినా శాఖపరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో అవినీతి ఆరోపణలు వచ్చే అధికారులపై విచారణ నిర్వహిస్తారనే విస్తృత ప్రచారం ఇంజనీరింగ్ వర్గాల్లో వినిపిస్తోంది.

50ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన 'లిటిల్ ఫ్లవర్'

● స్కూల్ యూనిఫాంలో పూర్వవిద్యార్థుల స్వర్ణోత్సవం

హైదరాబాద్ సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ 1974 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. యాభై ఏళ్ల కిందట బడిని వదిలిన వారంతా స్కూలు యూనిఫాంలో హాజరయ్యారు. దాంతో పాటు వారి గణిత ఉపాధ్యాయిని మేరీ, హిందీని బోధించిన సునందా పాండే, తెలుగు ఉపాధ్యాయుడు నర్సింహులుతోపాటు ప్రస్తుత ప్రిన్సిపాల్ ఆంటోనిని శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరు తమ తరగతి గది జ్ఞాపకాలను, ఉపాధ్యాయులు, సహాధ్యాయులతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వనితా మహావిద్యాలయ డైరెక్టర్ ఆదిత్య మార్గం మాట్లాడుతూ చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పించడం లిటిల్ ఫ్లవర్ ప్రత్యేకత అంటూ చిన్ననాటి విషయాలను గుర్తుచేసుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలోని ప్రతిష్ఠాత్మక గ్రాడ్యుయేషన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్‌గా సేవలందిస్తున్న ఉన్నవ హనుమంతరావు తన జీవితాన్ని పాఠశాల ఎంతగా ప్రభావితం చేసిందో చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. దేశ, విదేశాల్లోని పలు రంగాల్లో స్థిరపడిన వారంతా హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ జర్నలిజం శాఖ మాజీ ఆచార్యులు కడియాల సుధీర్, కాంటినెంటల్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి, మిలింద్ జాదవ్, ఆనంద్, జగదీష్, వాజిద్, గద్దే బాబీ, సతీష్ కుమార్, సురేష్ కుమార్, యాభై మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ణోత్సవ సంచికను విడుదల చేశారు.



1974 నాటి పూర్వ విద్యార్థులు




ఆ స్ఫూర్తితోనే దేశ రక్షణ కోసం...

నేను భారత వైమానిక దళంలో ఎయిర్ మార్షల్‌గా పనిచేశాను. కార్గిల్ యుద్ధంలోనూ పాల్గొన్నాను. నిజానికి నేను చిన్నతనంలో ఒక సాధారణ విద్యార్థిని. అన్నీ సబ్జెక్టుల్లో యావరేజ్ మార్కులే వచ్చేవి. అయితే, జీవితంలో ఈ స్థాయికి రావడానికి చిన్నతనంలో నా పాఠశాల నేర్పిన క్రమశిక్షణ, విలువలే ప్రధాన కారణం. నేను ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు లిటిల్ ఫ్లవర్ స్కూల్లోనే చదివాను. ఆటలతో పాటు ఎన్‌సీసీ ప్రోగ్రాంలోనూ చురుగ్గా పాల్గొనేవాడిని. అదే నన్ను దేశ రక్షణ కోసం పనిచేసేలా ప్రభావితం చేసింది. నన్ను తీర్చిదిద్దిన నా పాఠశాలకు నేను జీవితాంతం రుణపడుంటాను.

- సర్దార్ హర్పాల్ సింగ్, విశ్రాంత ఎయిర్ మార్షల్

హెచ్‌బీఎఫ్ సొసైటీలో అవకతవకలు

● విచారణ జరపాలంటూ మంత్రికి లేఖ
● నిధులను దారిమళ్లించారంటూ ఆరోపణలు
● పదేళ్లుగా లెక్కలు చూపలేదని విమర్శలు
● సమాచారహక్కు చట్టాన్ని ఆశ్రయించిన మలుపు ప్రచురణకర్త



హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రఖ్యాత పుస్తక మహోత్సవాల్లో ఒకటైన హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ(హెచ్‌బీఎఫ్)లో అవకతవకలు జరిగాయంటూ, వీటిపై విచారణ జరపాలంటూ కొందరు ప్రచురణకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మంత్రికి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారంటూ విమర్శిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే సొసైటీ ఖాతాలోని సొమ్మును దారి మళ్లించినట్లు బుక్‌ఫెయిర్ సొసైటీ కార్యవర్గ సభ్యుడు మలుపు బాల్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఈ పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం బుక్ ఫెయిర్‌కు పలు దఫాలుగా కొన్ని లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు సమాచారం. దీంతో పాటు ప్రతి ఏటా ఆదాయ వ్యయాల లెక్కలను ఇంతవరకు సర్వసభ్య సమావేశంలో కాదుకదా.. కార్యనిర్వాహక సభ్యులకు కూడా తెలియజేయలేదని ఆయన అన్నారు. ఈ విషయాలన్నింటినీ తనతోపాటు నవతెలంగాణ ప్రచురణ సంస్థ మేనేజర్ ఆర్. శ్రీనివాస్ ప్రత్యేక లేఖ ద్వారా మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అంతేకాకుండా.. గత ప్రభుత్వం బుక్ ఫెయిర్‌కు ఇచ్చిన నిధుల లెక్కలు కోరుతూ బాల్‌రెడ్డి సమాచార హక్కు చట్టాన్ని కూడా ఆశ్రయించారు.

పార్టీ ప్రచార వేదికగా మార్చారు

పుస్తక మహోత్సవానికి గత ప్రభుత్వం ఎన్టీఆర్ స్టేడియంను పదేళ్లు ఉచితంగా కేటాయించింది. అయినప్పటికీ నిర్వాహకులు ఒక్కొక్క తెలుగు స్టాల్‌కు జీఎస్టీగాక రూ.15వేలు, భారతీయ భాషలకు 24వేలు, ఇంగ్లిషు స్టాల్‌కు 30వేలకుపైగా విక్రేతల నుంచి వసూలు చేశారు. అదే ప్రాంగణంలో వ్యాపార ప్రకటనలు, ప్రత్యేక హోర్డింగులు, ఆరుబయట ఆహారశాలల నిర్వాహకులు చెల్లించే అద్దెలతోపాటు సందర్శకుల ప్రవేశ రుసుము లాంటి ఆదాయాలు అదనం. వీటన్నింటికి సంబంధించిన లెక్కలను పదేళ్లుగా సొసైటీ సభ్యులకు చూపకుండా, అధ్యక్ష, కార్యదర్శులు ఏకపక్షంగా వెళ్తున్నారంటూ మంత్రికి రాసిన లేఖలోనూ ప్రస్తావించారు. పుస్తక విక్రేతలకు, పాఠకులకు మధ్య వారధిగా నిలవాల్సిన పుస్తక ప్రదర్శనను వ్యక్తిగత స్వార్థం కోసం బీఆర్ఎస్ ప్రచార వేదికగా మలిచి, సొసైటీ అధ్యక్షుడు ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆర్.శ్రీనివాస్ విమర్శించారు. అదే పద్ధతిలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంతోనూ సన్నిహితంగా మెలిగి, తన తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారని మంత్రికి రాసిన లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వ పక్షాన జోక్యం చేసుకొని, బుక్‌ఫెయిర్ సొసైటీలోని అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను తొలగించి పౌరసంఘాల ప్రతినిధులు, ప్రచురణకర్తలు, రచయితల భాగస్వామ్యంతో పుస్తక ప్రదర్శన జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

పదేళ్లుగా కోశాధికారి ఒక్కరే

రిజిస్ట్రర్ ఆఫ్ సొసైటీస్ కింద చట్టబద్ధంగా కొలువుదీరిన సంస్థ హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎన్నికల ద్వారా అధ్యక్ష, కార్యదర్శులతోపాటు ట్రెజరర్‌ను ఎన్నుకుంటారు. ముఖ్యంగా కోశాధికారిలాంటి బాధ్యతల్లో ఒకేవ్యక్తి రెండు దఫాలకు మించి ఉండకూడదు. కానీ, పి. రాజేశ్వరరావు పదేళ్లుగా సొసైటీ ట్రెజరరీగా కొనసాగడం మీద కొందరు సభ్యులు విమర్శిస్తున్నారు. గత ఏడాది ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి స్థానానికి శృతికాంత్ భారతి, నవతెలంగాణ ఆర్. శ్రీనివాస్ పోటీపడగా ఇరువురికి సమానమైన ఓట్లు వచ్చాయి. దాంతో మొదటి ఏడాది ఒకరు, మరుసటి ఏడాది మరొకరు బాధ్యతలు నిర్వర్తించాలని సొసైటీ సభ్యులు తేల్చారు. 2023 అక్టోబర్ నుంచి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు తనకు అప్పగించాల్సి ఉన్నా.. ఇంతవరకు ఆ పనిచేయలేదని ఆర్. శ్రీనివాస్ ఆరోపిస్తున్నారు. ఫిబ్రవరిలో బుక్ ఫెయిర్ ఉంటుందన్న సమాచారం కూడా తమకు పత్రికల ద్వారానే తెలిసిందని అన్నారు. కనీసం కార్యవర్గ సమావేశం కూడా నిర్వహించకుండా ఏకపక్షంగా వెళ్లడాన్ని తప్పు పడుతూ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌కు తాను మరో లేఖ రాసినట్లు చెప్పారు. కార్యవర్గ సభ్యుల సమష్టి నిర్ణయం లేకుండా పుస్తక ప్రదర్శనకు ప్రాంగణాన్ని కేటాయించవద్దని అందులో కోరారు. దాంతో ఫిబ్రవరిలో పుస్తక ప్రదర్శన నిర్వహణ మీద గందరగోళం నెలకొంది. ఇలా బుక్‌ఫెయిర్ సొసైటీ నిర్వాహకుల మీద పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తడం, అవి మంత్రి దృష్టికి కొందరు తీసుకెళ్లడంతో... అప్పటికప్పుడు అప్రమత్తమై సోమవారం కార్యవర్గసమావేశానికి పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. దాంతో ఈ ఏడాది పుస్తక ప్రదర్శన ఉంటుందా.. లేదా అన్నది తేలనుంది.

స్వశక్తి



కూలీ భార్య...

యూట్యూబ్ 'ఇంగ్లీష్' స్టార్

ఓ పల్లెటూరి పడచు... రోజు కూలీ ఇల్లాలు... యూట్యూబ్‌లో ఇంగ్లీష్ పాఠాలు చెబుతోంది. అంతంతమాత్రమే చదివినా... నెట్టింట తనకు తానుగా నేర్చుకుని... 'దేహతి మేడమ్'గా నేడు ఎందరికో భాషపై భయం పోగొడుతోంది. మంచాన పడ్డ భర్త... వయసు మీరిన అత్తమామ... కుటుంబ భారం భుజానికెత్తుకుని... ఆంగ్ల పాఠాలనే ఆదాయ వనరుగా మలుచుకున్న యశోదా లోధి కథ ఇది.

"పెద్దగా చదువుకోని ఓ పల్లెటూరి అమ్మాయి... ఇవాళ మీ ముందు ఇలా నిలబడిందంటే అందుకు ప్రధాన కారణం మా కుటుంబ పరిస్థితులు. ఉత్తరప్రదేశ్ కౌశంబీజిల్లా సిరాతూ మాది. ఆర్థిక స్థోమత లేక పన్నెండో తరగతితోనే నా చదువు ఆగిపోయింది. తరువాత... 2016లో ఇంట్లోవాళ్లు నాకు పెళ్లి చేశారు. నా భర్త రాధే... రోజు కూలీ. తను పనికి వెళితే రోజుకు మూడు వందల రూపాయలు వచ్చేది. ఆరుగురు సంతానంలో ఆయనే పెద్ద. ఆయనకు వచ్చేదాంట్లోనే మేమంతా బతకాలి. ఆ డబ్బు ఏ మూలకూ సరిపోయేది కాదు. కష్టమైనా తినీ తినక నెట్టుకొచ్చాం. కానీ ఆ విధి మాకు మరింత విషమ పరీక్షలు పెట్టింది. 2020 డిసెంబర్... కొవిడ్ సమయం... పని మీద బయటకు వెళ్లిన నా భర్త రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యానికి అధికమొత్తంలో వెచ్చించాల్సి వచ్చింది. ఇంట్లో చూస్తే తిండికి కూడా పైసా లేదు. ఏంచేయాలో దిక్కుతోచలేదు. వైద్య ఖర్చుల కోసం మా మామ మాణిక్‌చంద్ ఐదు లక్షల రూపాయల అప్పు తీసుకున్నారు. అప్పటికి గండం నుంచి గట్టెక్కాము.

అండగా నిలవాలని...

మా మామయ్య అప్పు అయితే తీసుకున్నారు కానీ, దాన్ని తిరిగి చెల్లించే పరిస్థితి లేదు. ఆ సమయంలో నేనే ఏదో ఒకటి చేసి, కుటుంబానికి అండగా నిలవాలనుకున్నాను. ఏంచేయాలని ఆలోచిస్తుంటే... యూట్యూబ్ ద్వారా డబ్బు సంపాదించవచ్చని ఎవరో చెప్పుకొంటుంటే విన్నాను. కానీ ఎలా? నేను అప్పటి వరకు స్మార్ట్ ఫోన్ ముఖం చూసి ఎరుగను. ఇక వీడియోలు తీసి, వాటిని అప్‌లోడ్ చేయడం నావల్ల అయ్యే పనేనా? ఆలోచించేంత సమయం కూడా నా దగ్గర లేదు.

మూడు నెలలు...

వెంటనే పని ప్రారంభించాలని మావారిని స్మార్ట్ ఫోన్ కొనివ్వమని అడిగాను. ఆయనకు అంత స్థోమత లేదని తెలుసు. అదే చెప్పారు. ఎలాగో నచ్చజెప్పి ఒప్పించాను. ఎక్కడో అప్పు చేసి నాకు ఒక స్మార్ట్ ఫోన్ కొని ఇచ్చారు. మూడు నెలలు ఇంటర్నెట్‌లోనే గడిపాను. షూటింగ్, వీడియో ఎడిటింగ్ లాంటివన్నీ నేర్చుకున్నాను. కొంత నమ్మకం కుదిరింది. తొలుత నాకు వచ్చిన వంటలు వండి 'దేసీ కుకింగ్' అని యూట్యూబ్‌లో పెట్టాను. ఎంబ్రాయిడరీ గురించి చెప్పాను. పండుగలు, ఇతర శుభకార్యాలకు ఇంటిని ఎలా అలంకరించుకోవాలో నేర్పే వీడియోలు అప్‌లోడ్ చేశాను. అలా నాలుగు రకాల చానల్స్‌తో ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. వాటిని చూసేవారే కరువయ్యారు.

ఇంగ్లీష్ నేర్చుకుని...



తీవ్ర నిరాశ, నిస్పృహ. మళ్లీ ఆలోచనలో పడ్డాను. కానీ దీని నుంచి బయటకు రావాలనుకున్నాను. ప్రేరణ కోసం మోటివేషనల్ స్పీకర్స్ ప్రసంగాలు వినడం మొదలుపెట్టాను. వారందరూ ధారాళంగా ఇంగ్లీష్‌లో మాట్లాడడం నన్ను బాగా ఆకట్టుకుంది. అది సరికొత్త ఆలోచన రేకెత్తించింది. నాలాగా పల్లెటూరి నేపథ్యం నుంచి వచ్చిన చాలామందికి ఇంగ్లీష్ అంటే భయం. కొందరు ఆంగ్లంలో రాయగలిగినా మాట్లాడాలంటే జంకుతారు. ఆ భయం పోగొట్టాలంటే భాష మీద పట్టు రావాలి. దాన్ని ఒక పల్లెటూరు అమ్మాయిగా... సరళంగా నేర్పించగలిగితే నా చానల్‌కు తిరుగు ఉండదని అనుకున్నాను. కానీ నాకూ ఇంగ్లీష్ పెద్దగా రాదు. అందుకే యూట్యూబ్‌లో పాఠాలు పెట్టుకుని నేర్చుకున్నాను. గ్రామర్, సంభాషణలు... ఇలా అన్నిటినీ ఆకళింపు చేసుకున్నా.

ప్రేరణ కల్పించి...

అలా గత ఏడాది 'ఇంగ్లీష్ విత్ దేహతి మేడమ్' పేరుతో యూట్యూబ్ చానల్ ఒకటి ప్రారంభించాను. చానల్ పేరు కింద నా గురించి రెండు లైన్ల పరిచయం ఉంటుంది. అది చాలామందిని ఆకర్షించింది. ఇంగ్లీష్ నేర్పే చానల్స్ యూట్యూబ్‌లో లెక్కలేనన్ని ఉన్నాయి. వాటిల్లో నా చానల్‌నే ఎందుకు చూడాలి? అందుకే కేవలం పాఠాలకే పరిమితం కాకుండా... ఇంగ్లీష్ ఎందుకు నేర్చుకోవాలో నెటిజనులకు చెబుతున్నాను. 'దేహతి'... అంటే 'ఏమీ తెలియని, పెద్దగా చదువుకోని ఒక పల్లెటూరి అమ్మాయి ఇవాళ మీ ముందు నిల్చొని ఇంగ్లీష్ బోధించగలుగుతుంది. నన్ను ప్రేరణగా తీసుకోండి. భయం వదిలేస్తే మీరూ నాలానే మాట్లాడగలరు. ఏ ఉద్యోగం చేయాలన్నా, ఉన్నత చదువులు చదవాలన్నా ఇంగ్లీష్ అవసరం ఎంతో ఉంది' అని నా చానల్‌కు వచ్చినవారిలో స్ఫూర్తి నింపుతూ వచ్చాను. ఇది విని చాలామంది భాష నేర్చుకోవడానికి ముందుకు వచ్చారు.

మూడు లక్షలమంది...

తొలుత మా ప్రాంతంలోని మహిళలు ఆసక్తి చూపలేదు. ఇది తమవల్ల అయ్యే పని కాదనేది వాళ్ల భావన. ఆ సమయంలో మా ఆడపడచులు నాకు అండగా నిలిచారు. వాళ్లు నేర్చుకోవడం చూసి విగిలినవారు కూడా కదిలారు. క్రమంగా మా ఊళ్లో నేను గొప్ప ఇంగ్లీష్ పంతులమ్మగా పేరు తెచ్చుకున్నాను. ఇప్పుడు నేను ఇంగ్లీష్ గ్రామర్ చెప్పగలను. పెద్ద పెద్ద వాక్యనిర్మాణాలు సులువుగా నేర్పగలను. నా చానల్‌కు వచ్చినవారిలో స్ఫూర్తి నింపి, నిర్భయంగా మాట్లాడించగలను. ప్రస్తుతం నా చానల్‌కు మూడు లక్షలమందికి పైగా సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. ఏడాది తిరక్కుండానే దాదాపు మూడు కోట్ల మంది నా కంటెంట్ వీక్షించారు. ఇప్పటివరకు మొత్తం 370 వీడియోలో పోస్ట్ చేశాను. వాటిల్లో చాలా వీడియోలను లక్షమందికి పైగా చూశారు. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే... ఇది నేనేనా అనిపిస్తుంది.

అప్పు తీర్చేశా...

యూట్యూబ్ ద్వారా నాకు మంచి ఆదాయం లభిస్తోంది. ఆ డబ్బుతో ఏ లోటూ లేకుండా మా కుటుంబం నడుస్తోంది. మావారి వైద్య ఖర్చుల కోసం మామయ్య తీసుకున్న ఐదు లక్షల అప్పు కూడా తీర్చగలిగాను. నాకు వచ్చిన విద్యను నలుగురితో పంచుకొంటూ... ఇంట్లో కూర్చొని సంపాదించగలుగుతున్నాను. సామాజిక మాధ్యమాలు వచ్చాక... ముఖ్యంగా యూట్యూబ్ నాలాంటి ఎంతోమంది గృహిణులకు దారి చూపుతోంది. సృజనాత్మకంగా... వినూత్న కంటెంట్‌తో వస్తే ఇక్కడ ఎవరికైనా విజయం వరిస్తుంది. పేదరికంలో మగ్గే ఒక రోజు కూలీ భార్యనైన నేను ఇవాళ నా కాళ్లపై నేను నిలబడగలిగాను. నా కథ ఏ ఒక్కరిలో స్ఫూర్తి నింపినా... అంతకు మించిన సంతృప్తి, సంతోషం నాకు మరెందులోనూ లభించవు."

ఒంటరిగా ఎదిగి... రైతులకు అండగా నిలిచి...

సొంతవారి వెలివేత, ఆర్థిక సమస్యలు, వ్యాపారంలో ఇబ్బందులు... వీటన్నిటినీ అధిగమించి విజయం సాధించారు రేషమ్‌దేవి మాలిక్. వందలాదిమందికి చేయూతనిచ్చే స్థాయికి చేరిన రేషమ్‌దేవి ప్రస్థానం ఆమె మాటల్లోనే...

"ఆ కాలం నా జీవితంలో అతి పెద్ద పీడకల. అది గుర్తుకువచ్చినప్పుడల్లా ఉలిక్కిపడతాను. అంతులేని ఆందోళన. కాసేపటికి మళ్లీ మామూలు మనిషిని అవుతాను. అదంతా గడిచిపోయిందనీ, ఇప్పుడు అంతా బాగానే ఉందనీ తెలిసినా... ఆ చెడ్డ రోజులు గుర్తుకొస్తూనే ఉంటాయి. అప్పుడు హాస్టల్‌లో ఉంటూ ట్వల్త్ క్లాస్ చదువుతున్నాను. నా హాస్టల్‌మేట్ సోదరుడు రాజేష్ అక్కడికి తరచూ వచ్చేవాడు. మా ఇద్దరి మధ్యా పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుందామనుకున్నాం. కానీ మా మతాలు వేరు కావడంతో పెద్దలు ఒప్పుకోలేదు. చేసుకుంటే అతణ్ణే వివాహం చేసుకుంటానని పట్టుపట్టాను. ఇంట్లో నన్ను నానా దుర్భాషలూ ఆడారు. శాపనార్థాలు పెట్టారు. కొట్టారు. చివరకు బయటకు గెంటేశారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న నన్ను రాజేష్ తన ఊరికి తీసుకువెళ్ళాడు. అతని తల్లితండ్రులు కూడా మమ్మల్ని ఇంట్లోకి ఆహ్వానించలేదు. నేను, రాజేష్ అక్కడే ఒక గది తీసుకొని, కొత్త జీవితం మొదలుపెట్టాం. నా చదువు కొనసాగించాలనుకున్నా కుదరలేదు. రాజేష్ లోన్ మీద ఒక కారు తీసుకొని, అద్దెకు తిప్పసాగాడు. అలా రెండేళ్ళు గడిచాయి. మాకొక అబ్బాయి పుట్టాడు. రాజేష్ కుటుంబ తిరస్కారం, గ్రామస్తుల్లో మా మతాంతర వివాహం పట్ల వ్యతిరేకత నానాటికీ పెరుగుతూ ఉండడంతో చేసేది లేక మళ్లీ నేను పుట్టిన ఊరైన ఒడిశాలోని దరింగ్బడికి చేరుకున్నాం. అప్పటికి నా తల్లితండ్రులు మెత్తబడ్డారు. మనవడిని చూసి సంతోషపడ్డారు. వాళ్ళ ఇంట్లో మేం ఉండడానికి చోటిచ్చారు. అదృష్టవశాత్తూ అక్కడే 'పీపుల్స్ రూరల్ ఎడ్యుకేషన్ మూవ్‌మెంట్ (ప్రేమ్)' అనే ఎన్జీవోలో సూపర్‌వైజర్‌గా రూ.3,500 జీతానికి చేరాను. మాది పర్యాటక ప్రాంతం కావడంతో... టూరిస్టుల ద్వారా రాజేష్‌కు మంచి ఆదాయం వచ్చేది. పరిస్థితులు కుదుటపడుతున్నాయనుకుంటున్న దశలో... విధి మరోసారి దెబ్బతీసింది.



జీవనాధారమైన కారును అమ్మేసి...

కేరళలోని మన్నుతిలో ఉన్న 'ప్రేమ్' పరిశోధన కేంద్రంలో నెల రోజుల శిక్షణకు వెళ్ళాను. అక్కడ రైతులతో, వ్యవసాయ నిపుణులతో మాట్లాడినప్పుడు... సొంతంగా ఏదైనా చెయ్యాలనే కోరిక కలిగింది. శిక్షణ నుంచి వచ్చాక ఆ దిశగా ఆలోచనలు చేస్తున్న దశలో... నాకు ప్రమాదం జరిగింది. అప్పుడు నేను గర్భవతిని. అదృష్టవశాత్తూ బిడ్డకు ఎలాంటి హానీ జరగలేదు. కానీ నేను కోలుకోవడానికి కొంత కాలం పట్టింది. 'ప్రేమ్' సంస్థ కొంత సాయం చేసింది. మేం దాచుకున్న కాస్త డబ్బూ నా చికిత్సకే ఖర్చయిపోయింది. పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. నా పుట్టింటి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. వారికి భారంగా ఉండడం ఇష్టంలేకపోయింది. ఆర్థికంగా స్థిరపడాలి. అదే సమయంలో రైతులకు మాకు చేతనైనంత మేలు చేయాలి. దానికోసం రైతుల నుంచే నేరుగా వ్యవసాయ ఉత్పత్తిని మంచి ధరలకు సేకరించి, వాటిని విక్రయించాలని నిర్ణయించుకున్నాం. 2021 లో... రాజేష్ కారు అమ్మేసి... 'గ్రీన్ ఫ్లాగ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్' (జీఎఫ్‌పీసీఎల్)ను ఏర్పాటు చేశాం. పదిమంది రైతులు భాగస్వాములుగా, పదిహేను వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలతో మా ప్రయాణం మొదలైంది. ఈలోగా కరోనా



రెండో దశ విజృంభించింది. "జీవనాధారంగా ఉన్న కారును అనవసరంగా అమ్మేశారు. మీ వ్యాపారం నిలదొక్కుకొనే అవకాశం లేదు" అంటూ ఎంతోమంది వ్యాఖ్యానించారు. నేను వాటిని పట్టించుకోలేదు. రాజేష్ వేరే చోట డ్రైవర్‌గా కుదురుకున్నాడు. దాంతో రైతుల నుంచి ఉత్పత్తులు సేకరించడం, వాటిని ప్యాక్ చెయ్యడం, దుకాణదారుల్లో అమ్మకాలకు ఉంచడం, ఎక్కడైనా ప్రదర్శనలు జరిగితే అక్కడ విక్రయాలు జరపడం... ఇలా అన్ని పనులూ స్వయంగా చేశాను. ఆ క్రమంలో ఎన్నో ఇబ్బందులు, అవహేళనలు ఎదుర్కొన్నాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లభించకపోవడంతో... ప్రైవేటు సంస్థల దగ్గర అప్పులు తీసుకోవాల్సి వచ్చింది. అయినా ఏ దశలోనూ నా ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోలేదు.

వారి సంతోషం శక్తినిస్తోంది...

కరోనా ఆంక్షల్ని పూర్తిగా ఎత్తేసిన తరువాత... మా వ్యాపారం నిలదొక్కుకుంది. ఉత్పత్తుల సంఖ్యను కూడా పెంచాను. వాటిలో రకరకాల బియ్యం, పసుపు, అల్లం, వెల్లుల్లి, కూరగాయలు... ఇలా 70కి పైగా ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. ఇప్పుడు వందమందికి పైగా రైతులు మా గ్రూప్‌లో భాగస్వాములు. వారికి సంతృప్తికరమైన ధరలతో పాటు లాభాల్లో వాటా కూడా ఇస్తున్నాం. తొలి ఏడాదే మా టర్నోవర్ రూ.50 లక్షలకు చేరింది. మరుసటి ఏడాది రెట్టింపు అయింది. ఒడిశాలోని పలు ప్రాంతాల రైతులు ఇప్పుడు మాతో చేరుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త వ్యవసాయ ఉత్పత్తులు మా జాబితాలో చోటు చేసుకుంటున్నాయి. రైతులు పడిన శ్రమకు తగిన ఫలితం దక్కినప్పుడు... వారి ముఖాల్లో కనిపించే సంతోషం నాకు ఎంతో శక్తిని అందిస్తోంది. రాబోయే నాలుగేళ్ళలో... పది జిల్లాల నుంచి కనీసం 50 వేల మంది రైతులను మా గ్రూప్‌లో భాగస్వాములను చెయ్యడం, 250కి పైగా ఉత్పత్తులను వారి నుంచి సేకరించి విక్రయించడం లక్ష్యంగా పెట్టుకున్నాను."



వంటింటి చిట్కాలు

- పుదీనా పచ్చడి చేసేప్పుడు కొద్దిగా పెరుగు కలిపితే రుచిగా ఉంటుంది.
- రాగిపాత్రలకు జిడ్డు వదలకుంటే ఉప్పులో నిమ్మకాయ రసం వేసి శుభ్రపరిస్తే చాలు.
- అరటిపండ్లు పాడవకుండా ఉంటాలంటే పాలిథీన్ కవర్‌లో చుట్టి ఉంచాలి. దీనివల్ల కనీసం రెండు, మూడు రోజులు అరటి పండ్లు నిల్వ ఉంటాయి.
- బెండకాయ కూర చేసే ముందు వాటిపై నిమ్మరసం పిండితే జిగురు ఉండదు.
- పచ్చి బఠానీలను ఉడికించేప్పుడు కొద్దిగా చక్కెర వేస్తే బఠానీల రంగు మారదు.
- కోడిగుడ్ల పెంకు బాగా రావాలంటే బియ్యం కడిగిన నీటిలో ఉడికిస్తే సరి.
- పంచదారలో చీమలు పట్టకుండా ఉండాలంటే ఆ డబ్బాలో రెండు లవంగాలు ఉంచితే సరి. చీమలు రావు.
- కాకరకాయలను ఫ్రిజ్‌లో ఉంచితే త్వరగా పాడవుతాయి అనుకుంటే వాటిని చక్రాలుగా కట్ చేసి ఫ్రిజ్‌లో నిల్వచేస్తే సరి ఎక్కువ రోజులు ఉంటాయి.
- బొంబాయి హల్వా రుచిగా ఉండాలంటే స్పూన్ శనగపిండి వేస్తే బావుంటుంది.

నవ్య | చిత్రజ్యోతి

ప్రతి టిక్కెట్ ధరనుంచి ఐదు రూపాయలు
అయోధ్య రామ మందిరానికి



చిరంజీవి

'చరిత్రలో మైలురాయిగా నిలిచిపోయే ఘట్టం అయోధ్య రామమందిర నిర్మాణం. అటువంటి గొప్ప ఆలయ ప్రారంభోత్సవానికి నన్ను ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉంది. ఈ నెల 22న కుటుంబ సమేతంగా రామ మందిర ప్రారంభోత్సవానికి అయోధ్య వెళ్తున్నాను. ఈ 'హను-మాన్' సినిమాకు అమ్ముడుపోయిన ప్రతి టికెట్ నుంచి అయిదు రూపాయలు అయోధ్య రామమందిరానికి కానుకగా ఇవ్వనున్నట్టు నిర్మాత ప్రకటించారు. ఇది నిజంగా హర్షణీయం' అని చిరంజీవి అన్నారు. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చిరంజీవి అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 'అమ్మానాన్నల తర్వాత నేను అమితంగా ఆరాధించే దైవం హనుమాన్. ఇది ఆయన నేపథ్యంతో కూడిన సినిమా కావడం నేను రావడానికి తొలి కారణమైతే, నా ముందు డైపర్‌లు వేసుకునే స్థాయినుంచి డయాస్ ఎక్కి మాట్లాడే స్థాయికి వచ్చిన తేజా ఇందులో హీరో కావడం మరొక కారణం. దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఇంకో కారణం. హనుమ అంటే ఒక ఇన్‌స్పైరింగ్ పర్సనాలిటీ. థియేటర్లు తక్కువగా దొరికినా పర్లేదు. ఇది పరీక్షా సమయం. కంటెంట్ బావుంటే విజయాన్ని ఎవరూ ఆపలేరు' అని చిరంజీవి అన్నారు. 'చిరంజీవిగారు నా జీవితంలో లేకపోతే నేను ఇక్కడ ఉండేవాడ్ని కాదు. నన్ను హీరోగా నిలబెట్టిన ప్రశాంత్‌వర్మ ఈ సినిమాతో నన్ను సూపర్‌హీరోని చేశాడు. రామ్‌చరణ్‌కి రాజమౌళి, రవితేజకు పూరీజగన్నాథ్, ఈ తేజాకు ప్రశాంత్‌వర్మ అని సగర్వంగా చెబుతున్నా. నేను ఉత్సవవిగ్రహాన్ని మాత్రమే. మూలవిరాట్ ప్రశాంత్‌వర్మ..' అని హీరో తేజా అన్నారు. 'సినిమా తీయడం పెద్ద యుద్ధం. ఈ యుద్ధంలో నేను వాడిన ఆయుధం తేజా. అందరూ కష్టపడి పనిచేశారు. ఇది హనుమంతులవారి కథ కాదు. ఒక సామాన్యుడికి ఆంజనేయ శక్తులొస్తే ధర్మంకోసం ఎలా పోరాడాడు అనేది ఈ కథ' అని దర్శకుడు ప్రశాంత్ వర్మ చెప్పారు. ఇంకా నిర్మాత నిరంజన్‌రెడ్డి, వరలక్ష్మి శరత్‌కుమార్, అమృత అయ్యర్, తదితరులు మాట్లాడారు.

నేను ఉద్వేగపూరితంగా చేసిన సినిమాలన్నీ హిట్




నా తొలి సినిమా నుంచే వైజాగ్‌తో విడదీయరాని అనుబంధం ఏర్పడిపోయింది. నా 75వ సినిమా ఎమోషనల్ మూవీ కావడం ఆనందంగా ఉంది. నేను ఉద్వేగపూరితంగా నటించిన శత్రువు, ధర్మచక్రం, గణేశ్.. ఇలా ప్రతి సినిమా హిట్. ఇది కూడా పక్కా హిట్ అని వెంకటేశ్ నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకుడు. వెంకట్ బోయనపల్లి నిర్మాత. ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. డైరెక్టర్ మాట్లాడుతూ 'ఇప్పటివరకూ చూడని కొత్త వెంకటేశ్‌ని ఇందులో చూస్తారు. ఈ సినిమా తర్వాత వెంకీ అభిమానిని అయిపోయాను. వెంకటేశ్‌గారి 75వ సినిమాను దర్శకత్వం చేసే అవకాశం రావడం నా అదృష్టం. అందరం ప్రాణంపెట్టి పనిచేశాం' అని అన్నారు. ఇంకా చిత్ర బృందం పాల్గొన్నారు.

హార్ట్‌బీట్ పెంచే గుంటూరుకారం



భారీ అంచనాల మధ్య సంక్రాంతికి విడుదల అవుతున్న సినిమా మహేశ్‌బాబు 'గుంటూరు కారం'. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు చెందిన థియేట్రికల్ ట్రైలర్‌ని అట్టహాసంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ సినిమా బ్లాక్‌బాస్టర్ ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందనే నమ్మకాన్ని పెంచిందని, అభిమానుల హార్ట్‌బీట్ పెంచేలా, మనసునిండా ఆనందం నిండేలా ఈ ట్రైలర్‌ని కట్ చేశారని, ట్రైలర్‌లో భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు సినిమా కథను ప్రతిబింబిస్తున్నాయని చిత్రబృందం తెలిపింది. మహేశ్‌బాబు నటన, త్రివిక్రమ్ దర్శకత్వ శైలి, ఆయన సంభాషణలు ఈ సినిమా విజయానికి ప్రధాన పాత్ర పోషించనున్నాయని ఈ సందర్భంగా వారు చెప్పారు. శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్యకృష్ణ, ప్రకాశ్‌రాజ్, జయరామ్ ఇతర ముఖ్య తారలు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎస్.థమన్.

ట్రెండ్ సెట్ చేసే గ్యాంగ్‌స్టర్ డ్రామా



ఇండియన్ స్ర్కీన్‌పై ఇప్పటివరకూ వచ్చిన మాఫియా నేపథ్య కథలకు పూర్తి భిన్నంగా పవన్‌కల్యాణ్ 'ఓజీ' కథ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ కేరక్టరైజేషన్ ఊహలకు అందని విధంగా ఉంటుందని, అత్యంత శక్తివంతంగా ఆయన పాత్రను దర్శకుడు సుజిత్ డిజైన్ చేశారని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న నటుడు వెంకట్ మాట్లాడుతూ 'పవర్ స్టార్ అభిమానులకు 'ఓజీ' విందుభోజనం లాంటి సినిమా. ఇందులో మంచి పాత్ర చేస్తున్నాను. 'అన్నయ్య' సినిమాలో చిరంజీవిగారి తమ్ముడిగా నటించిన నేను ఈ సినిమాలో పవన్‌కల్యాణ్‌తో కలిసి నటిస్తుంటే 23ఏళ్ల క్రితం 'అన్నయ్య' రోజులు గుర్తొస్తున్నాయి. ఇందులో కొన్ని సీన్స్ అభిమానులకు గూజ్‌బమ్స్ తెప్పిస్తాయి. టాలీవుడ్‌లో ఈ సినిమా కొత్త ట్రెండ్ సృష్టిస్తుంది' అని తెలిపారు. జపాన్, ముంబై నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని సమాచారం. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రీయారెడ్డి, ప్రకాశ్‌రాజ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాత: డీవీవీ దానయ్య, నిర్మాణం: డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్.

కామెడీని ఎంజాయ్ చేస్తారు



చంద్రశేఖర్, సోనాలి జంటగా కే సంతోష్‌బాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం "ప్లాంట్ మాన్". పన్నారాయల్ దర్శకత్వ పర్యవేక్షణ చేస్తూ నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చిన్న సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ చిత్రంలో కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రోజురోజుకూ వసూళ్లు పెరుగుతున్నాయి' అన్నారు. పన్నారాయల్ మాట్లాడుతూ 'నేను నిర్మాతగా చేసిన తొలి చిత్రమే హిట్ టాక్ తెచ్చుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇంత సక్సెస్‌ను నేను ఊహించలేదు. ఈ ఉత్సాహంతో ఏటా రెండు సినిమాలు చేస్తాను' అని చెప్పారు. మంచి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని సోనాలి తెలిపారు.

ప్రేమలో కొత్త కోణం



'అథర్వ' ఫేమ్ కార్తిక్ రాజు, మోక్ష, షెర్రీ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'ఐ హేట్ యూ'. అంజిరామ్ దర్శకత్వంలో నాగరాజు నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 'మా 'ఐ హేట్ యూ' చిత్రం వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కింది. ప్రేమలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సాకార్. సినిమాటోగ్రఫీ: ఎస్. మురళీ మోహన్ రెడ్డి.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



ఉల్ఫా శాంతి ఒప్పందం

ఈశాన్య భారతదేశం... భౌగోళికంగా, వాతావరణపరంగా, సాంస్కృతిక, భౌతిక లక్షణాల పరంగా మిగతా భారతదేశంతో పోలిస్తే చాలా భిన్నం. కొండ ప్రాంత తెగలతో కూడిన ఆ ప్రాంతంలో స్వేచ్ఛా కాంక్ష, సాంస్కృతిక అస్థిత్వ ఆకాంక్ష పిసరంత ఎక్కువే. ఆ ప్రాంతంలో అస్సాం రాష్ట్రానిది భిన్న నేపథ్యం.

బ్రిటిష్‌వారి కాలంలో 1820లో అస్సాం ప్రాంతంలో మూడు విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. బ్రిటిష్‌వారు అస్సాం టీ వ్యాపారాన్ని భారీ ఎత్తున చేపట్టి తేయాకు తోటలను విస్తరించారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో బొగ్గు, చమురు నిల్వల నిక్షేపాలు కనుగొనడంతోపాటు వాటి వెలికితీత ప్రారంభమైంది. కార్మిక సాంద్రత గల ఈ రంగాలకు స్థానిక కూలీల కొరత ఏర్పడింది. దీనితో బ్రిటిష్‌వారు దేశంలోని విభిన్న ప్రాంతాలనుంచి పనివారిని, బెంగాల్ నుంచి విద్యావంతులైన ఉద్యోగస్తులను ఈ ప్రాంతానికి తీసుకురావడం ప్రారంభించారు. కాలక్రమంలో ఆ ప్రాంత స్థానిక ప్రజల అస్థిత్వం, సహజవనరుల అందుబాటు నిర్వీర్యమయ్యాయి. 1947లో భారతదేశ విభజన, తూర్పు పాకిస్తాన్‌లో అస్థిర పరిస్థితుల కారణంగా భారీ సంఖ్యలో ఆ ప్రాంతం నుంచి కాందీశీకులు సరిహద్దు అస్సాంలోకి ప్రవేశించారు. దీనితో ఆ ప్రాంత స్థానిక ప్రజల్లో సాంస్కృతిక, భాషా, రాజకీయపర అస్థిత్వం, సహజ వనరులపై హక్కులపరంగా అభద్రత భావం పెరిగాయి.

● చారిత్రకంగా దోపిడీకి, నిర్లక్ష్యానికి గురైన ఆ ప్రాంతంలో స్థానికులు తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి, హక్కుల సాధనకు ఉద్యమించారు. 1967లో ఏర్పడిన ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్(ఏఏఎస్‌యూ) వంటి సంస్థలు ఉద్యమాలు చేపట్టాయి. 1971లో బంగ్లాదేశ్ విముక్తి పోరాట సమయంలో ఆ ప్రాంతం నుంచి భారీ ఎత్తున కాందీశీకులు సరిహద్దు అస్సాంకు పోటెత్తారు. వారందరినీ ప్రభుత్వం ఓటర్ల జాబితాలో చేర్చుతుండడంతో స్థానికులు తమ ప్రాంతంలోనే మైనార్టీలుగా మారారు. దీనితో ఏఏఎస్‌యూ 1979లో అస్సాం ఉద్యమాన్ని చేపట్టింది. అక్రమ వలసదారులను ఓటర్ల జాబితాలో చేర్చడాన్ని అలాగే బెంగాల్, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన బెంగాలీలను వ్యతిరేకిస్తూ సత్యాగ్రహం చేసింది.

● ఏఏఎస్‌యూలోని అతివాద నాయకులైన భీమకాంత బురాగోహైన్, అరబింద్ రాజ్‌ఖోవా, అనుప్ చేతియా, ప్రదీప్ గొగోయ్, భద్రేశ్వర్ గోహైన్, పరేష్ బారువాలు 1979లో భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'సార్వభౌమ అస్సాం' డిమాండ్‌తో సాయుధ వేర్పాటువాద ఉద్యమాన్ని ప్రారంభించారు.

తొలుత పీడిత ప్రజలకు సహాయం చేసే ఉద్యమంగా తమ విధానాలు ఉంటాయని తెలిపినా అనతి కాలంలోనే కిడ్నాపులు, బాంబు పేలుళ్లు, దోపిడీలు, ఆయుధాల సమీకరణ, మాదక ద్రవ్యాల రవాణా, ప్రభుత్వ దళాలతో ప్రత్యక్ష పోరాటం వంటి చర్యలను ఉధృతం చేశారు.

● మియన్మార్, బంగ్లాదేశ్ వంటి సరిహద్దు దేశాల్లో, అడవుల్లో తమ స్థావరాలు ఏర్పాటు చేసుకుని భారత సైనిక దళాలకు చిక్కకుండా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ భారత్‌లో తీవ్రవాద కార్యకలాపాలు మొదలుపెట్టారు.

90వ దశకం నాటికి అస్సాం ప్రాంతంలో 'ఉల్ఫా' విశేష ప్రాబల్యం పొందింది. సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నామనే భావాన్ని వ్యాప్తి చేసింది.

● 1985లోనే రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఉల్ఫా సంస్థకు మాతృక అయిన ఏఏఎస్‌యూతోపాటు మరికొన్ని ఉద్యమ సంస్థలను చర్చలకు ఆహ్వానించింది. ఆరేళ్ల సుదీర్ఘ అస్సాం ఉద్యమ పోరాటానికి ఏఏఎస్‌యూ స్వస్తి పలికి భారత ప్రభుత్వంతో 'అస్సాం ఒప్పందం' చేసుకుంది. ఏఏఎస్‌యూ, ఆల్ అస్సాం గణ సంగ్రామ పరిషత్, కేంద్ర ప్రభుత్వం, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ప్రభుత్వం తూర్పు పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన వారిలో 1951 తరవాత, 1971కి ముందు వచ్చిన వారికి మాత్రమే పౌరసత్వం ఇచ్చి మిగిలినవారిని ఓటర్ల జాబితా నుంచి తీసివేసి చట్ట ప్రకారం తిప్పి పంపేందుకు సమ్మతించింది. అస్సాం స్థానికులకు రాజ్యాంగపరంగా భద్రత కల్పించేందుకు, రాష్ట్ర సరిహద్దులను పటిష్ఠం చేసి నిఘా పెంచేందుకు అంగీకరించింది. దీనితో అస్సాం ఉద్యమ పోరాటానికి స్వస్తి పలికిన ఏఏఎస్‌యూ, ఏఏజీఎస్‌పీ, ఇతర ఉద్యమ సంస్థలు కలసి 'అస్సాం గణ పరిషత్(ఏజీపీ)' అనే ప్రాంతీయ రాజకీయ పార్టీగా ఏర్పడ్డాయి. 1985 డిసెంబరు ఎన్నికల్లో ఈ పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

● అయినప్పటికీ అస్సాం ప్రాంతంలోకి అక్రమ చొరబాట్లు మాత్రం ఆగలేదు. అదేవిధంగా ఉల్ఫా తన విప్లవాత్మక ఉద్యమ పంథాను వీడక ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసింది. ప్రభుత్వాన్ని, అధికారులను 'అస్సాం గణ పరిషత్' ప్రభావితం చేయడం మొదలుపెట్టింది. యూనిలివర్, టాటా టీ వంటి వాణిజ్య సంస్థలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడింది.

● ఈ నేపథ్యంలో ఉల్ఫా తీవ్రవాదుల అణచివేతకు అంతర్జాతీయ వాణిజ్య సంస్థలు, వ్యాపార వర్గాలనుంచి భారత ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. దీనితో భారత ప్రభుత్వం ఉల్ఫా తీవ్రవాదుల ఏరివేతకు 'ఆపరేషన్ భజరంగ్'ను చేపట్టింది. 1200ల మందికి పైగా ఉల్ఫా తీవ్రవాదులను అరెస్ట్ చేసింది. అస్సాంను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి రాష్ట్రపతి పాలన విధించింది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చింది. దీనివల్ల ఉల్ఫా అగ్రశ్రేణి నాయకత్వం చాలావరకు అరెస్ట్ కావడం/మరణించడంతో ఒక వర్గం ఉల్ఫా తీవ్రవాదులు లొంగిపోవడానికి నిర్ణయించుకున్నారు. పరేష్ బారువా నాయకత్వంలో మరికొంతమంది ఉద్యమాన్ని వీడేందుకు సమ్మతించలేదు. ఈ కారణంగా ఉల్ఫాలో 1992లో చీలిక వచ్చింది. లొంగిపోయిన ఉల్ఫా తీవ్రవాదులను సరెండర్డ్ ఉల్ఫాగా పరిగణించారు. వీరు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఉల్ఫా తీవ్రవాదులను, వారి కుటుంబాలను రహస్యంగా హతమార్చడంతో ఈ సుదీర్ఘ పోరాటంలో అలసిపోయిన ఉల్ఫా తీవ్రవాదులు భారీ సంఖ్యలో లొంగిపోయారు. 1991 నుంచి 1998 మధ్య కాలంలో ఎనిమిది వేలమంది తీవ్రవాదులు లొంగిపోయినట్లు అంచనా. భారత సైన్యం కూడా ఉల్ఫా ఉగ్రవాదులను సరిహద్దు ప్రాంతాల నుంచి ఏరివేయడం ప్రారంభించింది. భారత అభ్యర్థన మేరకు భూటాన్ ప్రభుత్వం తమ భూభాగంలో ఉన్న ఉల్ఫా క్యాంప్‌లను 2003లో తమ రాయల్ ఆర్మీ చేత 'ఆపరేషన్ ఆల్ క్లియర్' పేరుతో నాశనం చేయించింది. ఉద్యమ విరమణకు ఉల్ఫాలో ఒత్తిడి పెరిగింది. 2003లో ఉల్ఫా మూడు కండిషన్లతో భారత ప్రభుత్వంతో చర్చలకు ప్రతిపాదించింది. భారతదేశం వెలుపల, ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో అస్సాం సార్వభౌమాధికారం ప్రధానాంశంగా చర్చలు ఉండాలని ఉల్ఫా విధించిన ఆంక్షలకు ప్రభుత్వం సమ్మతించలేదు. 2005లో ఉల్ఫా పదకొండుమంది సభ్యులతో ఇందిరా రైసోమ్ గోస్వామి(అస్సామీ రచయిత్రి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత) ఆధ్వర్యంలో 'పీపుల్స్ కన్సల్టేటివ్ గ్రూప్'ను ఏర్పాటు చేసి చర్చలకు ప్రతిపాదించింది. మూడు రౌండ్ల అనంతరం ఉల్ఫా చర్చలను బహిష్కరించి తిరిగి హింసాత్మక చర్యలు కొనసాగించింది.

● 2008లో అరబింద్ రాజ్ ఖోవా వంటి కమాండర్స్ మళ్ళీ ప్రభుత్వంతో చర్చల ప్రస్తావన తెచ్చారు. చర్చలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఈ వర్గాన్ని చర్చలను వ్యతిరేకిస్తున్న పరేష్ బారువా వర్గం ఉల్ఫా నుంచి బహిష్కరించింది. ఇలా 2012లో ఉల్ఫా(ఇండిపెండెంట్)గా ప్రకటించుకుని అస్సాం సార్వభౌమత్వమే తమ ఆశయంగా పునరుద్ఘాటించారు.

● అరబింద్ రాజ్ ఖోవా వర్గం 2012లో 12 డిమాండ్ల చార్టర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించి చర్చల నివిఎత్తం ప్రభుత్వ క్యాంప్‌లలో పన్నెండేళ్లు నిరీక్షించింది. రాజ్ ఖోవా వర్గం ప్రతిపాదించిన డిమాండ్లలో స్థానిక తెగలకు భూ సంబంధ హక్కులు, నూతన రిజర్వేషన్లు, స్థానిక సంస్కృతి-సంప్రదాయాలు, భాషల పరిరక్షణ, స్థానిక ఖనిజ సంపద వనరుల్లో స్థానికుల వాటా, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను అడ్డుకోవడం, వలస వచ్చినవారిని తిప్పి పంపడం, పౌరసత్వ రిజిస్టర్ల సవరణ, లొంగిపోయిన మిలిటెంట్లకు పునరావాస ప్యాకేజీ వంటి అంశాలు ఉన్నాయి.

● 2023 ఏప్రిల్‌లో భారత ప్రభుత్వం స్పందించి ఒక రౌండ్ చర్చలు జరిపింది. తరవాత 2023 డిసెంబరు 29న కేంద్ర ప్రభుత్వం, అస్సాం ప్రభుత్వం, అరబింద్ రాజ్ ఖోవా నేతృత్వంలోని ప్రోటాల్క్స్ ఉల్ఫా వర్గం కలసి త్రైపాక్షిక శాంతి ఒప్పందం చేసుకున్నాయి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

త్రైపాక్షిక శాంతి ఒప్పందం ప్రయోజనాలు

● తొమ్మిది వేలమందికి పైగా మిలిటెంట్లు లొంగిపోవడంతో అస్సాంలోని 85 శాతం ప్రాంతాల నుంచి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ యాక్ట్‌ను ఉపసంహరించనున్నారు.

● అస్సాంలోని 127 అసెంబ్లీ స్థానాల్లో 97 స్థానాలను స్థానిక అస్సామీలకు రిజర్వ్ చేస్తారు. భవిష్యత్తులో నిర్వహించే డీలిమిటేషన్ ప్రక్రియలో ఈ విధానాన్ని అనుసరిస్తారు.

● తక్షణమే 1.5 లక్షల కోట్ల పెట్టుబడులతో అస్సాం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తూ ఇతరత్రా ప్యాకేజీలు, భారీ ప్రాజెక్టులు కేటాయిస్తారు.

● ఉల్ఫా డిమాండ్ల పరిష్కారానికి చొరబాట్ల నిరోధానికి అక్రమ వలసదారుల ఏరివేతకు ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుంది.

● ఈ త్రైపాక్షిక ఒప్పందంతో దాదాపు వేయిమందిని బలిగొన్న హింసాత్మక ఉద్యమానికి తెరపడిందని, అస్సాంలో శాంతి స్థాపన జరిగిందని కేంద్ర హోంమంత్రి ప్రకటించడం అర్ధ సత్యమనీ, మియన్మార్ నుంచి ఉద్యమాన్ని కొనసాగిస్తున్న పరేష్ బారువా నేతృత్వంలోని ఉల్ఫా(ఇండిపెండెంట్) వర్గం క్రియాశీలంగా ఉండగా సంపూర్ణ శాంతి ఎలా సాధ్యమౌతుందని విమర్శకులు ప్రశ్నిస్తున్నారు.

● ఉల్ఫాకు గత 44 ఏళ్ల నుంచి ఇప్పటివరకూ చుట్టుపక్కల దేశాలైన బంగ్లాదేశ్, మియన్మార్, చైనా, పాకిస్తాన్‌ల సహాయం లభిస్తోంది. పాకిస్తాన్ ఐఎస్‌ఐ నుంచి వీరు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. చైనా, ఇస్లామిక్ (హర్కత్ ఉల్ జిహాద్ ఇ ఇస్లామీ తదితరాలు) ఉగ్రవాద సంస్థల నుంచి వీరికి ఆయుధ సహాయం అందుతోంది. పరేష్ బారువా గతంలోనే అల్‌ఖైదా నేత ఒసామా బిన్ లాడెన్‌తో చర్చలు జరిపేంత నెట్‌వర్క్‌ను ఏర్పరచుకున్నాడు. పైగా గత పన్నెండేళ్ల నుంచి ప్రభుత్వ క్యాంప్‌లలో ఆశ్రయం పొందుతూ పునరావాస సహాయం కోసం ఎదురు చూసి విసిగిన అనేకమంది మిలిటెంట్లు తిరిగి పరేష్ బారువా నేతృత్వంలోని ఉల్ఫా వర్గంలో చేరినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ప్రస్తుత త్రైపాక్షిక ఒప్పందంతో అస్సాంలో పూర్తిస్థాయి శాంతి నెలకొల్పడమనేది సందేహమే. ప్రభుత్వం చర్చల అంశాన్ని పన్నెండేళ్లు సాగదీసి వ్యూహాత్మకంగా రాజ్ ఖోవా వర్గం డిమాండ్లపై పట్టుపట్టకుండా వారు విసుగు చెంది పునరావాసం కోసం మాత్రమే బేరమాడేలా చేసిందని ఇది ఎప్పటికైనా వారు తమ డిమాండ్ల కోసం తిరిగి ఉద్యమించడానికి దారితీయవచ్చని విశ్లేషకుల అంచనా!

● ప్రస్తుత శాంతి ఒప్పందం అనేది అటు ప్రభుత్వం ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు ఇటు రాజ్ ఖోవా వర్గ పునరావాసానికి మాత్రమే ఉపయోగపడిందనీ అసలు ఉద్యమ కారణం అయిన అక్రమ వలసల అంశంపై నిర్దిష్ట చర్యలు లేకుండానే ఒప్పందం ముగిసిందనీ అస్సాం ప్రాంతానికి ఒనగూరింది ఏమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● భారీ సంఖ్యలో మిలిటెంట్లు లొంగిపోవడం, అస్సాం ప్రాంతంలో దాదాపు 85 శాతం మిలిటరీ అజమాయిషీ నుంచి బయట పడడం వంటి సానుకూల అంశాలను విస్మరించరాదని ఆశావహుల అభిప్రాయం.

తెలంగాణ వ్యవసాయరంగం

ఉద్యానవన రంగం

పూలు, పండ్లు, కూరగాయలు మొదలైనవాటి పెంపకాన్ని హార్టికల్చర్(ఉద్యానవన పంటల పెంపకం) అంటారు. తెలంగాణలో మామిడి, బత్తాయి, నారింజ, జామ, దానిమ్మ, టమాట, బెండకాయ, ఆయిల్‌పామ్, జీడిపప్పు, మిరపకాయలు, పసుపు ప్రధాన ఉద్యాన పంటలు.

రాష్ట్రంలో 12.94 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 54.82 లక్షల టన్నుల ఉద్యాన పంటల ఉత్పత్త సాలీనా జరుగుతున్నది. తెలంగాణ మొత్తం సాగు విస్తీర్ణంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం 6.52 శాతం. కాగా మొత్తం తెలంగాణ వార్షిక వ్యవసాయ అదనపు విలువలో ఉద్యాన ఉత్పత్తుల విలువ 31 శాతం.

తెలంగాణలో 2015-16లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం 3.80 లక్షల ఎకరాలుగా ఉంది. అది 2021-22 నాటికి దాదాపు 240 శాతం పెరిగి 12.94 లక్షల ఎకరాలకు చేరింది.

2015-16 నుంచి 2022-23 వరకు వివిధ ఉద్యాన పంటల ఉత్పత్తిలో వచ్చిన మార్పును కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

వార్షిక ఉత్పత్తి(లక్ష మెట్రిక్ టన్నులు)

ఉద్యానవన పంట	2015-16	2022-23
పండ్లు	12.15	24.78
కూరగాయలు	12.67	16.44
పూలు	0.08	0.58
తోట పంటలు	0.02	3.66
సుగంధ ద్రవ్యాలు	4.4	9.26

పై పట్టికను పరిశీలిస్తే 2015-16, 2022-23 సంవత్సరాల మధ్య అన్నిరకాల ఉద్యాన పంటల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. అందులో పూలు, తోట పంటల ఉత్పత్తి చాలా రెట్లు పెరగ్గా; పండ్లు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి రెండింతల కంటే ఎక్కువగా పెరిగింది. కూరగాయల ఉత్పత్తి మాత్రం కేవలం 30 శాతం మాత్రమే పెరిగింది.



ఎకానమీ

సమగ్ర ఉద్యానవన పంటల అభివృద్ధి కార్యక్రమం అమలు, పాలీహౌస్ లేదా గ్రీన్‌హౌస్‌ల ఏర్పాటు, అదనంగా భూమిని శాశ్వతంగా ఉద్యానవన పంటల కిందికి తీసుకురావడం, ఉద్యాన పంటల కోసం భూమి ఉపరితలాన్ని బావ్య పదార్థాలతో నింపడం(మిల్చింగ్), సంబంధిత పంటల కోసం రైతులకు ప్రత్యేకంగా సబ్సిడీలు ఇవ్వడం లాంటి చర్యల వల్ల ఉద్యానవన పంటలు పండించే విస్తీర్ణం, ఉత్పత్తి పెరిగింది.

పట్టిక 2: 2014-15 నుంచి 2022-23 సంవత్సరాల మధ్య తెలంగాణ ఆయిల్ పామ్ సాగు, ఉత్పత్తిలో వచ్చిన మార్పు

సం.	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	ఉత్పత్తి (మెట్రిక్ టన్నుల్లో)	దేశంలో జరిగే మొత్తం ఉత్పత్తిలో తెలంగాణ ఉత్పత్తి %
2014-15	972	57,873	5.10
2015-16	471	75,447	5.81
2016-17	673	88,119	6.82
2017-18	1413	1,47,516	8.99
2018-19	870	1,97,632	12.03
2019-20	2,133	2,08,826	13.52
2020-21	1,845	1,49,488	8.85
2021-22	6,124	---	---
2022-23	17,657	---	---

ఆయిల్ పామ్ సాగు

భారతదేశంలో వంట నూనెల(ఎడిబుల్ ఆయిల్) వినియోగం సంవత్సరానికి 25 మిలియన్ టన్నులు. తలసరి వార్షిక వినియోగం ఒక వ్యక్తికి 19 కిలోలు. అయితే దేశంలో జరుగుతున్న వార్షిక ఉత్పత్తి 12.30 మిలియన్ టన్నులు మాత్రమే. అందువల్ల విదేశాల నుంచి ప్రత్యేకించి ఇండోనేషియా, మలేషియా నుంచి పెద్దఎత్తున వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్నాం. ఈ డిమాండ్ సరఫరా మధ్య గల అంతరాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ ఆయిల్ పామ్ చట్టం 1993 ద్వారా ఆయిల్ పామ్ ఉత్పత్తిని నియంత్రిస్తున్నారు. తెలంగాణ ఆయిల్ పామ్ విస్తీర్ణం ఉత్పత్తిలో వచ్చిన మార్పును పట్టిక-2 ద్వారా తెలుసుకోవచ్చు.

పట్టిక-2ను పరిశీలిస్తే తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం 972 హెక్టార్ల నుంచి 17,657 హెక్టార్లకు పెరిగింది. అదేవిధంగా ఉత్పత్తి 57,873 మెట్రిక్ టన్నుల నుంచి 2019-20 నాటికి 2,08,826 మెట్రిక్ టన్నులకు పెరిగింది. అదేవిధంగా దేశంలో ఉత్పత్తి అవుతున్న మొత్తం ఆయిల్ పామ్ ఉత్పత్తి తెలంగాణ ఉత్పత్తి శాతం 2014-15లో 5.10 శాతం ఉండగా, 2019-20 నాటికి 13.52 శాతానికి పెరిగింది. విస్తీర్ణ విషయంలో తెలంగాణ ఆరోస్థానం, తాజా పండ్ల గుత్తుల ఉత్పత్తిలో రెండోస్థానంలో ఉంది.

తెలంగాణ పశుసంవర్ధక రంగం

తెలంగాణలో దాదాపు 25.82 లక్షల కుటుంబాలు తమ జీవనోపాధికి పశువుల పెంపకం, సంబంధిత కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నాయి. తెలంగాణలో పశువుల సంఖ్య 2012లో 26.7 మిలియన్లు, 2019లో 32.6 మిలియన్లుగా ఉంది. అంటే ఈ కాలంలో పశువుల సంఖ్యలో 22 శాతం వృద్ధి చోటుచేసుకుంది. దేశంలో పశువుల సంఖ్య వృద్ధిలో పశ్చిమబెంగాల్ 23.51 శాతంతో మొదటిస్థానంలో ఉండగా, తెలంగాణ రెండోస్థానంలో ఉంది. తెలంగాణ వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల అదనపు ఉత్పత్తి విలువలో 48 శాతం పశు సంవర్ధక రంగానిదే కావడం గమనార్హం.

పశుసంపదకు సంబంధించి తెలంగాణ 19.1 మిలియన్లతో మొదటిస్థానంలో ఉంది. కోడిగుడ్ల ఉత్పత్తిలో 1667 కోట్లతో దేశంలో మూడోస్థానంలో ఉంది. మాంసం ఉత్పత్తిలో 10.04 లక్షల టన్నుల ఉత్పత్తితో దేశంలో తెలంగాణ అయిదోస్థానంలో, 58.07 లక్షల టన్నుల పాల ఉత్పత్తితో 13వస్థానంలో ఉంది.

పట్టిక 3: తెలంగాణ పశుసంవర్ధక రంగం స్థూల అదనపు విలువలో వచ్చిన మార్పు

సంవత్సరం	పశుసంవర్ధక రంగం స్థూల అదనపు విలువ (రూ.కోట్లలో)
2014-15	29,282
2015-16	33,755
2016-17	39,816
2017-18	46,595
2018-19	57,513
2019-20	68,865
2020-21	79,814
2021-22	93,599
2022-23	1,03,895

పశుసంవర్ధక రంగం అదనపు స్థూలవిలువలో వచ్చిన మార్పును పట్టిక-3లో తెలుసుకోవచ్చు.

పట్టిక-3 గమనిస్తే తెలంగాణ పశుసంవర్ధక స్థూల అదనపు విలువ 2014-15లో రూ.29,282 కోట్లుగా ఉండగా, 2022-23 నాటికి రూ.1,03,895 కోట్లకు పెరిగింది.

గొర్రెల పెంపకం, అభివృద్ధి కార్యక్రమం

గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం, గొర్రెల పెంపకందారులకు స్థిరమైన జీవనోపాధికి రాష్ట్రంలో గొర్రెల పెంపకం, అభివృద్ధి కార్యక్రమాలు అమలుపరుస్తున్నారు. ఈ పథకం కింద 75 శాతం సబ్సిడీతో రూ.1.25 లక్షల యూనిట్ ధరలో 21(20+1) గొర్రెలను పంపిణీ చేస్తున్నారు. మొదటిదశలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల్లోని 3,92,552 మందికి 82.64 లక్షల గొర్రెలను పంపిణీ చేశారు. 20వ పశుగణన ప్రకారం దేశంలోని మొత్తం గొర్రెల జనాభాలో 25.72 శాతంతో తెలంగాణ మొదటిస్థానంలో ఉంది.

సమీకృత మత్స్య అభివృద్ధి పథకం

నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులతో సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద తెలంగాణలో చేపలు, రొయ్యలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. రాష్ట్రంలో చేపల ఉత్పత్తి 2014-15లో 2.6 లక్షల టన్నులు ఉండగా, 2021-22 నాటికి 3.76 లక్షల టన్నులకు పెరిగింది. అదేవిధంగా రొయ్యల ఉత్పత్తి 0.08 లక్షల టన్నుల నుంచి 0.14 లక్షల టన్నులకు పెరిగింది. అదేవిధంగా చేపలు, రొయ్యల ఉత్పత్తి విలువ రూ.2,637 కోట్ల నుంచి రూ.5,860 కోట్లకు పెరిగింది.



డా.ఎం.ఏ.మాలిక్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

అర్థమెటికల్ రీజనింగ్

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

పార్ట్-2

1. సూర్య పుట్టినప్పుడు అతని తండ్రి వయసు అతని సోదరుని కంటే 32 సంవత్సరాలు ఎక్కువ. సూర్య తల్లి వయస్సు, అతని సోదరి కంటే 25 సంవత్సరాలు ఎక్కువ. సూర్య పుట్టినప్పుడు అతని సోదరునికి 6 సంవత్సరాలు. అతని తల్లికి అతని తండ్రి కంటే 3 సంవత్సరాలు తక్కువ. అయిన సూర్య పుట్టినప్పుడు అతని సోదరి వయసు ఎన్ని సంవత్సరాలు?

ఎ) 10 సం॥ బి) 12 సం॥ సి) 8 సం॥ డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: సూర్య పుట్టినప్పుడు అతని సోదరుని వయస్సు = 6 సం.

సూర్య పుట్టినప్పుడు అతని తండ్రి వయస్సు = సోదరుని కంటే 32 సం॥లు ఎక్కువ అనగా

= 32 + 6 = 38 సం॥.

అతని తల్లి, తండ్రి కంటే 3 సం॥లు చిన్నది అనగా

38 - 3 = 35 సం॥.

అతని తల్లి, సోదరి కంటే 25 సం॥లు పెద్ద అనగా

సూర్య పుట్టినప్పుడు అతని సోదరి వయస్సు

35 - 25 = 10 సం॥.

∴ సమాధానం 10 సం॥.

2. ఒక బస్సు 'A' నగరం నుంచి బయలుదేరింది. బస్సు బయలుదేరే సమయానికి ప్రయాణికుల్లోని మహిళల సంఖ్య, పురుషుల సంఖ్యలో సగం. ఆ బస్సు 'B' నగరానికి చేరుకున్న తరవాత 10 మంది పురుషులు బస్సు దిగారు, ఐదుగురు మహిళలు బస్సు ఎక్కారు. ఇప్పుడు ఆ బస్సులో పురుషుల సంఖ్య, మహిళల సంఖ్య సమానం. అయితే ఆ బస్సు బయలుదేరిన సమయంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారు?

ఎ) 40 బి) 42 సి) 36 డి) 45

సమాధానం: (డి)

వివరణ : 'A' నగరంలో బస్సు బయలుదేరిన సమయంలో మహిళల సంఖ్య పురుషుల సంఖ్యలో సగం కావున

పురుషులు = 2x

మహిళలు = x

'B' నగరంలో 10 మంది పురుషులు బస్సు దిగారు కావున 2x - 10

ఐదుగురు మహిళలు బస్సు ఎక్కారు కావున x + 5

ఇప్పుడు పురుషులు, మహిళలు సమానం కావున.

2x - 10 = x + 5

2x - x = 5 + 10

x = 15

'A' నగరంలో బస్సు బయలుదేరినప్పుడు

పురుషులు 2x = 2 x 15 = 30

మహిళలు x = 15

మొత్తం ప్రయాణికులు 30 + 15 = 45.

∴ సమాధానం 45.

3. ఒక క్రికెట్ మ్యాచ్‌లో P, Q, R, S అనే నలుగురు క్రీడాకారుల సరాసరి పరుగుల సంఖ్య 30. S అనే వ్యక్తి P కంటే 6 పరుగులు ఎక్కువ చేశాడు. Q అనే వ్యక్తి S కంటే 12 పరుగులు ఎక్కువ చేశాడు. Q, R వీరిద్దరూ కలిసి చేసిన పరుగుల సంఖ్య 70. అయితే 'P' చేసిన పరుగులు ఎన్ని?

ఎ) 20 బి) 22 సి) 28 డి) 40

సమాధానం: (బి)

వివరణ: P, Q, R, S నలుగురి సరాసరి పరుగుల సంఖ్య 30 కావున మొత్తం పరుగులు 30 x 4 = 120.

Q, R వీరిద్దరూ చేసిన పరుగులు 70 మొత్తం 120 నుంచి 70 తీసివేస్తే మిగిలిన 50 పరుగులు P, S చేయాలి.

S అనే వ్యక్తి P కంటే 6 పరుగులు ఎక్కువ చేశాడు. అనగా S పరుగులు = P + 6.

ఇప్పుడు 'S' స్థానంలో P + S = 50

P + P + 6 = 50

2P + 6 + 50

2P = 50 - 6

2P = 44

P = 44/2 = 22.

∴ సమాధానం 22 అవుతుంది.

4. ఒక గ్రూపులో 40 పావురాలు, 25 ఏనుగులు, 10 ఆవులు, కొంతమంది కాపలా దారులు ఉన్నారు. వీటి కాళ్ళ సంఖ్య తలల కంటే 157 ఎక్కువ. అయితే కాపలా దారులు ఎంతమంది?

ఎ) 10 బి) 12 సి) 18 డి) 15

సమాధానం: (బి)

వివరణ: ఉదాహరణకు మానవుని కాళ్ళు, తల కంటే ఒకటి ఎక్కువ అంతే కదండి. కాళ్ళు = తల + ఎక్కువ

2 = 1 + 1

గమనించండి: ఎక్కువ అనేది తల పక్కనే యాడ్ చేసిన కాళ్ళకు సమానమవుతుంది. ఇదే రూల్ ఇచ్చిన ప్రశ్నకు అనుసరించండి.



40 పావురాలు = 40 x 2 కాళ్ళు

25 ఏనుగులు = 25 x 4 కాళ్ళు

10 ఆవులు = 10 x 4 కాళ్ళు

కాపలాదారులు x అనుకొంటే వారి కాళ్ళు 2x

కాళ్ళు = తలలు + ఎక్కువ

40 x 2 + 25 x 4 + 10 x 4 + 2x = 40 + 25 + 10 + x + 157

80 + 100 + 40 + 2x = 75 + x + 157

220 + 2x = 232 + x

2x-x = 232 - 220

x = 12.

∴ సమాధానం 12 అవుతుంది.

5. ఒక కుటుంబంలో తండ్రి 1/3వంతు కేకు తిన్నాడు. అతను తిన్నది ఆ కుటుంబంలో నలుగురు వ్యక్తులకు సరిపోతుంది. అయిన ఆ కుటుంబ సభ్యులు ఎంతమంది?

ఎ) 12 బి) 10 సి) 9 డి) 15

సమాధానం: (సి)

వివరణ: ఎన్ని 1/3లు ఒకటికి సమానమండి. మూడు కదా.

1/3 వంతు కేకు తండ్రి తిన్నాడు అనగా ఒక వ్యక్తి అతను తిన్నది ఆ కుటుంబంలో నలుగురికి సరిపోతుంది. అనగా 1/3 వంతు కేకు ఆ కుటుంబంలో నలుగురికి సరిపోతుందని అర్థం. మూడు 1/3లు 1కి సమానం. కావున 1/3 + 1/3 + 1/3 = 1+4+4=9 (1/3 వంతు కేకు తండ్రి తిన్నాడు కావున మొదటి 1/3 స్థానంలో 1 ఉంటుంది)

6. ఒక కొంగకు ముందు మూడు కొంగలు, ఒక కొంగకు తరవాత మూడు కొంగలు, రెండూ కొంగల మధ్యలో రెండు కొంగలు ఉండాలంటే కావాల్సిన కనీస కొంగల సంఖ్య ఎంత?

ఎ) 6 బి) 4 సి) 8 డి) 9

సమాధానం: (బి)

వివరణ:

కొంగ	కొంగ	కొంగ	కొంగ
1	2	3	4


ఒక కొంగకు ముందు 3 కొంగలు అనగా 4వ కొంగకు ముందు మూడు ఉన్నాయి. ఒక కొంగకు తరవాత మూడు కొంగలు అనగా 1వ కొంగ తరవాత 2, 3, 4 అనగా మూడు కొంగలు ఉన్నాయి. రెండు కొంగల మధ్యలో రెండు కొంగలు అనగా 1, 4 కొంగల మధ్య 2, 3 అనే రెండు కొంగలు ఉన్నాయి. ఇచ్చిన రూల్‌కి సరిపోవాలంటే ఉండాల్సిన కనీస కొంగల సంఖ్య 4.

7. ఒక తరగతిలో 50 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో కొంతమంది ఆంగ్లం మాట్లాడతారు. మరి కొందరు హిందీ మాట్లాడతారు. 10 మంది విద్యార్థులు రెండు భాషలు మాట్లాడతారు. కనీసం ఆంగ్లం మాట్లాడేవారు 24 మంది అయిన కేవలం హిందీ, కేవలం ఆంగ్లం, కనీసం హిందీ మాట్లాడే వారు ఎంతెంత మంది?

ఎ) 26, 14, 36 బి) 26, 36, 14 సి) 14, 36, 26 డి) 14, 26, 36

సమాధానం: (ఎ)

వివరణ:-



26 + 10 + 14 = 50 మంది విద్యార్థులు.

కనీసం ఆంగ్లం అనగా ఆంగ్లం వృత్తం మొత్తంలో 24 ఉండాలి. మొత్తం విద్యార్థులు 50 నుంచి 24 తీసివేస్తే వచ్చిన 26ను హిందీ వృత్తం భాగంలో రాశాం. ఇప్పుడు కేవలం హిందీ అనగా ఆంగ్లం వృత్తాన్ని పూర్తిగా తొలగించిన ఉండే 26 మంది విద్యార్థులు. కేవలం ఆంగ్లం అనగా హిందీ వృత్తాన్ని పూర్తిగా తొలగించిన ఉండే 14 మంది విద్యార్థులు. కనీసం హిందీ అనగా హిందీ వృత్త మొత్తంలో గల సంఖ్యలు 26 + 10 = 36. కావున సమాధానం 26, 14, 36 అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ


హైదరాబాద్ కేపీహెచ్‌బీలో పోటీల్లో పాల్గొన్న మహిళలు


జగిత్యాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

హరివిల్లై.. మెరిసె!

ఉత్సాహంగా "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, యువతులు

- తెలంగాణలో ఉమ్మడి జిల్లాల విజేతలకు 10న హైదరాబాద్‌లో ఫైనల్స్
- ఏపీ, తమిళనాడు, కర్ణాటక విజేతలకు 11న విజయవాడలో

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన) రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటకల్లోని 83 కేంద్రాల్లో జనవరి 5, 6, 7 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో పాల్గొని తమ రంగవల్లులతో సంక్రాంతి శోభను ఇనుమడింపజేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ బహుమతి రూ.6,000, ద్వితీయ బహుమతి రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తోపాటు అనేక కన్సొలేషన్ బహుమతుల్ని మహిళలు గెల్చుకున్నారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి ఎంపికైన పదిమంది మహిళలకు ఈ నెల 10న హైదరాబాద్‌లో ఫైనల్ పోటీలు జరుగుతాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని 13 పాత జిల్లాలు, తమిళనాడు, కర్ణాటకల నుంచి ఒక్కొక్కరు... మొత్తం 15 మందికి ఈ నెల 11న విజయవాడలో ఫైనల్స్ జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.1,70,000కు పైగా బహుమతులు, ఇంకా గిఫ్ట్ హ్యాంపర్లు లభిస్తాయి.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్, పాత కలెక్టరేట్ మైదానం, బోధన్, కామారెడ్డి, బాన్సువాడ కేంద్రాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అత్యధికంగా 458 మంది మహిళలు, యువతులు హాజరయ్యారు. ములుగు జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోటీలను మంత్రి సీతక్క ప్రారంభించారు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ చర్చి కాంపౌండ్‌లో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ స్వయంగా ముగ్గు వేసి పోటీలను ప్రారంభించారు. ఆశా వర్కర్ అయిన ఎం.కవిత (మడికొండ) ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. ఖమ్మంలో జరిగిన పోటీలకు 'ఆంధ్రజ్యోతి' ప్రచురణకర్త కోగంటి వెంకట శేషగిరిరావు, ఖమ్మంలోని బీలీఫ్ ఆసుపత్రి నిర్వాహకురాలు మోడెంపూడి రమాజ్యోతి తదితరులు హాజరయ్యారు. మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. హైదరాబాద్‌లో 11 ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఉప్పల్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్, మెహిదీపట్నంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ విజేతలకు బహుమతులు అందజేశారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, అమీర్‌పేట, చిక్కడపల్లి , అబిడ్స్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, తార్నాక, చార్మినార్, మెహిదీపట్నం, మల్కాజిగిరి కేంద్రాల్లో జరిగిన పోటీల్లో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


ములుగు జిల్లా కేంద్రంలో ముగ్గు వేసి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ధనసరి సీతక్క

ఆర్టీసీలో 828 కారుణ్య నియామకాలు

- 813 కండక్టర్, 15 డ్రైవర్ పోస్టుల భర్తీ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఐదేళ్ల తర్వాత టీఎస్ ఆర్టీసీ కారుణ్య నియామకాలకు సిద్ధమైంది. కారుణ్య నియామకాల్లో భాగంగా మూడేళ్ల పాటు కన్సాలిడేటెడ్ పే (కనీస స్థిర వేతనం) ప్రాతిపదికన 828 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో 813 కండక్టర్, 15 డ్రైవర్ పోస్టులు ఉన్నాయి. కన్సాలిడేటెడ్ పే కింద నియమితులయ్యే కండక్టర్లకు మూడేళ్ల పాటు నెలకు రూ.17వేలు, డ్రైవర్లకు రూ.19 వేలు చొప్పున వేతనం చెల్లిస్తారు. అనారోగ్య కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేసిన, విధి నిర్వహణలో మరణించిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబంలోని ఒకరికి వారి విద్యార్హతకు అనుగుణంగా కారుణ్య నియామకం ద్వారా ఆర్టీసీలో ఉద్యోగం ఇస్తారు. పెరుగుతున్న డీజిల్ ధరలు, కరోనా తదితర పరిస్థితుల నేపథ్యంలో ఐదేళ్లుగా కారుణ్య నియామకాలు జరగలేదు. కారుణ్య నియామకం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1500కు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఎంపిక చేసిన సుమారు 200 మందికి ఇప్పటికే శిక్షణ కూడా ఇచ్చారు. కానీ నియామకం చేపట్టలేదు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికీ తక్షణమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఆదేశించారు. కారుణ్య నియామకం కింద హైదరాబాద్ రీజియన్ నుంచి 66 మంది, సికింద్రాబాద్ నుంచి 126, రంగారెడ్డి నుంచి 52, నల్లగొండ నుంచి 56, మహబూబ్‌నగర్ నుంచి 83, మెదక్ నుంచి 93, వరంగల్ నుంచి 99, ఖమ్మం నుంచి 53, ఆదిలాబాద్ నుంచి 71, నిజామాబాద్ నుంచి 69, కరీంనగర్ నుంచి 45మందిని కండక్టర్లుగా నియమించేందుకు చర్యలు చేపట్టాలని ఎండీ సజ్జనార్ ఆయా రీజనల్ మేనేజర్లను ఆదేశించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకుంటారని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. కాగా, కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రోడ్డుకు మోకాలడ్డు

(మొదటి పేజీ తరువాయి)

ఊతం వస్తుందని, ఆదాయం పెరుగుతుందని భావించిన కేంద్రం.. భారత్‌మాల పథకానికి శ్రీకారం చుట్టింది. పలు రాష్ట్రాల మీదుగా జాతీయ రహదారులను నిర్మించేందుకు కావాల్సిన నిధులను బడ్జెట్‌లో కేటాయించింది. ఇందులో ఒకటి.. నాగపూర్-విజయవాడ మార్గం. ఎన్‌హెచ్163జి అని పేరుపెట్టిన ఈ రోడ్డు తెలంగాణలో ఇది మంచిర్యాల జిల్లాలో మొదలై ఏపీలోని ప్రధాన నగరం విజయవాడ వరకు వెళ్తుంది. 2017-18లో మంజూరు చేసిన ఈ ప్రాజెక్టు 2021తో పూర్తికావాల్సి ఉంది.

3 జిల్లాలు, 9 ప్యాకేజీలు

భారత్‌మాల ప్రాజెక్టు-1 కింద మంచిర్యాల జిల్లా నుంచి వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా విజయవాడ వరకు మొత్తం 310 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని 9 ప్యాకేజీలుగా విభజించారు. దాదాపు 4 వేల ఎకరాల భూమి అవసరమని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) తేల్చింది. 2017-18లోనే కేంద్రం రూ.10 వేల కోట్లు కేటాయించింది. 'మీరు భూమి ఇవ్వండి.. మేం రోడ్డు నిర్మిస్తాం' అని కోరినా గత సర్కారు పెడచెవిన పెట్టింది. నిబంధనల ప్రకారం జాతీయ రహదారి మంజూరుకు ముందే నిర్మాణానికి అవసరమైన భూమిలో 80 శాతం మేర ఎన్‌హెచ్‌ఏఐకు అప్పగించాలి. దీనికి ఒప్పుకొన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం ఆమడదూరంలో ఉండిపోయింది. ఫలితంగా భూ సేకరణ ఇంకా కొలిక్కిరాలేదు. రాష్ట్ర ప్రభుత్వం రూపాయి పెట్టాల్సిన పనిలేకుండా అవసరమైన భూమిని అప్పగిస్తే.. నష్ట పరిహారం నుంచి రోడ్డు నిర్మాణం వరకు జాతీయ రహదారుల విభాగమే భరించనుంది. కాగా, ఈ జాతీయ రహదారి ఒక ప్యాకేజీ అలైన్‌మెంట్ విషయంలో రాజకీయ ఒత్తిళ్లు రావడంతో రద్దు వరకు వెళ్లింది. కేంద్రం జోక్యం చేసుకుని నిధులు సమకూర్చింది. కానీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఉదాసీనతతో ఇప్పటికీ పనులు ప్రారంభంకాలేదు. వాస్తవానికి సాంకేతిక పనులను జాతీయ రహదారుల విభాగం శరవేగంగా చేసేసింది. టెండర్లు, గుత్తేదారుల ఎంపిక సహా అన్ని పనులూ పూర్తయ్యాయి. 9 ప్యాకేజీల్లో కొన్నింటికీ అగ్రిమెంట్లు కూడా సిద్ధంగా ఉన్నాయి. కానీ గత సర్కారు సమయానికి భూ సేకరణ పూర్తి చేయకపోవడంతో ఒప్పందాలు నిలిచిపోయాయి..

నత్తనడకన.. భూ సేకరణ

ఎన్‌హెచ్ 163జీ రోడ్డు మంచిర్యాల జిల్లాలో 108, వరంగల్ జిల్లాలో 108, ఖమ్మం జిల్లాలో 90 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుంది. అయితే, 4 వేల ఎకరాలకు గాను 2 వేల ఎకరాల మేర మాత్రమే భూ సేకరణ చేసినట్టు తెలుస్తోంది. మంచిర్యాల జిల్లాలో మొత్తం 1,400 ఎకరాలకు అతి తక్కువగా సేకరించినట్లుగా తెలుస్తోంది. వరంగల్ జిల్లాలో కొంత సేకరణ జరిగినా.. అక్కడ పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ఖమ్మం జిల్లాలో నాయకుల అనుయాయుల భూములు ఉండడంతో పాటు, మార్కెట్ ధర అధికంగా ఉండడంతో అలైన్‌మెంట్‌నే మార్చాలనే డిమాండ్లు వచ్చాయి. ఫలితంగా అడుగులు ముందుకుపడలేదు.

ఆలస్యానికి కారణమేంటో చెప్పలేదు..

జాతీయ రహదారులను మంజూరు చేయమంటూ పలు రాష్ట్రాలు కేంద్రాన్ని పదేపదే కోరుతున్నాయి. తెలంగాణ అలా కోరాల్సిన అవసరం లేకుండానే కేటాయించినా, బీఆర్‌ఎస్ హయాంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. భూమిని ఎందుకు సేకరించలేకపోయాం, అందులో తలెత్తిన సమస్యలేమిటి? అని జాతీయ రహదారుల విభాగానికి గానీ, కేంద్రానికి గానీ చెప్పలేదు. భూ సేకరణలో సమస్యలుంటే కేంద్రానికి తెలపాలి. నగరాలు, పట్టణాల సమీపంలో భూముల ధరల రీత్యా పరిహారం చెల్లింపులో చిక్కులు ఏర్పడ్డాయి. వీటిపై ఎన్‌హెచ్‌ఏఐ, కేంద్రంతో మాట్లాడితే పరిష్కారం లభించేది. కానీ, ఆ పని చేయలేదు. సొంతంగానూ పరిష్కరించలేదు.

రాజకీయ విభేదాలే కారణమా?

కేంద్రం.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మధ్య సత్సంబంధాలు లేకపోవడం మంచిర్యాల-విజయవాడ రోడ్డు నిర్మాణంపై తీవ్ర ప్రభావం చూపిందన్న విమర్శలున్నాయి. సంప్రదించేందుకు ఇష్టంలేకనే కేంద్రానికి విషయాలను చెప్పలేదనే వాదన ఉంది. అయితే, రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు మంచిర్యాల-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రహదారి పూర్తయితే మంచిర్యాల, వరంగల్, ఖమ్మం జిల్లాల ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుంది. ఇతర రాష్ట్రాలతోనూ అనుసంధానత ఏర్పడి వ్యాపారాలు పుంజుకునే అవకాశాలున్నాయి.

వైభవంగా కొమురెల్లి మల్లన్న కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ
- సమన్వయలోపంతో కొండా సురేఖ కాన్వాయ్ మిస్



పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రి కొండా సురేఖ, మల్లన్న కల్యాణ దృశ్యం

చేర్యాల, జనవరి 7: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. మార్గశిరమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయతోటబావి ప్రాంగణంలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన ప్రత్యేక మండపంలో మేడలాదేవీ, కేతలమ్మను మల్లన్న వివాహమాడారు. ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో ఉజ్జయిని సద్ధర్మ సింహాసనాధీశ్వర వీరశైవ పీఠాధిపతి సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య మహాస్వామి పర్యవేక్షణలో వీరశైవ ఆగమ పండితులు కల్యాణాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు, జిల్లా, మండల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణవేదికపైకి ఎగబడి తోసుకువచ్చారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది. కాగా, షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.45కు కల్యాణం జరగాల్సి ఉండగా.. మంత్రులు ఆలస్యంగా రావడం వల్ల కార్యక్రమంలో సుమారు గంటన్నరపాటు ఆలస్యమేర్పడింది. మరోవైపు పోలీసులు, భద్రత అధికారుల మధ్య సమన్వయ లోపంతో మంత్రి కొండా సురేఖ కాన్వాయ్ మిస్సయింది. మల్లన్న కల్యాణం జరిగాక ఆమె గెస్ట్‌హౌస్‌కు వెళ్లేందుకు బయటకు వచ్చారు. అక్కడ తన కాన్వాయ్ కనిపించకపోవడంతో పోలీసులపై అసహనం వ్యక్తం చేశారు. దాంతో ఆమె తన కూతురు సుస్మిత కారులో బయలుదేరారు. కాగా, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాలని, సుభిక్ష పాలనకు శక్తిని ప్రసాదించాలని మల్లన్నను వేడుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

అమ్మవార్లకు కిరీటాలు సమర్పిస్తా: కొండా సురేఖ

వచ్చే కల్యాణానికి మేడలమ్మ, కేతలమ్మ అమ్మవార్లకు బంగారు కిరీటాలు చేయిస్తామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ మేరకు దేవాదాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశానన్నారు. వచ్చే మేడారం జాతర విజయవంతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

సోనియాను ఏకగ్రీవంగా గెలిపించి రుణం తీర్చుకుందాం

రాజకీయ పార్టీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిపాదన

కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌ను కేంద్రమే కాపాడుతుందని ఆరోపణ

మిషన్ భగరీథ అవకతవకలపై త్వరలో నివేదిక ఇస్తామని వెల్లడి



వైరా, జనవరి 7: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని రాష్ట్రం నుంచి ఏకగ్రీవంగా గెలిపించుకుని రుణం తీర్చుకుందామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. తెలంగాణ అంటే ప్రేమ ఉన్న రాజకీయ పార్టీలన్నీ ఇందుకు సహకరించాలని కోరారు. బీఆర్‌ఎస్‌తో బీజేపీ కుమ్మక్కవ్వడం వల్లే కాళేశ్వరంఅవినీతి అంశంలో కేంద్రం కేసీఆర్‌ను కాపాడుతుందని ఆరోపించారు. మిషన్ భగీరథలో జరిగిన అవకతవకలపై త్వరలో నివేదిక వెల్లడిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆయన స్వగ్రామం, ఖమ్మం జిల్లా స్నానాల లక్ష్మీపురానికి ఆదివారం విచ్చేసిన భట్టి విలేకరులతో మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని సోనియా గాంధీని కోరామని తెలిపారు. సోనియాపై పోటీ పెట్టకుండా ఏకగ్రీవంగా గెలిపించుకుందాని రాజకీయ పార్టీలను కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్‌ఎస్‌కు ఏటీఎంగా మారిందన్న ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో చిన్నాభిన్నమైన పాలన వ్యవస్థను గాడిలో పెట్టి జవాబుదారీతనం తీసుకువస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు నెల మొదటి వారంలోనే వేతనాలు ఇచ్చేలా ఆర్థిక స్థితిని మెరుగుపరిచామని అన్నారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ చీకటి జీవోను రద్దు చేయాలి

- జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం

పంజాగుట్ట, జనవరి7 (ఆంధ్రజ్యోతి): జీవో 317ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి 'జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం' విజ్ఞప్తి చేసింది. ఆ చీకటి జీవో వచ్చి రెండేళ్లు అవుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. జీవో 317 జనవరి 7న అమల్లోకి వచ్చి రెండేళ్లు గడిచిన సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు దుర్దినంగా భావిస్తూ ఆదివారం సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిరసన సమావేశం ఏర్పాటు చేశారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, ఇతర నేతలతో కలిసి విజయ్‌కుమార్ మాట్లాడారు. త్వరలో సీఎంను కలసి చర్చించబోతున్నామని తెలిపారు.

సకాలంలో వైద్యం అందక నిండు గర్భిణి మృతి

గజ్వేల్, జనవరి7: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులలేమీ కారణంగా సకాలంలో వైద్యం అందక నిండు గర్భిణీ మృతి చెందిన ఘటన సిద్దిపేట జిల్లాలో చోటు చేసుకుంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్‌కు చెందిన గర్భిణి రంగ భవానీని ఆదివారం ఉదయం కుటుంబీకులు గజ్వేల్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. గజ్వేల్‌లో వెంటిలేటర్ లేదని, హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. గాంధీ ఆస్పత్రిలో భవానీని పరిశీలించిన వైద్యులు డెలివరీ చేస్తే తల్లీబిడ్డకు ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని, అయినా సర్జరీ తప్పనిసరన్నారు. కుటుంబసభ్యులు అంగీకరించడంతో సర్జరీ చేయగా జన్మించిన శిశువు విగత జీవిగా ఉండడంతోపాటు తల్లి మృతి చెందింది.

మా బాబును ఆదుకోరూ..

- లివర్ సమస్యతో ఆస్పత్రిలో..చికిత్సకు 44 లక్షల ఖర్చు
- దాతల సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



కోనరావుపేట, జనవరి 7: ఆడుతూ పాడుతూ తిరిగే ఎనిమిదేళ్ల కొడుకు అనారోగ్యం పాలవడంతో ఆ తల్లిదండ్రులు విలవిల్లాడుతున్నారు. అతని చికిత్స కోసం భారీ మొత్తం ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పులిసె చందు, పల్లవి దంపతుల కొడుకు నిహాల్ లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన చందు.. కొడుకు అనారోగ్యం విషయం తెలిసి తిరిగి వచ్చాడు. నిహాల్‌ను హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. లివర్ మార్పిడి చేయాలని, ఇందుకు రూ.44 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు తమ ఎస్‌బీఐ ఖాతా నంబరు 35934585160 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0012903)కు లేదా బంధువు శివ జీపే/ఫోన్‌పే నంబరు 9000602038కు సహాయాన్ని పంపి తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

'అభయ హస్తం'కు శివుడి పేరిట దరఖాస్తు

- ఉద్దేశపూర్వకంగా ఇవ్వలేదంటున్న దరఖాస్తుదారు


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
అభయహస్తం

భీమదేవరపల్లి, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వ నిర్వహించిన ప్రజాపాలనలో అభయహస్తానికి ఓ వ్యక్తి శివుడి పేరిట దరఖాస్తు చేశాడు. దానికి అధికారులు రశీదు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామానికి చెందిన ఏనుగు వెంకట సురేందర్‌రెడ్డి అనే వ్యక్తి దరఖాస్తుదారుడి పేరు శివుడు, భార్య పేరు పార్వతీదేవీ, కుమారుల పేర్లు కుమారస్వామి, వినాయకుడు అని రాసి.. గృహలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కరెంటు బిల్లు.. పథకాల కోసం దరఖాస్తు చేశాడు. దరఖాస్తులో శివుడి ఫొటో సైతం అంటించి, సంబంధిత అధికారికి సమర్పించాడు. అధికారులు దరఖాస్తు తీసుకున్నట్లు అతడికి రశీదు కూడా ఇచ్చారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసే క్రమంలో ఈ విషయం వెల్లడయింది. శివుడి పేరిట దరఖాస్తు సమర్పించిన సురేందర్ రెడ్డి గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. దరఖాస్తు విషయం చర్చనీయాంశంగా మారడంతో తప్పును ఒప్పుకుంటూ ఎంపీడీవోకు సురేందర్ వినతి పత్రాన్ని అందజేశాడు. "గ్రామంలోని శివాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రజాపాలన గ్రామసభలో ఆలయ అభివృద్ధికి ఏమైన ప్రత్యేక నిధులు కేటాయిస్తారేమో అన్న ఉద్దేశంతో దరఖాస్తు చేశాను. అధికారులు, ప్రభుత్వంపై తప్పుడు ఉద్దేశంతో దరఖాస్తు చేయలేదు" అని తెలియజేశాడు.

వర్సిటీల్లో ఖాళీలెన్ని.. వాటి భర్తీ ఎలా?

- సమగ్ర నివేదిక సమర్పించండి
- వర్సిటీల అధికారులను ఆదేశించిన సర్కారు

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో ఉన్న ఖాళీలెన్ని.. వాటి భర్తీకి తీసుకోవాల్సిన చర్యలేంటి.. అన్నదానిపై సమగ్ర నివేదికను సమర్పించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా యూనివర్సిటీల్లో అధికారులు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీల వివరాలపై అధ్యయనం చేస్తున్నారు. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల లాంటి 2,825 టీచింగ్ పోస్టులు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 848 మంది మాత్రమే పనిచేస్తున్నారు. నాన్ టీచింగ్ పోస్టులు కూడా చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒక్కసారి కూడా యూనివర్సిటీల్లోని పోస్టులను భర్తీ చేయలేదు. 1,061 ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి 2017లో జీవో నంబరు-34ను జారీ చేశారు. కానీ అది ఆచరణలోకి రాలేదు. యూనివర్సిటీల్లోని ఖాళీలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తెచ్చి, భర్తీ చేయడానికి వీలుగా నియామక బోర్డును ఏర్పాటు చేస్తూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించారు. ఈ బిల్లును గవర్నర్ ఆమోదించలేదు. పరిశీలన కోసం రాష్ట్రపతికి పంపించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది.

గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వం యూనివర్సిటీల అభివృద్ధి, ఖాళీల నియామకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్న విమర్శలున్న విషయం తెలిసిందే. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు మౌలిక వసతులు లేవని ఆందోళనలు కూడా జరిగాయి. భోజనం విషయంలోనూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. కానీ బాధ్యులపై గత ప్రభుత్వం చర్యల్ని తీసుకోలేదు. ఇప్పటికే అదే భోజన కాంట్రాక్టర్లు కొనసాగుతున్నారు. దీంతో, యూనివర్సిటీల అభివృద్ధి కోసం, ఖాళీల భర్తీ కోసం చర్యలను ప్రారంభించాలని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తున్నది.

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో టీచింగ్ పోస్టులు, ఖాళీల వివరాలు

యూనివర్సిటీ	టీచింగ్ పోస్టులు	ఖాళీల సంఖ్య
ఉస్మానియా	1267	891
కాకతీయ	409	323
జేఎన్‌టీయూహెచ్	410	241
అంబేడ్కర్	86	52
తెలంగాణ	152	91
మహాత్మాగాంధీ	70	35
పాలమూరు	95	74
శాతవాహన	63	47
జేఎన్ఏఎఫ్ఏయూ	55	38
పొట్టి శ్రీరాములు	72	58
ట్రిపుల్ ఐటీ	146	127
మొత్తం	2,825	1,977

జిహాదీల కనుగుడ్లు పీకి ఆటాడుకుంటాం

» షోలాపూర్ ర్యాలీలో రాజాసింగ్.. కేసు నమోదు



ముంబై, జనవరి 7: లవ్ జిహాదీలు, గో హంతకులపై మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే.. తామే చర్యలు తీసుకుంటామని, వారి కనుగుడ్లు పీకి ఆటాడు కుంటామని షోలాపూర్‌లో జరిగిన ఓ ర్యాలీలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు గోషా మహల్ బీజేపీ ఎమ్మెల్యే టి. రాజాసింగ్, మరో బీజేపీ ఎమ్మెల్యే నితేశ్ రాణెపై మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. షోలాపూర్‌లో నిర్వహించిన జన్ ఆక్రోశ్ ర్యాలీలో వీరు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినందుకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. షోలాపూర్‌లోని రాజేంద్ర చౌక్.. కన్నా చౌక్‌ల మధ్య శనివారం ర్యాలీ నిర్వహించారు. దీనికి సకల హిందూ సమాజం నాయకులు కూడా హాజరయ్యారు. దీంతో ఆ సమాజం ఆఫీసు బేరర్ల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసినట్లు షోలాపూర్ జైలురోడ్డు పోలీసుస్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. జిహాదీలు, మసీదుల కూల్చివేతపై రాణె ప్రస్తావించగా.. రాజాసింగ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం లవ్ జిహాద్ పేరుతో మన అక్కచెల్లెళ్లు, కూతుళ్లపై అత్యాచారాలు జరగడం లేదా? వాళ్లను పిల్లల్ని కనే యంత్రాలుగా మార్చడం లేదా...? లవ్ జిహాదీలు, గోహంతకులపై మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్య తీసుకోకపోతే, వారికి మేమే గుణపాఠం చెబుతాం. జిహాదీల కనుగుడ్లు పీకి, వాటితో ఆటాడుకుంటాం" అన్నారు.

భారతీయ ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలి!

» జైప్రకాశ్ వర్సిటీ ప్రొఫెసర్ లేఖ.. ఏబీవీపీ ఆందోళన

న్యూఢిల్లీ, జనవరి 7: "భారతీయ ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలి. అది కూడా పాకిస్థాన్-బంగ్లాదేశ్‌ల వెంబడే ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేస్తూ బిహార్‌లోని ఛాప్రాలో ఉన్న జైప్రకాశ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖుర్షీద్ ఆలమ్ అలియాస్ లాల్ బాబు పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రభుత్వాలకు రాసిన లేఖ తీవ్ర వివాదానికి దారితీసింది. భారతీయ ముస్లింలు ప్రత్యేక దేశం కోరుకుంటున్నారంటూ లాల్ బాబు ఈ నెల 2న లేఖ రాశారు. అనంతరం దీనిని ఫేస్‌బుక్‌లోనూ ఆయన పోస్టు చేశారు. దీంతో పాటు హిందూ జాతీయులు రెండు దేశాల సిద్ధాంతాన్ని సమర్థిస్తున్నారని, ఈ నేపథ్యంలో మతపరమైన ప్రశ్నలకు తొలుత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ పోస్టులపై బీజేపీ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీ తీవ్రంగా స్పందించింది. నిరసనలకు పిలుపునిచ్చింది. లాల్ బాబును ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. మరోవైపు, వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని లాల్ బాబుకు యూనివర్సిటీ వర్గాలు షోకాజ్ నోటీసులు జారీ చేశాయి.

లోక్‌సభ ప్రచారానికి 13న మోదీ శ్రీకారం

న్యూఢిల్లీ, జనవరి 7: రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఈ నెల 13న ప్రధాని మోదీ బిహార్‌లో శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. పశ్చిమ చంపారన్ జిల్లా ముఖ్యపట్టణమైన బెతియాలోని రమణ్ మైదాన్‌లో నిర్వహించే బహిరంగ సభ ద్వారా ప్రచారాన్ని ప్రారంభిస్తారని ఆదివారం బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా పలు రోడ్లు, వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నాయి. బిహార్‌లోని మొత్తం 40 లోక్‌సభ స్థానాలను దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ..అగ్రనాయకులతో ప్రచార సభలు నిర్వహించనుంది. ప్రధాని మోదీ బెతియాతో పాటు బెగుసరాయి, ఔరంగాబాద్‌ల్లోనూ జరిగే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఈ నెల 15 తరువాత ప్రచారంలో పాల్గొంటారు. సీఎం నీతీశ్ కుమార్ నేతృత్వంలో బిహార్‌లోని ఇతర పార్టీలు కూటమిగా ఏర్పడడంతో వాటిని ఎదుర్కోవడానికి బీజేపీ అప్పుడే పావులు కదుపుతోంది.

జోడో న్యాయ యాత్రకు తరలిరండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 7: మణిపూర్‌లో ఈనెల 14 నుంచి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో చేపట్టే 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో ప్రజలు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాల్సిందిగా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ప్రతి భారతీయుడికి ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడమే లక్ష్యంగా రాహుల్ ఈ యాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. 'ప్రతి భారతీయుడికి అన్ని విషయాల్లో న్యాయం జరగాలన్న రాజ్యాంగ వాగ్దానాన్ని అందజేయాలనే నిబద్ధతను పటిష్ఠ పరిచేందుకే ఈ యాత్ర' అని ఆయన 'ఎక్స్'లో ఆదివారం పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు చేపడుతున్న ఈ యాత్ర 66 రోజులు సాగనుంది. మార్చి 20 లేదా 21న ముంబైలో ముగియనుంది. మొత్తం 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 6,713 కిలోమీటర్ల మేర యాత్ర సాగనుంది.

డాటాను వాడండి..దండాన్ని కాదు

» డీజీపీల సమావేశంలో ప్రధాని మోదీ

జైపూర్, జనవరి 7: పోలీసులు సమాచారాన్ని(డాటా) ఉపయోగించి పనిచేయాలే తప్ప దండాన్ని ఉపయోగించి కాదని ప్రధాని మోదీ హితవు చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకునే నూతనంగా మూడు 'సంహిత'లను తీసుకొచ్చినట్టు తెలిపారు. 'పౌరులు ప్రథమం..గౌరవం ప్రథమం..న్యాయం ప్రథమం' అన్న సందేశంతో వీటిని రూపొందించినట్టు చెప్పారు. ఆదివారం ఇక్కడ జరిగిన 58వ డీజీపీలు, ఐజీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. నూతన క్రిమినల్ చట్టాల ప్రాధాన్యతను వివరించారు. డాటా ఆధారంగా దర్యాప్తులు ఉండాలని చెప్పారు. దేశ క్రిమినల్ న్యాయ వ్యవస్థలో అవి నిర్ణయాత్మక మార్పులు తీసుకొస్తాయని చెప్పారు. మహిళల భద్రతపై దృష్టి కేంద్రీకరించాలని, వారు ఎప్పుడైనా, ఎక్కడైనా నిర్భయంగా పనిచేసేలా పరిస్థితులు కల్పించాలని కోరారు. మహిళలు, బాలికలకు వారి హక్కులపై అవగాహన కలిగించాలని, కొత్త చట్టాల ద్వారా వారికి కలిగే రక్షణను వివరించాలని సూచించారు.

7 కోట్ల డిజిటల్ ఫైళ్లను వడపోసి..

హమాస్ కమాండర్ డయఫ్ ఫొటో వెలికితీత



జెరూసలేం, జనవరి 7: గాజాలో స్వాధీనం చేసుకున్న ఏడు కోట్ల డిజిటల్ ఫైళ్లను వడపోసి హమాస్‌కు చెందిన కీలక కమాండర్ మహమ్మద్ డయఫ్ ఫొటోను ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) వెలికితీసింది. ఈ వివరాలను ఐడీఎఫ్ ప్రతినిధి శనివారం సాయంత్రం వెల్లడించారు. గత కొన్నేళ్లుగా బయటి ప్రపంచానికి కనిపించని డయఫ్ ఫొటోను మొట్టమొదటిసారిగా సంపాదించామని తెలిపారు. ఇజ్రాయెల్ సైన్యం గతంలో జరిపిన దాడుల్లో డయఫ్ ఒక చెయ్యి, ఒక కాలు (లేదా రెండు కాళ్లు) కోల్పోయాడని ఇప్పటి వరకూ భావిస్తూ వచ్చారు. కానీ, తాజా ఫొటోలో రెండు చేతులతో డయఫ్ కనిపించటం విశేషం. అతడితోపాటు మరో వ్యక్తి కూడా ఫొటోలో ఉన్నాడు. వారి వెనుక రెండు జతల బూట్లు ఉన్నాయి. అంటే, డయఫ్.. కాళ్లను కోల్పోలేదని తెలుస్తోంది. అయితే, అతడికి ఒక కన్ను లేదని ఫొటో వెల్లడించింది. కాగా, వారం కిందట డయఫ్ పేరిట మరో ఫొటో కూడా ఇజ్రాయెల్ మీడియాలో కనిపించింది. ఇజ్రాయెల్ మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదుల్లో డయఫ్ ఒకడు. 1990ల నుంచి ఇజ్రాయెల్‌పై ఆయన అనేక దాడులు జరిపాడు. ఇటీవల హమాస్ నిర్వహించిన మెరుపుదాడిలో కీలక పాత్ర పోషించాడు. ఇజ్రాయెల్ 2014లో జరిపిన డ్రోన్ దాడిలో డయఫ్ భార్య కుమారుడు, కుమార్తె మరణించారు. డయఫ్ మీద ఇజ్రాయెల్ అనేకసార్లు గురిపెట్టినా ఆయన తప్పించుకున్నాడు.

కార్గిల్ కొండల్లో రాత్రివేళ ల్యాండింగ్

» తొలిసారి సీ-130జే విమానాన్ని దింపిన వాయుసేన



న్యూఢిల్లీ, జనవరి 7: కార్గిల్ పర్వతాల్లోని ఎయిర్‌స్ట్రిప్‌పై తొలిసారిగా భారీ రవాణా విమానం సీ-130జేను భారత వాయుసేన రాత్రివేళ సురక్షితంగా దించింది. ఈ విషయాన్ని ఐఏఎఫ్ ఆదివారం వెల్లడించింది. గరుడ్ కమాండోల శిక్షణలో భాగంగా ఈ విన్యాసం చేసినట్టు పేర్కొంది. ఒక రవాణా విమానం ఇలా కార్గిల్ కొండల్లో రాత్రివేళ ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్ సముద్ర మట్టానికి దాదాపు 10,500 అడుగుల ఎత్తులో ఉంది.

మనోళ్లే చంపేస్తున్నారా?

భారతదేశ శత్రువులను విదేశాల్లో హత్య చేస్తున్న 'గుర్తు తెలియని వ్యక్తులు'

» 'టార్గెట్ కిల్లింగ్స్' ఆరోపణలను కొట్టిపారేసిన భారత ప్రభుత్వం



పట్టపగలు నడిరోడ్డుపై.. మసీదులో ప్రార్థనలు చేసేటప్పుడు.. షాపింగ్ చేసి దుకాణంలోంచి బయటకు వస్తున్నప్పుడు.. ఇక్కడా అక్కడా అనే తేడా లేదు! ఎక్కడైనా సరే.. ఎప్పుడైనా సరే.. ఎటు నుంచి వస్తారో తెలియదు.. వస్తారు! వీలైతే పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చిచంపేస్తారు. వీలు కుదరకపోతే.. దూరం నుంచే కాల్పులు జరిపేసి పారిపోతారు!! భారతదేశంపై ఉగ్రదాడులు జరిపిన సూత్రధారులు, మాస్టర్‌మైండ్స్, ఆ దాడుల్లో పాత్రధారులను పాక్ గడ్డపైనే గుర్తుతెలియని వ్యక్తులు ఇలా దారుణంగా చంపేస్తున్నారు. పాక్‌లో ఇటీవల జరిగిన మసూద్ ఉర్ రెహమాన్ ఉస్మానీ హత్య ఇందుకు తాజా ఉదాహరణ. ఒక్క పాక్‌లోనే కాదు.. కెనడా, యూకే, నేపాల్‌లోనూ ఇలాంటి హత్యలు జరగడం గమనార్హం. గుర్తుందా.. కెనడాలో తలదాచుకుంటున్న ఖలిస్తానీ ఉగ్రవాది, నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ వ్యవస్థాపకుడు.. ఇండియా మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న హర్‌దీప్ సింగ్ నిజ్జర్ ఇలాగే గత ఏడాది జూన్‌లో అగంతుకుల చేతుల్లో చనిపోయాడు. నిజ్జర్ హత్య వెనుక భారత ప్రభుత్వ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించడం అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిజ్జర్ మరణానికి సరిగ్గా మూడు రోజుల ముందు.. నిషేధిత ఖలిస్తాన్ విమోచన దళం చీఫ్ అవతార్ సింగ్ (35) యూకేలోని బర్మింగ్‌హామ్‌లోని ఆస్పత్రిలో అనుమానాస్పద పరిస్థితుల్లో చనిపోయాడు. అవతార్‌సింగ్, నిజ్జర్ మరణాల తర్వాత.. జూన్ 21-23 నడుమ ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించడానికి ముందు అక్కడ ఉన్న ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు భారత్ కుట్ర పన్నిందంటూ 'ద వైర్' ఒక వార్తాకథనాన్ని వెలువరించింది. కానీ, అమెరికాలో పన్నూ హత్యకు ఒప్పుకొన్న హంతకుడి ముసుగులో ఉన్నది అమెరికా గూఢచారి కావడంతో భారత్ ప్లాన్ దెబ్బతిందని అమెరికా ప్రభుత్వ డాక్యుమెంట్‌లో ఉన్నట్టు తన కథనంలో వివరించింది. కెనడా, యూకేల్లోనే కాదు.. అంతకు ముందు మే (2023) నెలలో పాకిస్థాన్‌లోనూ ఓ ఖలిస్తానీ ఉగ్రవాది పరంజిత్ సింగ్ పంజ్వార్‌ను దుండగులు కాల్చిచంపేశారు.

పాక్‌లో వరుసహత్యలు..

1999లో నేపాల్ రాజధాని కాఠ్మండూ నుంచి బయల్దేరిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ814ను హైజాక్ చేసి కాందహార్‌కు మళ్లించి.. మౌలానా మసూద్ అజర్ సహా ముగ్గురు ఉగ్రవాదులను విడిపించుకుపోయిన హైజాకర్లలో ఒకడైన జహూర్ మిస్త్రీ 2022 మార్చిలో కరాచీ నడిబొడ్డున గుర్తుతెలియని వ్యక్తి కాల్చిన తూటా దెబ్బకు ప్రాణాలు విడిచాడు. 1985లో ఎయిరిండియా విమానాన్ని పేల్చేసిన కుట్రదారుల్లో ఒకడైన రిపుదామన్ సింగ్ మాలిక్‌ను 2022 జూలైలో ఇలాగే గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపేశారు. అలాగే.. హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బషీర్ అహ్మద్ పీర్ రావల్పిండిలో.. అల్ బద్ర్ ఉగ్రవాద సంస్థ కమాండర్ అయిన సయ్యద్ ఖాలిద్ రజా కరాచీలో.. గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో చనిపోయారు. జమ్ముకశ్మీర్‌లో 2016లో ఎనిమిది మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టనబెట్టుకున్న లష్కరే తాయిబా టాప్ కమాండర్ అద్నాన్ అహ్మద్ అలియాస్ అబు హంజాలానైతే.. పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేసిన రెండంచెల భద్రత వలయాన్ని ఛేదించి మరీ ఒళ్లంతా తూటాలు దింపి మరీ చంపారు. 2008లో ముంబైలో జరిగిన ఉగ్రదాడి గుర్తుందా? ఆ దారుణ మారణకాండ వెనుక మాస్టర్‌మైండ్, జైషే మహ్మద్ చీఫ్ హఫీజ్ సయీద్ ఇంటి వద్ద 2021 జూన్ 23న ఆత్మాహుతి బాంబుదాడి జరిగింది. అయితే, ఆ దాడిలో అతడికి ఏమీ కాలేదు. ఈ దాడి వెనుక భారతదేశమే ఉందని అప్పట్లో పాకిస్థాన్ ఆరోపించింది. హఫీజ్ సయీద్ అనుచరులైన షాహిద్ లతీఫ్‌ను, అతడి సోదరుణ్ని గత అక్టోబరులో సియాల్‌కోట్‌లోని ఓ మసీదులో గుర్తుతెలియని దుండగులు కాల్చిచంపేశారు. ఈ షాహిద్ లతీఫ్ 2016లో పఠాన్‌కోట్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌పై దాడి వెనుక మాస్టర్ మైండ్. లష్కరే హైర్యాంకింగ్ కమాండర్లలో ఒకడైన రియాజ్ అహ్మద్‌ను గత సెప్టెంబరులో మసీదులో ప్రార్థన చేసే సమయంలో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో సాయుధ దుండగులు కాల్చిచంపేశారు. పాక్‌లోనే కాదు.. నేపాల్‌లోనూ ఇలాంటి హత్య ఒకటి జరిగింది. కానీ, అక్కడా చనిపోయింది మాత్రం.. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఏజెంట్ లాల్ మొహమ్మద్ అలియాస్ మొహమ్మద్ దర్జీ. ఐఎస్ఐ తయారు చేసే నకిలీ నోట్లను పెద్ద ఎత్తున భారతదేశంలోకి ప్రవేశపెట్టే లాల్ మొహమ్మద్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపేశారు. ఇక.. మసూద్ అజర్ బాంబు పేలుడులో చనిపోయాడంటూ కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది గానీ.. అది నిజం కాదు. అలాగే.. ఇండియాస్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం ఇటీవలే విషాహారం కారణంగా ఆస్పత్రిపాలయ్యాడని.. అతడి పరిస్థితి విషమంగా ఉందని కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది కానీ, అందులో నిజమెంతో తెలియదు.

- సెంట్రల్ డెస్క్

భారత్ పంపదు.. కానీ..

విదేశాల్లో భారత వ్యతిరేకులు, మన శత్రువుల హత్యలు ఇంత విస్తృతంగా జరుగుతున్నా.. భారత ప్రభుత్వ ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వచ్చిన కేసులు మాత్రం మూడే. ఒకటి నిజ్జర్ కేసు. రెండోది పన్నూ కేసు. మూడోది.. మసూద్ అజర్ ఇంటివద్ద జరిగిన ఆత్మాహుతి బాంబుదాడి కేసు. అయితే భారత ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను కొట్టిపారేసింది. నిజానికి.. విదేశీగడ్డపై ఈ తరహా 'టార్గెట్ కిల్లింగ్ ఆపరేషన్'లు నిర్వహించి తమ దేశవ్యతిరేకులను, శత్రువులను, ఉగ్రవాదులను మట్టుబెట్టడం అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ వంటి దేశాలకు అలవాటే. మరీ ముఖ్యంగా.. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్ చేపట్టిన ఇలాంటి ఆపరేషన్ల ఆధారంగా కనీసం 10 హాలీవుడ్ సినిమాలు వచ్చాయంటే వారు తమ దేశానికి, పౌరులకు హాని కలిగించే ఉగ్రవాదులు, తీవ్రవాదుల పట్ల ఎంత కఠినంగా వ్యవహరిస్తారో అర్థం చేసుకోవచ్చు. ఇటీవలికాలంలో భారత్ వ్యతిరేకులు కూడా ఇలాగే వరుసగా హతమారిపోతున్న నేపథ్యంలో మన 'రా'పై కూడా చాలా మందికి అలాంటి అనుమానాలు వస్తున్నాయి. 'రా'లో చాలాకాలం పనిచేసిన ఒక అధికారిని దీనిపై ప్రశ్నించగా.. "భారత వ్యతిరేక ఉగ్రవాదులను చంపడం కోసం భారతదేశం ఎలాంటి కమాండోలనూ విదేశాలకు పంపదు" అని ఆయన వెల్లడించారు. అయితే, ఆయా దేశాల్లో ఉండి మన పనుపున పనిచేయడానికి చాలా మంది సిద్ధంగా ఉంటారని పేర్కొనడం ద్వారా.. అలాంటివారితో భారతదేశ శత్రువులను 'రా' చంపిస్తుందన్న విషయాన్ని చెప్పకనే చెప్పారాయన. 'రా' మాజీ అధికారి ఆర్కే యాదవ్ కూడా అవతార్ సింగ్ మరణంపై ఇలాగే నర్మగర్భంగా స్పందించారు. అలాంటివి సహజ మరణాలు కాదంటూనే.. అంతకంటే ఎక్కువ తాను మీడియాలో మాట్లాడలేనని వ్యాఖ్యానించారు.

లోకం తీరు



పాక్‌లో మతగురువు

అల్లామా మసూద్ దారుణ హత్య

» ఇస్లామాబాద్ శివారులో పట్టపగలు తుపాకీతో కాల్చి చంపిన దుండగులు



న్యూఢిల్లీ, జనవరి 7: కరడుగట్టిన భారత వ్యతిరేకిగా ముద్రపడిన పాక్ మతగురువు అల్లామా మసూద్ ఉర్ రెహమాన్ ఉస్మానీ దారుణ హత్యకు గురయ్యారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ శివారులోని ఘోరీ టౌన్ పరిసరాల్లో శుక్రవారం పట్టపగలు కొందరు దుండగులు ఆయనను అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చి చంపారు. ఇస్లామాబాద్ పోలీసుల కథనం మేరకు.. ఉస్మానీ లక్ష్యంగా ఇద్దరు దుండగులు తుపాకీతో అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఇదేసమయంలో ఆయన కారు డ్రైవర్‌ను కూడా తీవ్రంగా గాయపరిచి ఘటనా ప్రాంతం నుంచి పరారయ్యారు. ఈ సంచలన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. పాకిస్థానీ మీడియా 'ది నేషన్' కథనం మేరకు.. పోలీసు అధికార ప్రతినిధి తాఖీ జావేద్ ఉస్మానీ హత్య ఘటనను నిర్ధారించారు. ఉస్మానీ మృత దేహాన్ని, తీవ్రంగా గాయపడిన ఆయన డ్రైవర్‌ను పాకిస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలించారు. ఇక, ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు ఏ సంస్థా బాధ్యత ప్రకటించలేదు. కాగా, భారత దేశానికి వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే ఉస్మానీ హత్య మత రాజకీయ కోణంలో పాకిస్థాన్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. దేశంలో కొన్ని వేల మంది హత్యకు కారణమైన ఉగ్రవాద సంస్థ సిపాహ్-ఏ-సహాబాపై పాకిస్థాన్ ప్రభుత్వం నిషేధం విధించిన దరిమిలా.. సున్నీ ఉలేమా కౌన్సిల్ పేరుతో ఒక సంస్థ ఏర్పాటైంది. దీనికి ఉస్మానీ డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో మళ్లీ

ఖలిస్థానీ కలకలం

న్యూఢిల్లీ, జనవరి 7: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో మళ్లీ ఖలిస్తానీ కలకలం రేగింది. ఎన్ఐఏ అమెరికా పర్యటనను వ్యతిరేకిస్తూ గురుపత్వంత్ సింగ్ పన్నూన్ నేతృత్వంలోని నిషేధిత ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థ సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) అక్కడ ఆందోళన చేపట్టింది. షహీద్ సత్వంత్ సింగ్, షహీద్ బియాంత్ సింగ్‌లను ఇందిరా గాంధీ హత్య చేసినట్టు చిత్రీకరించిన పోటోలు పట్టుకుని శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయాన్ని దిగ్బంధించింది. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ద్వారా హింసను ప్రారంభించిన ప్రధాని మోదీ 1984 అక్టోబరు 31వ తేదీని మర్చిపోకూడదని, భారత ప్రభుత్వం చేసిన హింసకు సిక్కులు ఎల్లప్పుడూ ప్రతిస్పందిస్తారని పన్నూన్ పేరిట విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆ సంస్థ తెలిపింది. అయితే.. కొద్ది మంది అనుచరులతో పన్నూన్ లబ్ధిపొందేందుకు, చట్టాన్ని ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నారని నిఘా వర్గాలు తెలిపాయి. విదేశీ ఏజెన్సీల తరఫున పన్నూన్ పనిచేస్తున్నాడని చెప్పాయి. ఏది ఏమైనప్పటికీ భారత కాన్సులేట్‌ను ముట్టడించడం తీవ్రమైన వ్యవహారమని, దీనిపై తమ సహచరులతో చర్చిస్తామని పేర్కొన్నాయి.

గ్లోబల్‌మీట్‌లో తమిళనాడుకు రూ.35 వేల కోట్ల పెట్టుబడులు

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వం రూ.100 కోట్ల వ్యయంతో అట్టహాసంగా నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు 2024లో జియో, గోద్రెజ్, హ్యుండాయ్ సహా పది ప్రముఖ కంపెనీలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సదస్సు ప్రారంభమైన తొలిరోజే రూ.35వేల కోట్లకు పైగా పెట్టుబడుల సమీకరణ జరిగినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా ప్రకటించారు. ఆదివారం ఉదయం చెన్నై నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్‌మీట్‌ను రాష్ట్ర సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఆ సందర్భంగా జియో సంస్థ అధినేత ముఖేష్ అంబానీ సదస్సునుద్దేశించి వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగిస్తూ తమిళనాట జియో సంస్థ రూ.35 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పరిశ్రమలను విస్తరింపజేయనున్నదని తెలిపారు. త్వరలో గ్రీన్ హైడ్రోజన్ గ్యాస్ కర్మాగారాన్ని కూడా ప్రారంభించనుందని తెలిపారు. కొత్త పరిశ్రమల స్థాపనకు తమిళనాడు రాష్ట్రం అనువుగా ఉంటోందని ప్రశంసించారు. ఈ సదస్సులో కొత్త పరిశ్రమలు నెలకొల్పేందుకు, ప్రస్తుతమున్న పరిశ్రమల విస్తరణ కార్యకలాపాలకు హ్యుండాయ్ సంస్థ రూ.6180 కోట్లు, అమెరికాకు చెందిన విన్‌ఫాస్ట్ సోలార్ సంస్థ రూ. 5600 కోట్లు, గోద్రెజ్ సంస్థ రూ.515కోట్లు, టాటా ఎలక్ట్రానిక్స్ రూ.12,082 కోట్లు, , పెకట్రాన్ సంస్థ రూ.1000 కోట్లు, జేఎస్‌డబ్ల్యూ సంస్థ రూ.10,000 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ సదస్సులో కేంద్ర వాణిజ్య పారిశ్రామిక జౌళి శాఖల మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొని దేశ ఆర్థిక పురోగమనంలో తమిళనాడు కీలకపాత్రను పోషిస్తున్నదని ప్రశంసించారు.

మాల్దీవుల మంత్రులపై వేటు



ఇటీవలి లక్షద్వీప్ పర్యటనలో ప్రధాని మోదీ(ఫైల్)

(మొదటి పేజీ తరువాయి)

సేదతీరారు. ఆ తర్వాత స్నార్కెలింగ్ చేశారు. "సాహసాలు చేయాలనుకునేవారు తమ జాబితాలో లక్షద్వీప్‌ను కూడా చేర్చాలి" అని పేర్కొంటూ ఎక్స్‌లో అక్కడి పొటోలు, వీడియోలను షేర్ చేశారు. దానికి పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. ప్రధాని టూర్ భారత పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు. అయితే.. మాల్దీవుల యువజన సాధికార శాఖ సహాయ మంత్రి మరియం షియూనా ప్రధాని మోదీ పోస్టుపై అక్కసు వెళ్లగక్కారు. "ఆయనో విదూషకుడు, తోలుబొమ్మ" అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత మరో ఇద్దరు మంత్రులు మాల్షా షరీఫ్, మజూమ్ మాజిద్ కూడా ఇలాంటి పోస్టులనే పెట్టారు. మాల్దీవుల ఎంపీ జాహిద్ రమీజ్ తీవ్రమైన వ్యాఖ్యలతో ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రధాని మోదీ వీడియోకు ట్యాగ్ చేస్తూ.. "పర్యాటకంలో మాతో పోటీ పడాలన్న ఆలోచన భ్రమే. మాలాంటి సేవలను ఎలా అందిస్తారు? పరిశుభ్రతను ఎలా పాటిస్తారు? అక్కడి(భారత్‌లోని) గదుల్లో వచ్చే వాసన అతి పెద్ద సమస్య" అని వ్యాఖ్యానించారు. ఈ పోస్టులపై భారత నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్ ట్యాగ్‌తో ఎక్స్‌లో భారీ ప్రచారాన్ని ప్రారంభించారు. మాల్దీవుల మాజీ అధ్యక్షులు మహమ్మద్ నషీద్, ఇబ్రహీం సోలీ కూడా తమ మంత్రుల వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుతం మాల్దీవుల ప్రధాని మహమ్మద్ ముయిజు చైనా పర్యటనలో ఉన్నప్పటికీ.. నష్టనివారణ చర్యలు చేపట్టారు. దాంతో.. "మంత్రుల వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమే తప్ప.. మాల్దీవుల ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు" అంటూ మాల్దీవుల సర్కారు ఓ ప్రకటనను విడుదల చేసింది. అయితే.. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్ వైరల్ అవుతుండడంతో.. మంత్రులు మరియం, మాల్షా, మజూమ్‌లను మంత్రివర్గం నుంచి తొలగించింది.

మాల్దీవుల పర్యటనలు రద్దు


ఆర్థికంగా వెనకబడిన దేశంగా పేరున్న మాల్దీవులకు ప్రధాన ఆదాయవనరుల్లో పర్యాటకం ఒకటి. ఆ దేశానికి వెళ్లే పర్యాటకుల్లో 15% భారతీయులే. తాజా పరిణామాల నేపథ్యంలో.. మాల్దీవులకు వెళ్లాలనుకుంటున్న భారతీయులు తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్‌కు విశేష స్పందన వస్తోంది. చాలా మంది నెటిజన్లు తమ ట్రిప్‌ను రద్దు చేసుకున్నట్లు పేర్కొనే ఆధారాలను ఎక్స్‌లో పోస్ట్ చేస్తున్నారు.

తీవ్రంగా స్పందించిన ప్రముఖులు

మాల్దీవుల మంత్రులు, ఎంపీ జాహిద్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ సెలబ్రిటీలు, క్రికెట్ దిగ్గజాలు, ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. మాల్దీవులకు భారత్ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వెళ్తారని, ఆ దేశ మంత్రులు భారత్‌పై అలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని నటుడు అక్షయ్ కుమార్ అన్నారు. లక్షద్వీప్‌లోని పరిశుభ్రమైన బీచ్‌లలో ప్రధాని మోదీని చూడడం బాగుందని జాన్ అబ్రహం వ్యాఖ్యానించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ కూడా మాల్దీవుల మంత్రుల వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. సహజ దీవులకు భారత్ నెలవని, చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు.

బీజేపీపై ఇండియా ఉమ్మడి అభ్యర్థి

ప్రతిచోట ఒక్కరినే నిలిపే వ్యూహం



(ఫైల్)

సీట్లపై కసరత్తు షురూ..నెలాఖరులోగా పూర్తి

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీని ఈసారి కేంద్రంలో ఎలాగైనా గద్దె దించాలన్న లక్ష్యం దిశగా ప్రతిపక్ష ఇండియా కూటమి ఒక్కో అడుగు వేస్తోంది. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకాలపై చర్చలు మొదలయ్యాయి. ఢిల్లీ, పంజాబ్‌లలో అధికారంలో ఉన్న ఆప్‌తో కాంగ్రెస్ నేతలు సోమవారం చర్చలు జరిపారు. ఇండియా కూటమిలో 28 పార్టీలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పోటీగా కూటమి నుంచి ఒకే ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని 'ఇండియా' నిర్ణయించింది. ఈ ప్రతిపాదన మేరకే ఆదివారం చర్చలు జరిగాయి. ఢిల్లీలో మొత్తం ఏడు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నింటినీ బీజేపీ కైవసం చేసుకోగా, ఐదు సీట్లలో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచింది. కాబట్టి, ఈసారి ఢిల్లీలో తమకు ఐదు స్థానాలను కేటాయించాల్సిందిగా కాంగ్రెస్ నేతలు ఆప్‌ను కోరారు. అయితే ఆప్ నాలుగు స్థానాలు వదిలిపెట్టేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఇక పంజాబ్‌లో ఇరుపార్టీల రాష్ట్ర విభాగాలు పొత్తు వద్దని, ఒంటరిగా బరిలోకి దిగుదామని తమ తమ అధిష్ఠానాలను కోరుతున్నాయి. మరోవైపు 40 లోక్‌సభ సీట్లున్న కీలక రాష్ట్రం బిహార్‌లో కూడా కాంగ్రెస్ తన మిత్రపక్షాలతో చర్చలు ప్రారంభించింది. ఆర్జేడీ, జేడీయూ తాము చెరో 17 స్థానాలకు పోటీ చేస్తామని, కాంగ్రెస్‌కు నాలుగు, మిగిలి రెండు సీట్లను వామపక్షాలకు ఇస్తామని చెప్పాయి. కానీ, కాంగ్రెస్ 8 సీట్లు కోరుతోంది. దీనికి ఆర్జేడీ, జేడీయూ అంగీకరించటం లేదు. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో పట్టువిడుపులతో ఉండాలని కాంగ్రెస్‌కు ఆర్జేడీ, జేడీయూ చెప్పినట్లు సమాచారం.


కామ్రేడ్లు, దీదీ.. చెరోదారి

కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో సీట్ల పంపకం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. తృణమూల్, సీపీఎం రెండూ ఇండియా కూటమి పక్షాలే అయినప్పటికీ, బెంగాల్‌లో చేతులు కలపటానికి నిరాకరిస్తున్నాయి. ఇక కేరళలో ఉన్న 20 సీట్లలో 19 కాంగ్రెస్ సిటింగ్ స్థానాలే. రాష్ట్రంలో సీపీఎంతో పొత్తు కోసం కొన్ని సిటింగ్ స్థానాలను కాంగ్రెస్ వదులుకుంటుందా అన్నది సందేహమే. ఇటీవల మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎస్పీ అధినేత అఖిలేశ్, కాంగ్రెస్ మధ్య దూరం పెరిగింది. దీంతో ఎస్పీ కీలక ప్రతిపక్షంగా ఉన్న యూపీలో కాంగ్రెస్‌కు ఎన్ని సీట్లు లభిస్తాయన్నది ఆసక్తి కలిగిస్తోంది. కాగా, ఈ నెలాఖరులోగా మిత్రపక్షాలతో సీట్ల పంపకాల ప్రక్రియను ముగించాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

బంగ్లాదేశ్‌లో హసీనా పార్టీ

ఘన విజయం

ఐదోసారి పీఠం దక్కించుకున్న అవామీలీగ్



ఢాకా, జనవరి 7: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా సారథ్యంలోని పాలక అవామీ లీగ్ పార్టీ ఘన విజయం సాధించి వరుసగా ఐదోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆదివారం ఎన్నికలు ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు మొదలైంది. 299 సీట్లలో అవామీలీగ్ 50% కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుందని ఆ దేశ ఎన్నికల కమిషన్ ప్రతినిధి మీడియాకు తెలిపారు. ఇంకా ఓట్ల లెక్కింపు కొనసాగుతోందన్నారు. అవామీలీగ్ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించిందని సమాచారం. ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సహా డజనుకు పైగా విపక్షాలు ఈ ఎన్నికలను బహిష్కరించాయి. విపక్షాల బహిష్కరణ ప్రభావం పోలింగ్‌పై కూడా పడింది. కేవలం 40% పోలింగ్ మాత్రమే నమోదైంది. 2018 నాటి ఎన్నికలతో పోలిస్తే ఇది సగం మాత్రమే. కాగా, 'భారత్ లాంటి నమ్మకమైన మిత్రుడు పొరుగున ఉండడం మా అదృష్టం. విముక్తి ఉద్యమంలో, ఆ తర్వాత కూడా ఎంతో సహకరించింది. మా తల్లిదండ్రులు, సోదరులను కోల్పోయిన వేళ నాకు, మా చెల్లికి ఆశ్రయం ఇచ్చింది" అని హసీనా అన్నారు. ఎన్నికల్లో ఢాకా సిటీ కాలేజీలో ఓటేసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.



కాంగ్రెస్ నాయకురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ నివాసానికి వచ్చారు. తన కుమారుడి వివాహానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

మే నెలాఖరు కల్లా సీతారామ కాలువలు పూర్తి చేయండి

» యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహించండి

» సమీక్షలో మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి

హైదరాబాద్, ఖమ్మం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మే నెలాఖరు కల్లా సీతారామ కాలువల పనులను పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.13,500 కోట్లతో నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సీతారామ ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో వేగం పెంచితే ఈ ఏడాదిలోనే వైరా ప్రాజెక్టు, లంకా సాగర్, ఎన్నెస్పీ ఆయకట్టులోని సుమారు 1.6 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడానికి అవకాశం ఉందన్నారు. ఇటీవల గండుగులపల్లిలో సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తుమ్మల వివరించారు.

వార్ రూమ్‌గా ఉత్తమ్ నివాసం

న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లోక్‌సభ సభ్యుడుగా ఢిల్లీలో నివసించిన లోధీ గార్డెన్ నివాసాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు వార్‌రూమ్‌గా మార్చింది. అధిష్ఠానం, తమిళనాడుకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి శశికాంత్‌సెంథిల్‌ను చైర్మన్‌గా నియమించి నలుగురు సభ్యులతో కాంగ్రెస్ సెంట్రల్ వార్ రూమ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. మరో ఆరు నెలల వరకు ఈ నివాసాన్ని తన పేరున పొడిగించాల్సిందిగా ఉత్తమ్ లోక్ సభ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించండి

» మంత్రి తుమ్మలకు సీఐటీయూ వర్కర్స్ యూనియన్ వినతి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 350 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ కోరింది. అలాగే చేనేత సహకార సంఘాలకు మాతృసంస్థ అయిన టెస్కోకు కూడా ఎన్నికలు జరపాలని కోరింది. ఆదివారం మంత్రి తుమ్మలను కలిసిన మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, చేనేత సంఘం నేతలు కూరపాటి రమేశ్, వనం శాంతికుమార్, గంజి మురళి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

రేవంత్ పాలనపై ప్రజలు మెచ్చుకోలు: మల్లురవి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నెలరోజుల పాలనను రాష్ట్ర ప్రజలు మెచ్చుకుంటున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. గత 20 ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలను దగ్గరగా చూసిన రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అందరి సమస్యలనూ తీరుస్తున్నారని అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, చనగాని దయాకర్‌తో కలిసి మల్లు రవి మాట్లాడారు. సీఎం పేషీలో అన్నివర్గాల అధికారులను నియమించి సమానత్వ భావనను రేవంత్‌రెడ్డి నెలకొల్పారని, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పేద ప్రజలకు చేరాలని ఆయన భావిస్తున్నారని పేర్కొన్నారు.

‘కాళేశ్వరం’ అవినీతిపై వైఖరి ఎందుకు మారింది?

» కేసీఆర్‌ను కాపాడేందుకేనా విచారణ?: డీకే అరుణ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణకు నాడు డిమాండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఎందుకు వైఖరి మార్చుకుందో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో రూ.వేలకోట్ల అవినీతి జరిగిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన ప్రకటన నిజం కాదా? అని ఆమె కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను కాపాడేందుకే సీఎం రేవంత్‌రెడ్డి, జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారని అరుణ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ జ్యుడీషియల్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కేంద్రం నిధులు ఎందుకోసం అడిగారో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేయాలని అరుణ విజ్ఞప్తి చేశారు.

సమీక్షల పేరిట కాలయాపన: పోచారం

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ సర్కారు సమీక్షలతోనే కాలయాపన చేస్తోందని.. ఇచ్చిన హామీల అమలుకు కనీసం కార్యాచరణ కూడా రూపొందించడం లేదని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఎంపీ బీబీ పాటిల్‌తో కలిసి ఆదివారం మీడియాతో మాట్లాడారు. అధికారం చేపట్టి నెల రోజులయినా.. హామీల అమలుపై దృష్టి పెట్టడం లేదని, దీనికి తోడు గత ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను రద్దు చేస్తూ.. ప్రజలకు నష్టం కలిగిస్తున్నారన్నారు. తాము అధికారంలో లేకున్నా.. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సమన్వయకర్తలు

» 17 నియోజకవర్గాలకు కోఆర్డినేటర్ల నియామకం

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ దూకుడు పెంచింది. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను ఏఐసీసీ నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా తెలంగాణలోని 15 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలుగా రాష్ట్ర మంత్రులను నియమించారు. నిజామాబాద్ పార్లమెంటు బాధ్యతలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఇవ్వగా జహీరాబాద్ కోఆర్డినేటర్‌గా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని నియమించారు. వాస్తవానికి ఇటీవల జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)సమావేశంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రులకు నియోజకవర్గాల వారీగా సమన్వయం చేసుకునే బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు నిర్ణయాన్ని అధిష్ఠానానికి పంపారు. దానికి ఆమోద ముద్ర వేసిన అధిష్ఠానం.. పీఏసీ ప్రతిపాదన మేరకు మంత్రులను సమన్వయ కర్తలుగా నియమించింది.

నియోజకవర్గాల వారీగా సమన్వయ బాధ్యతలు

సీఎం రేవంత్‌రెడ్డి(మహబూబ్‌నగర్, చేవెళ్ల), డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క(హైదరాబాద్, సికింద్రాబాద్), పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి(ఖమ్మం, మహబూబాబాద్), ఉత్తమ్‌కుమార్‌రెడ్డి(నల్లగొండ), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి(భువనగిరి), దామోదర్ రాజనర్సింహ(మెదక్), పొన్నం ప్రభాకర్(కరీంనగర్), శ్రీధర్‌బాబు(పెద్దపల్లి), తుమ్మల నాగేశ్వర్‌రావు(మల్కాజ్‌గిరి), జూపల్లి కృష్ణారావు(నాగర్‌కర్నూల్), సీతక్క(ఆదిలాబాద్), కొండా సురేఖ(వరంగల్), ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి(నిజామాబాద్), మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి(జహీరాబాద్).

ఇందిరమ్మ ఇళ్ల నమూనాలు రెడీ


(మొదటిపేజీ తరువాయి)

మోడల్‌లోనే ఉన్నా.. కొంత తక్కువ విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం ఉంటుంది. ఇందులో.. ప్లింత్ ఏరియా 560 చదరపు అడుగులు కాగా, నిర్మాణ ఏరియా మాత్రం 419 చదరపు అడుగుల్లోనే ఉండనుంది. ఇందులోనూ రెండు బెడ్ రూంలు, కిచెన్, హాల్, బాత్‌రూంతోపాటు వాటర్ క్లోజెట్ (టాయిలెట్, వాష్ బేసిన్) ఉండేలా, ఇంటిపైకి మెట్లు నిర్మించేలా ప్రతిపాదించారు. ఇక మూడో నమూనాను సింగిల్ బెడ్‌రూం ఇంటి మోడల్‌లో రూపొందించారు. ఇది ఒక బెడ్‌రూం, హాల్, కిచెన్‌తోపాటు బాత్‌రూం, వాటర్ క్లోజెట్‌తో కూడి ఉండనుంది. ఈ మోడల్‌లో 390 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా, 323 చదరపు అడుగుల నిర్మాణ ఏరియా ఉంటుంది. ఈ మూడు నమూనాల్లోనూ ఇంటిపైకి మెట్లు కూడా నిర్మించేలా రూపొందించారు.

25 లక్షలకు పైగా దరఖాస్తులు..!

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఈ దరఖాస్తుల్లో ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం కోసం 25 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులన్నింటినీ జిల్లాల వారీగా ఆన్‌లైన్ చేయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం మొదలుపెట్టింది. కొద్ది రోజుల్లో ఏ పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్నది తేలనుంది. ఇందులో భాగంగానే ‘ఇందిరమ్మ ఇళ్ల’ కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్నది కూడా వెల్లడి కానుంది. అందులో ఎంతమంది అర్హులనే విషయాన్ని తేల్చిన తరువాత పథకం అమలుకు ప్రభుత్వ మార్గదర్శకాలను విడుదల చేయనుంది. కాగా, గత ప్రభుత్వం కూడా సొంత జాగా ఉండి, ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి ఆర్థిక సాయంగా రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించింది. అందు కోసం ‘గృహలక్ష్మి’ పేరుతో దరఖాస్తులను కూడా స్వీకరించింది. దరఖాస్తు చేసుకునేందుకు గతేడాది ఆగస్టులో కేవలం మూడు రోజులు మాత్రమే గడువిచ్చింది. అయినా.. అంత తక్కువ సమయంలోనూ దాదాపు 15.05 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 10.05 లక్షల మందిని అర్హులుగా తేల్చింది. కాగా, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ ఇంటి పథకానికి రూ.5 లక్షల సాయం అందిస్తామని చెప్పడంతోపాటు స్థలం లేని వారికి సర్కారే స్థలం ఇచ్చి మరీ ఇంటి నిర్మాణానికి సాయం చేస్తామని చెప్పింది. పైగా దరఖాస్తులను కూడా ప్రతి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరించింది. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి.

మొదటి నమూనా
ప్లింత్ ఏరియా: 506 చదరపు అడుగులు
కార్పెట్ ఏరియా: 430 చదరపు అడుగులు
రెండు బెడ్‌రూంలు, హాల్, కిచెన్





రెండో నమూనా
ప్లింత్ ఏరియా: 560 చదరపు అడుగులు
కార్పెట్ ఏరియా: 419 చదరపు అడుగులు
రెండు బెడ్‌రూంలు, హాల్, కిచెన్

మూడో నమూనా
ప్లింత్ ఏరియా: 390 చదరపు అడుగులు
కార్పెట్ ఏరియా: 323 చదరపు అడుగులు
బెడ్‌రూం, హాల్, కిచెన్



నమూనాలు ఇలా ఉండే అవకాశం ఉంది

‘ప్రజాపాలన’పై నేడు సమీక్ష

తదుపరి చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు, సీఎస్, అధికారులతో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రాష్ట్ర మంత్రులు, అధికారులతో సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు. అనంతరం ప్రజాపాలన కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను సీఎం ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సహా వివిధ శాఖలకు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ఉమ్మడి పది జిల్లాలకు నియామకమైన ప్రజాపాలన నోడల్ అధికారులు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్, జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు కొంత మంది అధికారులు పాల్గొననున్నారు.

ప్రజాపాలనలో 1.25 కోట్ల దరఖాస్తులు

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా 1,25,84,383 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఐదు గ్యారెంటీల కోసం 1,05,91,636 దరఖాస్తులు, ఇతర పథకాల కోసం 19,92,747 దరఖాస్తులు వచ్చాయి. గ్రామ పంచాయతీలు, మునిసిపల్ వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమంలో 1,11,46,293 మంది పాల్గొన్నారు. దరఖాస్తులన్నింటినీ జనవరి 17లోగా డేటా ఎంట్రీ చేయాలని ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. హైదరాబాద్ జిల్లాలో 13.7 లక్షల దరఖాస్తులు రాగా, తక్కువగా ములుగు జిల్లాలో 1.10 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

మరో పథకం అమలు చేసేలా..

ముఖ్యమంత్రి రేవంత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించబోయే మంత్రుల సమావేశంలో పలు కీలక విషయాలు కూడా చర్చకు రానున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులు గడుస్తున్న సందర్భంగా పాలన ఎలా ఉంది, ప్రజల్లో ప్రభుత్వంపై ఎలాంటి చర్చ నడుస్తుందనే అంశాలను సీఎం మంత్రులను అడిగి తెలుసుకోనున్నారు. ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజల భావన ఏమిటని ఆరా తీయడంతో పాటు ఆరు గ్యారెంటీల అమలుపై చర్చించనున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వంద రోజుల్లోనే నెరవేరుస్తామని హామీ ఇచ్చిన పథకాలు, అలాగే జాబ్ క్యాలెండర్ సహా పలు కీలక అంశాలపైనా సీఎం మంత్రులతో చర్చించనున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అమలు చేయగా.. మరో పథకాన్ని కూడా అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటివరకు మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. రాజీవ్ ఆరోగ్య శ్రీలో సాయాన్ని రూ.10 లక్షలకు పెంచింది. మూడోదిగా ఏ పథకం అమలు చేయాలో చర్చించనున్నట్టు సమాచారం.



యశోద ఆస్పత్రిలో కోమటిరెడ్డిని పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కోమటిరెడ్డికి సీఎం పరామర్శ

యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. కోమటిరెడ్డి వారం రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గొంతు ఇన్‌ఫెక్షన్ కారణంగా గత నెలలో ఆయన ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత డిశ్చార్జ్ అయి.. మళ్లీ డిసెంబరు 31న ఆస్పత్రిలో చేరారు. ఊపిరితిత్తుల సమస్యతో ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యం కుదుటపడిందని, ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

నెల రోజుల పాలన తృప్తినిచ్చింది

» ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): సంకెళ్లను తెంచి.. స్వేచ్ఛను పంచి, ప్రజల ఆకాంక్షలను నిజం చేస్తూ సాగిన ఈనెల రోజుల ప్రస్థానం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సేవకులమే తప్ప పాలకులం కాదన్న మాటను నిలబెట్టుకున్నామన్నారు. ఈ నెల రోజుల పాలన..పేదల గొంతుక వింటూ, యువత భవిష్యత్తుకు దారులు వేస్తూ.. మహాలక్ష్ములైన మన ఆడబిడ్డల ముఖాలలో ఆనందాన్ని చూస్తూ, రైతుకు భరోసాను ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో దూసుకుపోయేలా చేసిందన్నారు. పెట్టుబడులకు కట్టుబడున్నామంటూ, పారిశ్రామిక వృద్ధికి పెద్దపీట వేస్తూ నగరాల అభివృద్ధికి నగిషీలు చెక్కుతూ.. చైతన్యపు తెలంగాణ కోసం పట్టుదలతో నెలరోజుల పాలన సాగిందన్నారు. రేవంతన్నగా తనను గుండెల్లో పెట్టుకున్న ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఇక ముందు కూడా బాధ్యతాయుతంగా పాలనను నిర్వర్తిస్తానన్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

పారదర్శకంగా పని చేశాం: మంత్రి ఉత్తమ్

నెల రోజుల పాలనలో ప్రజలకు మరింతగా దగ్గరయ్యామని, నీటి పారుదల శాఖలో జవాబుదారీ, పారదర్శకంగా పని చేస్తున్నామని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన అంటే ఎలా ఉండాలో నెల రోజుల్లోనే చేసి చూపించామన్నారు. నియంత పాలన అంతమై కొత్తగా స్వతంత్రం వచ్చినట్లు తెలంగాణ ప్రజలు భావిస్తున్నారన్నారు. ప్రజలకు పాలకులు, అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటున్నారని అన్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



కేసీఆర్‌తో భేటీ అయిన మాజీ గవర్నర్ నరసింహన్

కేసీఆర్‌ను పరామర్శించిన మాజీ గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తుంటికి ఆపరేషన్ జరిగి కోలుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం మాజీ గవర్నర్ నరసింహన్ పరామర్శించారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకున్న నరసింహన్ దంపతులను మాజీ మంత్రి కేటీఆర్ మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న నరసింహన్.. త్వరలో పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధిలో నరసింహన్ అందించిన సహకారం, రాష్ట్ర ఏర్పాటు, అనంతర పరిణామాలు, ఇతర అంశాలపై ఈ సందర్భంగా ఇరువురు చర్చించుకున్నారు. నరసింహన్ దంపతులకు కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ పట్టు వస్త్రాలిచ్చి సంప్రదాయ పద్ధతిలో అతిథి మర్యాదలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ సంతోష్ కుమార్, బీబీ పాటిల్ పాల్గొన్నారు.

కొత్త జిల్లాలను రద్దు చేస్తే.. ప్రజలు ఊరుకుంటారా?

» రోడ్డు పైకి వచ్చి ఆందోళనలు చేస్తారు

» బీఆర్ఎస్ సిటింగ్‌లను మార్చితే బాగుండు

» పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

» లోక్‌సభ ఎన్నికల్లో గెలుస్తాం: హరీశ్





హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): “కొత్త జిల్లాలను రద్దు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కమిషన్ వేస్తామంటున్నారు. అదే జరిగితే ప్రజలు ఊరుకుంటారా..? రోడ్డెక్కి ఆందోళనలు చేస్తారు” అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన వాళ్లంతా పునరాలోచనలో పడ్డారని, నెల రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అప్రతిష్ఠను మూటగట్టుకుందని చెప్పారు. హామీల అమలుపై దృష్టి పెట్టకపోగా, బీఆర్ఎస్ సర్కారు ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అప్పుడే ప్రజల నుంచి నిరసన సెగలు మొదలయ్యాయని, అప్పులను బూచీగా చూపి.. హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో కేటీఆర్‌తోపాటు ఎంపీ బీబీ పాటిల్, మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో సిటింగ్‌లను మార్చి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోందని, పార్లమెంటు ఎన్నికల్లో అటువంటి పొరపాట్లు జరగనివ్వబోమని చెప్పారు. ఒకరికి సాయం అందితే.. మరొకరు ఈర్ష్య పడేలా ప్రస్తుత సమాజం తయారైందన్నారు. నిజాం సాగర్ మండలంలో అందరికీ దళితబంధు ఇచ్చినా.. మిగిలిన సామాజిక వర్గాల వారు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదని చెప్పారు. 119 సీట్లలో 39 గెలిచామని ఈ సంఖ్య తక్కువేమీ కాదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ ఉంటుందని, ఇందులో బీఆర్ఎస్‌కు అనుకూల పరిస్థితులున్నాయన్నారు. కాంగ్రెస్ 420 హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. అమలు కోసం ఒత్తిడి పెంచుతామని అన్నారు. ప్రభుత్వం మీద విమర్శల విషయంలో తొందరపడటం లేదని, చేయాల్సినవి మాత్రమే అడుగుతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుదాం: హరీశ్

అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గలేదని.. పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుదామని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణకు న్యాయం చేయడం కాంగ్రెస్, బీజేపీల వల్ల కాదని.. మన హక్కులను ఢిల్లీలో సాధించుకోవాలంటే ఈ గడ్డ మీద పుట్టిన బీఆర్ఎస్‌కే పార్లమెంటు ఎన్నికల్లో పట్టం కట్టాలన్న విషయాన్ని జనంలోకి తీసుకువెళ్లాలని చెప్పారు. “కేంద్రంలో ఎవరిని కలిసినా బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని గతంలో ఆరోపించారు. అధికారంలో ఉన్నపుడు కేంద్రంతో మనం సఖ్యతగా లేమని ఇప్పుడు రేవంత్ అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వినతి పత్రాలనే ఆయన కేంద్రానికి ఇస్తున్నారు. హామీల అమలుపై కాకుండా.. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధించడంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. వారి బెదిరింపులకు కార్యకర్తలు భయపడొద్దు” అని హరీశ్ అన్నారు.

కేడర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్లే ఓటమి..

“అధికారంలో ఉన్న పదేళ్లలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. జిల్లాకో పార్టీ కార్యాలయ భవనాన్ని నిర్మించారు కానీ.. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల ఏర్పాటుపై దృష్టి పెట్టలేదు. పార్టీని నమ్ముకున్న కింది స్థాయి నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది” అంటూ పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.పార్టీలోని అంతర్గత సమస్యలు, మన బలహీనతలే కాంగ్రెస్ విజయానికి కారణమయ్యాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ సీటు బోనస్

రెండు స్థానాలకూ తీవ్ర పోటీ.. అందులో ఒకటి మైనారిటీకి!

పరిశీలనలో షబ్బీర్, అజార్, ఫిరోజ్ పేర్లు.. ముస్లింలకు గవర్నర్ కోటాలో ఇస్తే ఇతరులకు చాన్స్

అదే జరిగితే పరిశీలనలో జగ్గారెడ్డి, అద్దంకి, మహేష్‌గౌడ్, హర్కార, సంపత్‌కుమార్ తదితరులు

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లూ అధికార కాంగ్రెస్‌కే దక్కనున్న నేపథ్యంలో వాటిని ఎవరికి కేటాయిస్తారన్నది ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సామాజిక, ఇతర సమీకరణాల ఆధారంగా నాయకులు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన ఈ స్థానాలకు ఒకే ఎన్నిక జరిపితే శాసనసభలో సభ్యుల బలం ఆధారంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెరో ఎమ్మెల్సీ స్థానం దక్కి ఉండేవి. కానీ, కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) రెండు సీట్లకూ విడివిడిగా.. ఈ నెల 29న ఉప ఎన్నిక నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ చేసింది. ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం ఒకేసారి (2027 నవంబరు 30న) ముగియనున్నా.. వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించాలని ఈసీ పేర్కొంది. ఈ నేపథ్యంలో సందేహాల నివృత్తి కోసం అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ ఉపేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి ఎ.సుధాకర్ సీఈవో వికాస్‌రాజ్‌ను కలిశారు. ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా విడివిడిగానే ఎన్నికలు నిర్వహించాలని వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. దీంతో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 11న వేర్వేరు నోటిఫికేషన్ల విడుదలకు అసెంబ్లీ కార్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికలు వేర్వేరుగా జరుగుతుండడంతో రెండు సీట్లూ 64 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్‌కు దక్కడం లాంఛనమే. ఈసీ మార్గదర్శకాలపై బీఆర్ఎస్ శనివారం న్యాయ నిపుణులను సంప్రదించినట్లు తెలిసింది. తర్జన భర్జన తర్వాత ఎన్నికల్లో పాల్గొనకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. 11న నోటిఫికేషన్లు విడుదల కానుండగా ఆలోపే బీఆర్ఎస్ నిర్ణయాన్ని ప్రకటించనుంది. కాగా, రెండు ఎమ్మెల్సీ సీట్లకు ఒకే ఎన్నిక జరిపితే సంఖ్యా బలం రీత్యా అభ్యర్థులను నిలిపేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు మాత్రమే అవకాశం ఉండేది. చెరో సీటు దక్కేది. విడివిడిగా జరుగుతున్నందున రెండూ కాంగ్రెస్‌కే దక్కే పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఆశావహులు భారీ.. దక్కేది ఎవరికో?

ఎమ్మెల్సీ పదవి కోసం కాంగ్రెస్‌లో ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముస్లింల నుంచి ఎమ్మెల్యేగా ఎవరూ గెలవకపోవడంతో.. ఒక్క ఎమ్మెల్సీ సీటును ఆ వర్గానికి ఇస్తారని అంతా భావించారు. ఇప్పుడు అదనంగా దక్కనున్న స్థానానికి పోటీ పెరిగింది. ముస్లిం కోటాలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్, నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్ ప్రయత్నాలు సాగిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ముగ్గురూ ఓడిపోవడం, లోక్‌సభ ఎన్నికల అభ్యర్థిత్వానికి పేర్లు పరిశీలనలో ఉండడం, ఇతర కారణాల రీత్యా అధిష్ఠానం వారి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ ఖుస్రూ పాషా, వరంగల్ జిల్లా నేత జాఫర్ జావేద్ తదితరుల పేర్లూ పరిశీలనలో ఉన్నాయి. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు సీట్లలో ఒకదానిని మైనార్టీ వర్గానికి కేటాయిద్దామన్న ప్రతిపాదనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నారు. సాహిత్య, కళా, సామాజిక రంగాల్లో సేవలందించిన వారిని వీటికి ప్రతిపాదించాల్సి ఉంటుంది. సామాజిక రంగంలో టీజేఎస్ అధినేత కోదండరాం పేరు ఖరారైంది. రెండో సీటుకు ప్రజా కవి అందెశ్రీ పేరు వినిపిస్తోంది. ఈయననే ఖరారు చేస్తే.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ రెండు సీట్లలో ఒకటి కచ్చితంగా ముస్లింలకు కేటాయించాల్సి వస్తుంది. ఒకవేళ.. గవర్నర్ కోటాలోనే ముస్లింలకు ఇస్తే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో రెండు సీట్లూ కాంగ్రెస్ నాయకులకు అందుబాటులోకి రానున్నాయి. దీనికోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు హర్కార వేణుగోపాల్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, సినీ నిర్మాత బండ్ల గణేశ్ తదితరుల పేర్లను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు చేసే విమర్శలను ఎదుర్కొనేందుకు జగ్గారెడ్డిని ఉపయోగించుకోవాలని భావిస్తే.. ఆయనకు ఎమ్మెల్సీ దక్కే అవకాశం ఉంది. బీసీ నేతకు ఇవ్వాలనుకుంటే మహేశ్‌కుమార్‌గౌడ్‌ను వరించనుంది. టీపీసీసీ అధ్యక్షుడు కాకముందు నుంచీ రేవంత్‌కు మద్దతుదారుగా ఉన్న హర్కార వేణుగోపాల్ పేరూ గట్టిగానే వినిపిస్తోంది. అద్దంకి దయాకర్‌ను వరంగల్ నుంచి లోక్‌సభ బరిలో దించాలని అధిష్ఠానం ఆలోచిస్తోంది. మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి కూడా ఎమ్మెల్సీ సీటును ఆశిస్తున్నా.. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా తీసుకుని ఆయన సేవలను ప్రభుత్వంలో వినియోగించుకోవాలని సీఎం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నాగర్‌కర్నూల్ ఓడిన సంపత్‌కుమార్ కూడా తనకు ఎమ్మెల్సీ సీటిచ్చి న్యాయం చేయాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. గతంలో పలువురు నేతలకు ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని నామినేషన్ల దాఖలు ప్రారంభంలోపు అభ్యర్థులపై పార్టీ నాయకత్వం స్పష్టతకు రానుందని చెబుతున్నారు.

హైదరాబాద్‌లో గ్యాంగ్ రేప్ !

» ఓ యువతిపై స్ర్కాప్ గోదాము నిర్వాహకుల అత్యాచారం

మదీన, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఓ యువతి సామూహిక అత్యాచారానికి గురైంది. సోదరునిపై కోపంతో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వచ్చి రోడ్డుపై ఒంటరిగా ఉన్న ఓ అమ్మాయి ఇద్దరు కీచకుల అరాచకానికి బలైంది. మాయమాటల చెప్పి ఆమెను తమ బైక్ ఎక్కించుకున్న కీచకులు ఓ గోదాముకు తీసుకెళ్లి హింసించి తమ కామవాంఛ తీర్చుకున్నారు. హైదరాబాద్, బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేటకు చెందిన ఓ యువతి(21) తన సోదరునితో గొడవపడి శనివారం రాత్రి బస్సులో హైదరాబాద్‌కు వచ్చింది. రాత్రి సుమారు 10:45 గంటల సమయంలో ఇమ్లిబన్ సమీపంలో రోడ్డుపై ఒంటరిగా వెళుతున్న ఆమెను ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడ్డుకున్నారు. ఆమెతో మాటలు కలిపి ద్విచక్రవాహనం ఎక్కించుకున్నారు. తొలుత సిద్దింబర్ బజార్‌లో ఐస్‌క్రీమ్ ఇప్పించారు. అనంతరం ఆ యువతికి మాయమాటలు చెప్పి బండ్లగూడ లేక్‌వ్యూ హిల్స్‌లోని తమ స్ర్కాప్ గోదాముకు తీసుకెళ్లారు. అక్కడ ఆ అమ్మాయిని కొట్టి ఇద్దరూ అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి కేకలు వేయడంతో ఆమెను వదిలి పారిపోయారు. అనంతరం స్థానికుల సూచన మేరకు బాధితురాలు బండ్లగూడ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అత్యాచారానికి పాల్పడిన స్ర్కాప్ గోదాము నిర్వాహకులు కాశీ విశ్వనాథ్, శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

చర్చి స్లాబు సెంట్రింగ్ కూలి కార్మికుడి మృతి

» 9 మందికి గాయాలు.. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో ఘటన

కోహిర్, జనవరి 7: సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో నిర్మాణంలో ఉన్న చర్చి స్లాబ్ సెంట్రింగ్ కూలీ ఓ కార్మికుడు మృతి చెందాడు. తొమ్మిది మంది గాయపడ్డారు. కోహిర్‌లో నూతనంగా నిర్మిస్తున్న చర్చి పనులను హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. చర్చి స్లాబ్ నిర్మాణం పనుల కోసం సంబంధిత కాంట్రాక్టర్ మయన్మార్, బెంగాల్, బిహార్ తదితర ప్రాంతాల నుంచి 19 మంది కార్మికులను తీసుకువచ్చాడు. ఆదివారం చర్చికి స్లాబ్ వేస్తుండగా దానికి సపోర్టుగా అమర్చిన సెంట్రింగ్ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అక్కడ స్లాబ్ పనులు చేస్తున్న పది మందికి గాయాలయ్యాయి. వారిలో మయన్మార్‌కు చెందిన అజీముల్లా (20) మృతిచెందాడు. గాయపడిన వారు కోహిర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



ఇస్తేమాకు హాజరైన ముస్లింలు

పరిగిలో రెండో రోజు కొనసాగిన ఇస్తేమా

పరిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా పరిగిలో తబ్లీగీ జమాతే ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. పరిగి శివారులోని న్యామత్‌నగర్‌లో 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సభా ప్రాంగణానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ ముఖ్య ప్రతినిధి మౌలానా ఫారూఖ్ ప్రసంగిస్తూ, సమాజంలో ఎవరికీ తలవంచకుండా జీవించాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమ కోసం కాకుండా సమాజం కోసం జీవించాలని, ఇతరులకు సాయం చేసే గుణాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఆదివారం ఇస్తేమాకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఇదిలా ఉంటే, వివాహం నిశ్చయమైన వెయ్యి మంది ముస్లిం యువతీ యువకులకు ఆదివారం ఇస్తేమాలో సామూహిక వివాహాలు జరిపించారు.

పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతపై నేడు బీజేపీ భేటీ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతపై బీజేపీ ముఖ్యనేతల సమావేశం సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరగనుంది. వచ్చే ఎన్నికల్లో కనీసం 10 ఎంపీ సీట్లు, 35శాతం ఓటు బ్యాంకు సాధించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పార్టీ నాయకత్వానికి లక్ష్యంగా నిర్దేశించిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్య నేతలు పాల్గొంటారు. మెజారిటీ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పది కమిటీలను ఏర్పాటు చేశారు. 17 నియోజకవర్గాల్లో పార్టీ క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను ఈ కమిటీలకు అప్పగించారు.

ఆధార్.. అవస్థ!



నిజామాబాద్‌లో ఉదయం 6గంటలకు కేంద్రాల వద్ద మహిళలు

(మొదటిపేజీ తరువాయి)

మీసేవ కేంద్రాలు ఉండటంతో సవరణలు అప్పటికప్పుడే జరిగిపోయేవి. అయితే, విదేశీయులు సైతం ఆధార్ పొందుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్రం నియంత్రణ చర్యలు చేపట్టింది. ప్రభుత్వేతర సంస్థలకు ఆధార్ సవరణ అనుమతులను రద్దు చేసింది. దీంతో మీసేవ కేంద్రాల్లో ఆధార్ సేవలు ఆగిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తేనే అనుమతులు ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఆధార్ సవరణలకు కమీషన్ తక్కువగా ఉండటంతో ప్రభుత్వ కార్యాలయాల్లోకి వెళ్లేందుకు అత్యధికులు ఆసక్తి చూపలేదు. మూడేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా 1800 ఆధార్ సవరణ కేంద్రాలు ఉండగా.. 700 మంది మాత్రమే ప్రభుత్వ కేంద్రాలకు మారారు. అయితే, చిన్నపాటి తప్పులకు ఈ కేంద్రాల అనుమతులనూ యూఐడీఏఐ రద్దు చేస్తూ పోతోంది. నిర్దేశించిన డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయలేదన్న కారణాలతో లైసెన్సులను ఏడాదిపాటు డీయాక్టివేట్ చేస్తోంది. ఇలా రాష్ట్రంలో ప్రతినెలా 25-30 ఆధార్ కేంద్రాలను తొలగిస్తుండటంతో వీటి సంఖ్య నానాటికీ తగ్గుతోంది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ సవరణలకు అందుబాటులో ఉన్న కేంద్రాలు 350లోపే ఉన్నాయి. వీటిలో దాదాపు 150వరకు జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. ప్రజల సౌకర్యార్థం పోస్టాఫీసులు, బ్యాంకులు, ప్రభుత్వ బడుల్లో కొన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారని చెబుతున్నా.. ఎక్కడా పని చేస్తున్న దాఖలాలు లేవు. నెట్‌వర్క్ సమస్యలతో రోజుకు నాలుగైదు కంటే ఎక్కువ దరఖాస్తులు తీసుకోవడం లేదు.

రోజుకు 50-60 మందికే అవకాశం

ప్రస్తుతం ఉన్న ఆధార్ కేంద్రాల్లోనూ రోజుకు గరిష్ఠంగా 50-60 మందికే సవరణలు చేయగలుగుతున్నారు. దీంతో ఉదయం 10 గంటలకు కేంద్రం తెరిచేలోపే వందలాది మంది బారులుదీరుతున్నారు. పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తుండడంతో పలు కేంద్రాల వద్ద గొడవలు నిత్యకృత్యంగా మారాయి. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ దోమలగూడ ఆధార్ కేంద్రంలోని ఆపరేటర్‌పై ప్రజలు దాడి చేశారు. జిల్లాల్లో భారీ రద్దీని నియంత్రించేందుకు పోలీసులు రంగంలోకి దిగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇన్ని వ్యయప్రయాసలు ఎదుర్కొని ఆధార్ సవరణలకు దరఖాస్తు చేసినా.. దానిని ఆమోదిస్తారన్న గ్యారెంటీ ఉండట్లేదు. అన్ని డాక్యుమెంట్లు సమర్పించినా.. తిరస్కరణకు గురవుతున్నాయి.

మాదాపూర్‌లో స్లాట్ బుకింగ్ రద్దు

గతంలో ప్రజల సౌకర్యార్థం మాదాపూర్, మూసారాంబాగ్ ఆధార్ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని యూఐడీఏఐ ప్రవేశపెట్టింది. మూసారాంబాగ్‌లో రోజుకు 500మందికి అవకాశం ఉండగా, మాదాపూర్‌లో అత్యధికంగా 2000 మంది స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉండేది. అయితే, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నెల క్రితం మాదాపూర్ కేంద్రంలో స్లాట్ బుకింగ్ విధానాన్ని అకస్మాత్తుగా రద్దు చేశారు. దీంతో అక్కడికి వెళ్లి క్యూలో నిలబడి సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం వెళ్తే సాయంత్రానికి గానీ తమ వంతు రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, మూసారాంబాగ్ కేంద్రంలో స్లాట్ బుకింగ్ అవకాశం ఉన్నా.. వచ్చే 60 రోజులకు సంబంధించిన బుకింగ్‌లు ఫుల్ అయిపోయాయి. వాస్తవానికి మీసేవ కేంద్రాల నుంచి ఆధార్ సేవలను తొలగిస్తూ మూడేళ్ల క్రితం కేంద్రం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచే మిగతా కేంద్రాల వద్ద రద్దీ పెరిగిపోయింది. ఆధార్ కేంద్రాలను పెంచాలని, మరిన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని రెండేళ్ల క్రితం రాష్ట్రం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కానీ.. కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

హైకోర్టు తీర్పుతో కాస్త ఊరట

రాష్ట్రంలో ఆధార్ సేవలు అందిస్తున్న కేంద్రాలు ఇప్పటికే తక్కువ ఉండగా, పలు తప్పులు చేశారన్న కారణంగా ప్రతి నెలా కొన్ని కేంద్రాలను యూఐడీఏఐ రద్దు చేస్తూ పోతోంది. ఆధార్ కేంద్రాల్లో పని చేసే ఆపరేటర్లకు యూఐడీఏఐ ప్రత్యేక బయోమెట్రిక్ సాఫ్ట్‌వేర్ యాక్టివేట్ చేస్తుంది. దాని ఆధారంగానే ఆధార్‌లో సవరణకు అవకాశం ఉంటుంది. అయితే, సదరు ఆపరేటర్ ఉద్యోగం మానేస్తే మరో ఆపరేటర్‌కు బయోమెట్రిక్ యాక్టివేషన్ చేయడం లేదు. అలాగే, ఆయా కేంద్రాల్లోని డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లకు యూఐడీఏఐ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తుంది. ఒక వేళ అవి మరమ్మతుకు గురైతే.. మరో డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్‌కు సాఫ్ట్‌వేర్ మార్చడం లేదు. ఇలా.. ఏడాది కాలంలో 400 కేంద్రాల అనుమతులను యూఐడీఏఐ రద్దు చేసింది. దీనిపై మీసేవ నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించగా.. గత నెలలో సానుకూలంగా తీర్పువచ్చింది. సిస్టమ్, ఆపరేటర్ మార్పు కారణంగా రద్దుచేసిన లైసెన్సులను పునరుద్ధరించాలన్న ఆదేశాలతో గత నెలలో 50-60కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో మరిన్ని అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

» ఇద్దరి మృతి.. 9 మందికి తీవ్రగాయాలు

» మృతుల్లో డ్రైవర్, ప్రయాణికురాలు

» ఇద్దరూ నల్లగొండ జిల్లా వాసులే..

» ఏపీలోని నెల్లూరు వద్ద ప్రమాదం

మిర్యాలగూడ టౌన్/నేరేడుచర్ల/గుడ్లూరు, జనవరి 7: ధాన్యం లోడ్‌తో ముందెళ్తున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో దాని డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా, మరో ప్రయాణికురాలు చికిత్స పొందుతూ మరణించింది. ఈ ఘటనలో మరో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారు జామున ఏపీలోని నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం మోచర్ల వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మిర్యాలగూడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ మీదుగా తిరుపతికి బయలుదేరింది. లాంగ్ సర్వీస్ కావడంతో ఇద్దరు డ్రైవర్లు పోకల వినోద్‌కుమార్ (27), ఎం.వెంకన్న వెళ్లారు. వినోద్‌కుమార్ బస్సు నడుపుతుండగా, అందులో 21 మంది ప్రయాణికులున్నారు. ఈ నేపథ్యంలోనే తెల్లవారుజామున మోచర్ల వద్ద ముందు వెళ్తున్న ధాన్యం లోడ్‌ను లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నల్లగొండ జిల్లా తాళ్లవీరప్పగూడేనికి డ్రైవర్ వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో డ్రైవర్ వెంకన్న సహా 10 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రానికి చెందిన సీతమ్మ (56) పరిస్థితి విషమించి మృతి చెందింది. సీతమ్మ సంక్రాంతి పండుగ నేపథ్యంలోని నెల్లూరు జిల్లాలోని కూతురు దగ్గరికి బయలుదేరినట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ పాల్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీతారాం అనే ప్రయాణికుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. డ్రైవర్ వినోద్ మృతితో మిర్యాలగూడ డిపో ఆర్టీసీ ఉద్యోగుల్లో విషాదం నింపింది.

బాధ్యతలు అప్పుడే చేపట్టొద్దు..!

» 4 రోజుల కిందే 23 మంది ఐపీఎస్‌ల బదిలీ

» కొందరికి బాధ్యతలు స్వీకరించొద్దని ఆదేశాలు

» వారి పని తీరుపై అభ్యంతరాలు రావడంతోనే..

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండే రెవెన్యూ, పోలీసు విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈనేపథ్యంలోనే క్లీన్ చిట్ ఉన్నవారికి వారి సామర్థ్యం మేరకు బదిలీలు, పోస్టింగులు కల్పించారు. నాలుగు రోజుల కిందే 23 మంది ఐపీఎస్‌లను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో వెయిటింగ్‌లో ఉన్న వారికీ పోస్టింగులు లభించాయి. అయితే తాజా బదిలీల్లో కొంతమందికి బాధ్యతలు చేపట్టవద్దని మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా మెరిట్, ట్రాక్ రికార్డు ఆధారంగానే పోస్టింగ్‌లకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన బదిలీల్లో కొందరి ట్రాక్ రికార్డుపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో.. వారిని బాధ్యతలు చేపట్టవద్దని మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. తాజా బదిలీల్లో ఇప్పటివరకు బాధ్యతలు చేపట్టని వారు ఎవరనేది ఎవరికి వారుగా లెక్కలేసుకుంటున్నారు. కాగా, త్వరలో మరికొంత మంది ఐపీఎస్‌ల బదిలీలకు రంగం సిద్ధం చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు బాధ్యతలు చేపట్టొద్దని చెప్పిన వారిని పక్కనబెట్టి వారి స్థానంలో కొత్త వారిని నియమించే అవకాశముంది. ఐపీఎస్ పోస్టింగుల విషయంలో ఏ అభ్యంతరాలకు తావులేకుండా..కచ్చితంగా వ్యవహరించాలనే ఉద్దేశంతోనే సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సాహితీ ఇన్‌ఫ్రా మోసం 1,800 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సాహితీ ఇన్‌ఫ్రా కేసు దుమ్ము దులిపారు. సాహితీ కేసును అతిపెద్ద ఆర్థిక మోసంగా గుర్తించారు. వందల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు మోసపోయారని, వారికి న్యాయం చేయాలని సంకల్పించారు. "ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తులో సాహితీ సంస్థ రూ.1,119 కోట్లు కొల్లగొటినట్లు తేలింది. ఇంకా రూ.700 కోట్ల వరకు అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి. మొత్తంగా రూ.1,800 కోట్ల మేర స్కామ్ వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి" అని ఆయన వివరించారు. సాహితీ మోసం బారిన పడిన 300 మంది బాధితులను పిలిపించిన రంగనాథ్.. వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. "త్వరలోనే కేసును ఓ కొలిక్కి తీసుకువస్తాం. సాహితీ ఇన్‌ఫ్రా కొనుగోలు చేసిన ఆస్తులను అటాచ్ చేసి, న్యాయస్థానం అనుమతితో వాటిని విక్రయిస్తాం. ఆ డబ్బును బాధితులకు పంచేలా చర్యలు తీసుకుంటాం" అని భరోసా ఇచ్చారు.

సాహితీ నేరశైలి ఇదీ..!

ప్రీలాంచ్ పేరుతో సాహితీ ఎండీ లక్ష్మీనారాయణ తొమ్మిది ప్రాజెక్టులను తెరపైకి తీసుకువచ్చారని రంగనాథ్ తెలిపారు. అందుకోసం లక్ష్మీనారాయణ అనుసరించిన నేరశైలి(మోడస్‌ఆపరెండీ)ని వివరించారు. "తక్కువ ధరకే ఫ్లాట్లు అని నమ్మబలికి.. వినియోగదారుల నుంచి వసూలు చేశారు. అమీన్‌పూర్‌లో 23 ఎకరాల్లో 10 టవర్లు, 32 అంతస్తుల్లో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. 2019 నుంచి 2022 వరకు ప్రాజెక్టు కంప్లీట్ చేసి అపార్టుమెంట్స్ అందజేస్తానని హామీ ఇచ్చారు. తొలుత 1,752 మంది వినియోగదారుల నుంచి రూ.504 కోట్లు సేకరించారు. అయితే.. 23 ఎకరాలకు బదులు.. 10 ఎకరాలే కొనుగోలు చేశారు. మిగతా 13 ఎకరాల విషయంలో అగ్రిమెంట్లు మాత్రమే చేసుకున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి అనుమతుల కోసం హెచ్ఎండీఏకు దరఖాస్తు చేశారు. ఆ తర్వాతే.. డబ్బును పక్కదారి పట్టించడం ప్రారంభించారు. ఆ తర్వాత విడతల వారీగా వసూలు చేసిన మొత్తం లెక్క తేల్చాం. ఆ డబ్బును ఎక్కడెక్కడ ఖర్చుచేశారు? అనే వివరాలను ఆడిటర్లు, సాహితీ ఉద్యోగుల ద్వారా సేకరించాం" అని రంగనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాకు ఆ వివరాలను అందించారు. కొల్లగొట్టిన డబ్బును సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ దారిమళ్లించినట్లు గుర్తించామని రంగనాథ్ తెలిపారు. సాహితీ సర్వాని ఎలైట్‌కు ముందే మూడు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అవి.. కార్తీకేయ పనోరమ(మాదాపూర్), సాహితీ కృతి బ్లోసమ్(మాదాపూర్), సాహితీ సుదీక్ష(మోకిల). తొమ్మిది ప్రాజెక్టుల పేరుతో సేకరించిన మొత్తాన్ని ఈ మూడు వెంచర్లలో పెట్టారని వివరించారు.

ఇలా ఖర్చు చేశారు..

గ్రూప్ ఆఫ్ కంపెనీస్	153,66,78,356
ఎండీ లక్ష్మీనారాయణ ఖర్చు	202,43,91,560
వినియోగదారులకు తిరిగి చెల్లించిన మొత్తం	70 కోట్లు
అడ్వాన్స్‌లు చెల్లించిన డబ్బు	544,31,54,993
కమీషన్లుగా చెల్లించిన మొత్తం	70,26,69,127
ఇతర ఖర్చులు	32,53,74,336
డొనేషన్స్	14,34,47,000
దీర్ఘకాలిక రుణాల చెల్లింపులు	23,69,69,477
మొత్తం ఖర్చు	1,111,26,84,849

సాహితీ ఇన్‌ఫ్రా 9 ప్రాజెక్టుల పేరుతో వసూలు చేసిన మొత్తం, బాధితుల సంఖ్య

ప్రాజెక్టు పేరు	బాధితుల సంఖ్య	వసూలు చేసిన మొత్తం (రూ. కోట్లలో)
సాహితీ స్వధా కమర్షియల్ నానక్‌రామ్‌గూడ	69	65
శిష్ట ఎడోబ్(కొంపల్లి)	248	79
సాహితీ గ్రీన్(కొంపల్లి)	153	40
సాహితీ సితార కమర్షియల్ రోలింగ్(గచ్చిబౌలి)	249	135
సాహితీ మెహతో సెంట్రో(బంజారాహిల్స్)	44	22
ఆనంద్ ఫార్చ్యూన్(నిజాంపేట)	120	45.50
సాహితీ కృతి బ్లోసమ్(గచ్చిబౌలి)	25	16
సాహితీ సుదీక్ష(మోకిల)	30	22
రూబీకాన్ సాహితీ(బాచుపల్లి)	43	6.9

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.